Postel No. MBN/08/2016-2018

పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స

మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యం చేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895

# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :24 | సంచిక :297 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | శుక్రవారం 20 ఫిబ్రవరి 2026 | పేజీలు :12 | వెల రూ5 /-

## రేవంత్ వన్ మ్యాన్ షో..



హైదరాబాద్,, ఫిబ్రవరి 19:తెలంగాణలో ఇటీవల ముగిసిన మున్సిపల్ ఎన్నికలు రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఒక యాసిడ్ టెస్ట్‌గా నిలిచాయి. ప్రభుత్వ వ్యతిరేకత పేరుతో జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టి.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 80 శాతానికి పైగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగరేయడం రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహ చతురతకు నిదర్శనంగా మారింది. ముఖ్యంగా పట్టణ ఓటర్లు కూడా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడం, గతంలో కేవలం గ్రామీణ పార్టీగా ఉన్న ముద్రను రేవంత్ చెరిపివేయగలిగారు. ఈ విజయంతో ఆయన హైకమాండ్ వద్ద తన పరపతిని అమాంతం పెంచుకున్నారు.ఢిల్లీ వేదికగా రేవంత్ రెడ్డి చేసిన నేనే రాజు.. నేనే మంత్రి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. అయితే, దీనిపై ఆయన తర్వాతి కాలంలో స్పష్టత ఇచ్చారు. తాను ముఖ్యమంత్రిగా ఉండటంతో పాటు, మున్సిపల్ పరిపాలన శాఖను కూడా తానే పర్యవేక్షిస్తున్నందున, ఈ ఎన్నికల గెలుపోటములకు తానే పూర్తి బాధ్యత వహిస్తాననే ఉద్దేశంతో ఆ మాట అన్నట్లు వివరించారు. ఒక సేవకుడిగానే తాను బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని చెబుతూనే, బాధ్యతను భుజానికెత్తుకునే విషయంలో తనకున్న తెగింపును ఈ వ్యాఖ్యల ద్వారా చాటారు. కాంగ్రెస్ పార్టీలో సహజంగా ఉండే గ్రూపు రాజకీయాలు రేవంత్ రెడ్డి విషయంలో ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు. పార్టీలో ఆలస్యంగా చేరినప్పటికీ, సీనియర్లను సమన్వయం చేసుకుంటూనే, తన నిర్ణయాలే ఫైనల్ అనే స్థాయికి ఆయన ఎదిగారు. గతంలో బహిరంగంగా విమర్శలు చేసిన నాయకులు కూడా ఇప్పుడు మౌనం వహించడం. రేవంత్ నాయకత్వాన్ని సమర్థించడం ఆయన సాధించిన అతిపెద్ద రాజకీయ విజయం. హైకమాండ్ - మిగతా3లో

## మల్లికార్జున ఖర్గేతో తెలంగాణ కాంగ్రెస్ నేతల భేటీ..

### పలు కీలక అంశాలపై చర్చ..

**ఢిల్లీ, ఫిబ్రవరి 19** : ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఇవాళ (గురువారం) సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఖర్గే చర్చించారు. రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై రెండు గంటల పాటు ఖర్గే సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల్లో.. మెజారిటీ అమలు చేశామన్నారు. తమ ప్రభుత్వానికి ఇంకా మూడేళ్ల సమయం ఉందని చెప్పారు. హామీలన్నీ అమలు చేసి శభాష్ అనిపించుకుని, మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో రూ.8 లక్షల కోట్లు అప్పుపెట్టారని ఆరోపించారు. ఉన్న నిధుల్లో తమ ప్రభుత్వం పథకాలన్నింటినీ చాకచక్యంగా అమలు చేస్తోందని



చెప్పుకొచ్చారు.

నామినేటెడ్ పదవుల భర్తీ..

మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై తెలంగాణ మంత్రివర్గాన్ని - మిగతా3లో

## రెండు సీట్లు.. ఇరవై మంది ఆశావహులు...

హైదరాబాద్, ఫిబ్రవరి 19:తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. ప్రస్తుత సభ్యులు అభిషేక్ మను సింఘ్వీ , కె.ఆర్. సురేష్ రెడ్డి ల పదవీకాలం ఏప్రిల్ 9తో ముగియనుంది. వీరిలో సింఘ్వీ కాంగ్రెస్ నుంచి.. సురేష్ రెడ్డి బీఆర్ఎస్ నుంచి ఎంపికయ్యారు. మార్చి 16న జరగనున్న ఈ ఎన్నికల్లో శాసనసభలో ఉన్న బలాబలాల ప్రకారం ఈ రెండు స్థానాలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. పార్టీల బలాబలాల విశ్లేషణను పరిశీలిస్తే, 119 స్థానాలున్న తెలంగాణ అసెంబ్లీలో ఒక రాజ్యసభ సీటు గెలవడానికి సుమారు 40 మొదటి ప్రాధాన్యతా ఓట్లు అవసరం. కాంగ్రెస్ పార్టీకి సొంతంగా 65 మంది ఎమ్మెల్యేలు ఉండటమే కాకుండా, ఇతర పార్టీల నుండి



చేరిన ఎమ్మెల్యేల మద్దతుతో రెండు స్థానాలను సులువుగా గెలుచుకునే అవకాశం ఉంది. మరోవైపు, ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ తన వద్ద ఉన్న సంఖ్యాబలం సరిపోకపోవడంతో ఈసారి తన స్థానాన్ని కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది. బీజేపీ, మజ్లిస్ - మిగతా3లో

## 28న బడ్జెట్..

**ఈ నెల 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు,**

**23వ తేదీన మంత్రివర్గ సమావేశం**

**10 నుంచి 15 రోజుల పాటు బడ్జెట్ సమావేశాలు**

**మొదటి రోజు గవర్నర్ ప్రసంగం**



త్వరలో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 26వ తేదీ నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 28వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 23వ తేదీన మంత్రివర్గ సమావేశం అనంతరం బడ్జెట్ సమావేశాల తేదీని ప్రకటించనున్నారు. పది నుంచి పదిహేను రోజుల పాటు బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క నేతృత్వంలో శాఖల వారీగా మంత్రులు, అధికారులతో సమావేశమై ప్రతిపాదనలను స్వీకరించారు.

## తగ్గనున్న ఏసీ బస్సు చార్జీలు...



హైదరాబాద్,, ఫిబ్రవరి 19:ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ తీపికబురు అందించింది. ఇప్పటికే రాష్ట్రంలో సమ్మర్ మొదలైనట్లు కనిపిస్తుంది. పగటి ఉష్ణోగ్రతలు క్రమక్రమంగా పెరుగుతున్నాయి. మొన్నటివరకు చలి పులి వణికించగా.. ఇప్పుడు ఆ తీవ్రత తగ్గి భానుడి భగభగలు మొదలవుతున్నాయి. ఎండకాలం వస్తున్న క్రమంలో ఏసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ప్రజలు ఎక్కువమంది ఆసక్తి చూపిస్తారు. ఈ క్రమంలో ప్రజలకు బస్సుల్లో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలిగించేందుకు టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ఏసీ బస్సుల్లో ఛార్జీలను భారీగా తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. కేవలం జీహెచ్ఎంసీ పరిధిలో తిరిగే ఎలక్ట్రిక్ ఏసీ బస్సుల్లో - మిగతా3లో

## తెలంగాణ ఇంటర్ హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్

**ఈసారి ఇంటర్ పరీక్షలు రాయనున్న 9.9 లక్షల మంది విద్యార్థులు**

**ఈరోజు ఇంటర్ హాల్ టికెట్ల విడుదల**

**ఎగ్జామ్ సెంటర్లను ఈజీగా గుర్తించేందుకు క్యూఆర్ కోడ్ ముద్రణ**

ఈ నెల 25వ తేదీ నుంచి తెలంగాణలో ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 9.9 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజవుతున్నట్టు ఇంటర్ బోర్డు తెలిపింది. మరోవైపు ఇంటర్ పరీక్షల హాల్ టికెట్లను ఈరోజు విడుదల చేశారు. ఆయా కళాశాలల ఆన్ లైన్ లాగిన్లతో హాల్ టికెట్లను అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు. విద్యార్థులు తమ కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి హాట్ టికెట్లు తీసుకోవాలని అధికారులు సూచించారు. మొబైల్ ఫోన్ల - మిగతా3లో




## బీజేపీ-బీఆర్ఎస్ పొత్తుపై .. పెరుగుతున్న చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 19:ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత విచిత్రమైన , ఆసక్తికరమైన సమీకరణాలకు తెరలేపాయి. సిద్ధాంతపరంగా బద్ధశత్రువులుగా కనిపించే పార్టీలు క్షేత్రస్థాయిలో అధికారం కోసం చేతులు కలపడం 'అవకాశవాద రాజకీయం'గా కనిపిస్తున్నా, దీని వెనుక లోతైన వ్యూహాలు దాగి ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల కంటే స్థానిక గెలుపు గుర్రాలే కీలకం కావడంతో చాలా చోట్ల అనూహ్య పొత్తులు కనిపించాయి. బీజేపీ-కాంగ్రెస్, బీఆర్ఎస్-బీజేపీ వంటి అసంభవమైన కలయికలు కొన్ని మున్సిపాలిటీల్లో అధికార పీఠాలను కైవసం చేసుకున్నాయి. నిజామాబాద్ వంటి చోట్ల కాంగ్రెస్-




మజ్లిస్ జతకట్టడం గమనార్హం. రాష్ట్ర స్థాయిలో నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నా, స్థానిక కౌన్సిలర్లు మాత్రం తమ ఉనికిని కాపాడుకోవడానికి పార్టీల మధ్య ఉన్న గీతలను చెరిపివేశారు.బీఆర్ఎస్ నేత హరీష్ రావు వంటి వారు ఇతర పార్టీల అనైతిక పొత్తులపై విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ, స్థానిక సమీకరణాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. గ్రామీణ , పట్టణ స్థానిక సంస్థల్లో నాయకత్వం వ్యక్తిగత ప్రాబల్యంపై ఆధారపడి ఉంటుంది. అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఎన్నికల నాటికి ఈ సమీకరణాలు మారిపోయి, మళ్ళీ ఆయా పార్టీల అధిష్టానాల ఆదేశాల మేరకు రాజకీయాలు నడుస్తాయి. అయితే ఈ మున్సిపల్ ఎన్నికలు పార్టీల మధ్య ఉన్న రాజకీయ అంటరానితనం - మిగతా3లో

## పార్టీ నుంచి దానం సస్పెన్షన్...

హైదరాబాద్, ఫిబ్రవరి 19:దానం నాగేందర్ పార్టీ మార్పిడి, అనర్హత వేటు అంశం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. దానంపై అనర్హతా వేటు కోసం బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. అదే సమయంలో ఆయన లోక్ సభకు పోటీ చేయడంతో బీజేపీ కూడా అనర్హతా పిటిషన్ వేసింది. దానిపై విచారణ బుధవారం జరిగింది. అయితే దానంపై సస్పెన్షన్ వేటు వేసినట్లుగా బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసిందని బిజెపి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చెబుతున్నారు. అయితే ఈ విషయంపై బీఆర్ఎస్ ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన



చేయలేదు. సాధారణంగా - మిగతా3లో

## జీహెచ్ఎంసీ విభజనపై హైకోర్టులో రిట్ పిటిషన్..

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు..**

**హైదరాబాద్, ఫిబ్రవరి 19** : జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించడంపై తెలంగాణ కోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. జీవో నంబర్ 55ను సవాల్ చేస్తూ కోర్టులో గురువారెడ్డి అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్‌పై హైకోర్టు ఇవాళ(గురువారం) విచారణ చేపట్టింది. 2027 జనగణన నేపథ్యంలో రిజిస్ట్రార్ జనరల్, సెన్స స్ కమిషనర్ ఆఫ్ ఇండియా జారీ చేసిన సర్క్యులర్ నంబర్ -01 ప్రకారం.. జ్యూరీ డిస్టింక్షన్ ఫ్రీజ్ అమల్లో ఉందని పిటిషనర్ వాదనలు వినిపించారు. మున్సిపల్ సరిహద్దులు మార్చడం, స్థానిక సంస్థల పునర్వ్యవస్థీకరణ చట్ట విరుద్ధమని పిటిషనర్ తెలిపారు. జీవో నంబర్ 55ను




రద్దు చేయాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ ధర్మాసనం విచారణ చేసింది. పిటిషనర్ వాదనలు విన్న అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని రెండు ప్రభుత్వాలనూ ఆదేశించింది.

## సంపాదకీయం

# ఈ ఒప్పందంతో.. దేశ రైతాంగానికి ఉరే!

భారత్-అమెరికా మధ్య కుదిరిన తాజా వాణిజ్య ఒప్పందం దేశ రాజకీయాల్లోనే కాకుండా వ్యవసాయ రంగంలోనూ తీవ్ర చర్చకు దారి తీసింది. అమెరికా అధికార వర్గాలు దీన్ని తమ రైతులకు లాభదాయకమని పేర్కొనడంతో..ఈ ఒప్పందం రైతాంగానికి ముప్పుగా మారుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతు న్నాయి. ఈ నేపథ్యంలో, ఈ వాణిజ్య ఒప్పందం దేశ రైతాంగ భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ వాణిజ్య ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించడం సైతం సర్వత్రా విమర్శలకు కారణమైంది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, పలువురు ప్రతిపక్ష నేతలు ఈ వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, పాడి పరిశ్రమలకు సంబంధించిన ప్రయోజనాలను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినా, మోడీ ప్రభుత్వం ఎవరి విజ్ఞప్తులను పట్టించుకోకుండా ముందుకు వెళ్లడంతో అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. ఇప్పటికే మోడీ ప్రభుత్వ నిరంకుశపూరిత వైఖరికి నిరసనగా.. ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా రైతు సంఘాలు సమ్మె నిర్వహించాయి. ఈ ఒప్పందం మీద అమెరికా మంత్రి బ్రూక్ రోలిన్స్ మాట్లాడుతూ.. ఈ నిర్ణయం అమెరికా రైతులకు లాభదాయకమని అభివర్ణించారు.. కానీ, భారతీయ రైతులకు ఈ ఒప్పందం శరఘాతంలా మారిన విషయం ప్రధాని మోడీ ఆయన పరివారం ఎందుకు గుర్తించడం లేదో? కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి. అమెరికా సోయాబీన్ ఆయిల్, డిస్టిలర్స్ గ్రెయిన్స్‌కు భారత మార్కెట్ తలుపులు తెరవడం ద్వారా దేశీయ రైతును తన నేలపైనే పోటీ చేయలేని స్థితికి నెట్టివేస్తున్నారు. చౌక విదేశీ దిగుమతులు పాడి, పశుసంవర్ధక రంగాలను కూల్చి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీస్తాయి. 'పంట మనది – లాభం పరాయిది' అనే దోపిడీ విధానాన్ని దేశంపై ప్రధాని మోడీ బలవంతంగా రుద్దుతున్నారు.. ఎంఎస్‌పీ హామీలతో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం నేడు అంతర్జాతీయ డంపింగ్‌కు ద్వారాలు తెరిచి రైతును బలి చేస్తోందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.. రైతు రక్షణ ముసుగులో అమెరికా బహుళజాతి సంస్థల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నది. ఈ ఒప్పందం భారత ఆహార భద్రతను బలహీనపరిచే కుట్రనే. దేశానికి సంబంధించిన ఇంతటి కీలక నిర్ణయం తీసుకునే ముందు... రాష్ట్రాలను సంప్రదించక పోవడం, పార్లమెంటులో చర్చ జరపకపోవడం, రైతు సంఘాల అభిప్రాయాన్ని లెక్కలోకి తీసుకోకపోవడం ప్రజాస్వామ్య విలువల స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించారు. ఇది రాజ్యాంగ విలువల్నీ పాతరేయడం కిందకు వస్తుంది. ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసి రైతుకు చట్టబద్ధ రక్షణ కల్పించాల్సిన అసవరముంది. దేశాన్ని పోషించే రైతును బలి చేసి ఏ ప్రభుత్వం నిలబడలేదన్న విషయం మోడీ గుర్తించుకోవాలి. ఈ ఒప్పందం పాడి పరిశ్రమపై తీవ్రంగా ప్రభావం చూపుతుంది. అమెరికా నుండి పౌల్ట్రీ ఉత్పత్తులు, డిస్టిలర్స్ గ్రెయిన్స్ (పశువుల మేతగా వాడేవి) దిగుమతి అయితే, దేశీయ పశు గ్రాసం ధరలు పడిపోయతాయి. పాడి రైతులకు ఆదాయం తగ్గుతుంది. మన అవసరాలకు సరిపడా ఆహారాన్ని మనమే పండించుకోకుండా, దిగుమతులపై ఆధారపడితే.. భవిష్యత్తులో అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల వల్ల దేశంలో ఆహార కొరత ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. అందుకే రైతులు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)ను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, దానిని ఒక చట్టపరమైన హక్కుగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర జాబితాలో ఉన్న వ్యవసాయం గురించి కేంద్రం నిర్ణయాలు తీసుకునేటప్పుడు రాష్ట్రాలను సంప్రదించ కపోవడంపై ఆగ్రహం కల్పించడం జరుగుతున్నది. వ్యవసాయ రంగంలోకి బహుళజాతి సంస్థల ప్రవేశం వల్ల రైతు కేవలం ఒక 'కూలీ'గా మారిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం రాష్ట్ర పరిధిలోని అంశం. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం ఇలాంటి ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్ల కేంద్ర-రాష్ట్రాల సయోధ్య పోతుంది. ఇంతటి కీలకమైన మార్కెట్ మార్పులపై పార్లమెంటులో చర్చ జరగకపోవడం వల్ల, భవిష్యత్తులో తలెత్తే లోటుపాట్లను సరిదిద్దే అవకాశం లేకుండా పోతుంది. అమెరికా వంటి దేశాల్లో యాంత్రీకృత వ్యవసాయం వల్ల ఖర్చులు తక్కువ, కానీ భారత్‌లో ఎక్కువ మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు.. వీరిద్దరి మధ్య పోటీ అనేది అసమానమైనది. ఈ విషయాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ఒప్పందాన్ని వెనక్కి తీసుకొని... భారత రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

# నేడు ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం

ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 20న నిర్వహించబడుతుంది. చట్టపరంగా ఎలాంటి వివక్షత, తారతమ్యం లేకుండా ప్రజలందరికి సమన్యాయం జరగాలని ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవం జరుపుకుంటారు. పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యలను అధిగమించడానికి చేయవలసిన కృషికోసం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం జరుపుకోవాలన్న ప్రతిపాదనను 2007, నవంబరు 26న జరిగిన ఐక్యరాజ్యసమితి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం, ఎ/ఆర్ఈఎస్/62/10 పై తీర్మానించగా 2009, ఫిబ్రవరి 20న తొలిసారిగా ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం




జరుపబడింది. సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించవలసిన అవసరాన్ని గుర్తించి పేదరికం, లింగ సమానత్వం, నిరుద్యోగం, మానవ హక్కులు, సామాజిక రక్షణ వంటి అనేక సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నించడం అంతర్జాతీయంగా వివిధ దేశాల మధ్య స్నేహ బాంధవ్యాలు ఏర్పాటుచేయడం, సామరస్య వాతావరణం సాధించడం, వివిధ దేశాలమధ్య సమాన ప్రాతిపదికపై సంబంధాలు నెలకొల్పడం విలువలు, స్వేచ్ఛ, వ్యక్తి గౌరవం, భద్రత, ఆర్థిక సామాజిక పురోభివృద్ధి వంటి ప్రాథమిక అంశాల విషయంలో ఎటువంటి వివక్షత పాటించకుండా సామాజిక న్యాయం అమలయ్యేలా చూడడం దీని ముఖ్య లక్ష్యం.

# డిజిటల్ ఇండియా చట్టం....

ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా వినియోగం పెను సవాలుగా మారుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. మైనర్లు లేదా చిన్న పిల్లలు సోషల్ మీడియాకు బానిసలవుతున్నారనే ఆందోళనల నేపథ్యంలో వయస్సు ఆధారిత పరిమితులువిధించే అంశంపై ప్రభుత్వం తీవ్రంగా చర్చిస్తోంది. ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ విషయాన్ని వెల్లడించారు. పిల్లల మానసిక ఆరోగ్యం, ఆన్‌లైన్ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లు ఆయన సూచించారు. సోషల్ మీడియా వేదికలు యువతపై చూపిస్తున్న ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఆస్ట్రేలియా వంటి దేశాలు ఇప్పటికే 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించే దిశగా చట్టాలు చేశాయి. భారత్‌లో కూడా ఇటువంటి నిబంధనలు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. "పిల్లల భద్రత విషయంలో మేము రాజీ పడము. సోషల్ మీడియా వాడకానికి కనీస వయస్సు ఎంత ఉండాలనే దానిపై వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నాము. దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు కానీ, లోతైన చర్చలు మాత్రం జరుగుతున్నాయి" అని స్పష్టం చేశారు. చిన్న వయస్సులోనే సోషల్ మీడియాకు అలవాటు పడటం వల్ల పిల్లల్లో ఏకాగ్రత తగ్గడం, నిద్రలేమి, సైబర్ బుల్లింగ్ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా అశ్లీల కంటెంట్ లేదా హానికరమైన గేమింగ్ యాప్‌లు పిల్లల దారి మళ్లిస్తున్నాయని తల్లిదండ్రుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రస్తుతం చాలా సోషల్ మీడియా సంస్థలు 13 ఏళ్లు నిండిన వారు ఖాతా తెరవవచ్చని చెబుతున్నప్పటికీ, వయస్సును ధృవీకరించే బలమైన వ్యవస్థలు లేవు. దీనివల్ల పదేళ్ల లోపు పిల్లలు కూడా తప్పుడు వివరాలతో లాగిన్ అవుతున్నారు. ప్రభుత్వం తీసుకురాబోయే కొత్త నిబంధనల వల్ల 'ఏజ్ వెరిఫికేషన్' ప్రక్రియ మరింత కఠినతరం కానుంది. అమెరికా, యూరోపియన్ దేశాల్లో కూడా సోషల్ మీడియా (సంస్థలపై కఠినమైన నిబంధనలు విధిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి ప్లాట్‌ఫారమ్‌లు పిల్లల డేటాను ఎలా సేకరిస్తున్నాయి? వారికి ఎటువంటి కంటెంట్‌ను చూపిస్తున్నాయి? అనే దానిపై నిఘా పెరిగింది. భారత్ కూడా ఇప్పుడు అదే బాటలో పయనిస్తోంది. ప్రతిపాదిత 'డిజిటల్ ఇండియా చట్టం' లో భాగంగా సోషల్ మీడియా సంస్థలకు జవాబుదారీతనాన్ని పెంచాలని కేంద్రం యోచిస్తోంది. ప్రభుత్వం కేవలం నిషేధాలకే పరిమితం కాకుండా, డిజిటల్ అక్షరాస్యతను పెంచడంపై కూడా దృష్టి సారిస్తోంది. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు తమ అల్గారిథమ్‌లను మార్చుకోవాలని, పిల్లలకు హాని కలిగించే కంటెంట్ రాకుండా చూడాలని మంత్రి సూచించారు. ఒకవేళ సంస్థలు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధించే అవకాశం కూడా ఉంది. అయితే ఈ ప్రక్రియలో ఇంటర్నెట్ స్వేచ్ఛకు, గోప్యతకు భంగం కలగకుండా చూడటం కూడా ప్రభుత్వానికి ఒక సవాలుగా మారింది. మొత్తానికి కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియా ప్రపంచంలో కలకలం రేపుతున్నాయి. డిజిటల్ ఇండియా చట్టం భారతదేశం నుండి దాని మొత్తం చరిత్రలో వెలువడే అత్యంత ముఖ్యమైన ఐటీ చట్టం అవుతుంది మరియు రాబోయే దశాబ్దం లేదా రెండు దశాబ్దాల పాటు మొత్తం దేశం యొక్క డిజిటల్ చట్టాలను సమర్థవంతంగా నియంత్రిస్తుంది. ఈ కొత్త చట్టంతో, దేశం తన డిజిటల్ చట్టాలను భవిష్యత్తుకు అనుగుణంగా మార్చుకోవాలని మరియు వ్యాపారాలు ప్రపంచ స్థాయిలో పోటీ పడటానికి వీలు కల్పించాలని ఆశిస్తోంది. అదనంగా, డిజిటల్ ఇండియా చట్టం యొక్క ముసాయిదా రూపకల్పనలో అనేక మంది వాటాదారులను (పౌరులను) పాల్గొనడానికి మరియు సంప్రదించడానికి భారత ప్రభుత్వం ప్రయత్నించింది, దీని నియమాలు మరియు చట్రం కనీసం వచ్చే దశాబ్దం పాటు దేశంలో సమగ్ర ఐటీ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేసేలా చూసుకోవాలి. అయితే, అంతిమ లక్ష్యం పౌరుల గోప్యతా హక్కుల కోసం బలమైన చట్టాలను నిర్ధారించడం మరియు ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంపొందించడం మాత్రమే కాదు – డిజిటల్ ఇండియా చట్టం భారతీయ వ్యాపారాలకు డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి మరియు ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా దేశాన్ని ప్రపంచవ్యాప్త డిజిటల్ పవర్‌హౌస్‌గా మార్చడానికి రూపొందించబడింది. డిజిటల్ ఇండియా చట్టం చుట్టూ కేంద్రీకృతమై, భారతదేశం 2026 నాటికి ట్రిలియన్ డాలర్ల డిజిటల్ ఆర్థిక వ్యవస్థను సాధించగలదని చంద్రశేఖర్ విశ్వసిస్తున్నారు. భారత పార్లమెంటు నవంబర్ 2022లో ప్రతిపాదించబడిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు, 2022 తో పాటు డిజిటల్ ఇండియా చట్టాన్ని అమలు చేయాలని యోచిస్తోంది . ఈ రెండు చట్టాలు ఒకదానికొకటి కలిసి పనిచేస్తాయి, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు భారతదేశంలో వ్యక్తిగత డేటాను ప్రాసెస్ చేయడంపై మాత్రమే దృష్టి సారిస్తుంది. 2000 నాటి ఐటీ చట్టం చాలా కాలం చెల్లినది మరియు దాని ప్రారంభంలో "ఇంటర్నెట్" గురించి దాదాపుగా ప్రస్తావించబడలేదు. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక ఇంటర్నెట్ కనెక్షన్ ఉన్న దేశం అనే స్థాయికి చేరుకుంటున్నందున, , కానీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు మాత్రమే నిర్వచించబడిన నియమాలు ఉన్నాయి. సమాచార భాగస్వామ్యాన్ని సులభతరం చేసే లేదా ఆన్‌లైన్ సేవలను అందించే ఏదైనా కంపెనీ లేదా ప్లాట్‌ఫారమ్‌ను మధ్యవర్తులు అంటారు. ఇతర ఆన్‌లైన్



ప్లాట్‌ఫామ్‌లను "స్వచ్ఛమైన మధ్యవర్తులు"గా వర్గీకరించారు మరియు కలిసి సమూహం చేశారు. మూడవ పక్షాల నుండి ఉద్దేశపూర్వక తప్పుడు సమాచారం లేదా ఇతర కంటెంట్ ఉల్లంఘనలకు సంబంధించి ఆన్‌లైన్ మధ్యవర్తులకు "సేఫ్ హార్బర్" రోగనిరోధక శక్తిని తొలగించడంగతంలో, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల వంటి ఆన్‌లైన్ మధ్యవర్తులకు "సేఫ్ హార్బర్" చట్టపరమైన రోగనిరోధక శక్తి ఇవ్వబడింది, వారి సంబంధిత ప్లాట్‌ఫారమ్‌లలో పోస్ట్ చేయబడిన మూడవ పక్ష కంటెంట్‌పై వారికి ఎటువంటి నియంత్రణ లేనందున వాటిని సమర్థవంతంగా రక్షించింది. అయితే, మధ్యవర్తులకు రోగనిరోధక శక్తి ఇవ్వబడినందున, వారికి మూడవ పక్ష కంటెంట్ యొక్క నియంత్రణ లేదు, ఇది తరచుగా వాస్తవ తనిఖీ లేకపోవడం మరియు కంటెంట్ ఉల్లంఘనలను తొలగించకపోవడానికి దారితీస్తుంది. డిజిటల్ ఇండియా చట్టం ప్రకారం, ప్రతి మధ్యవర్తి వర్గం కొత్త నిబంధనలకు లోబడి ఉంటుంది,డిజిటల్ ఇండియా చట్టం కింద సైబర్ బెదిరింపు, వంచన, గుర్తింపు దొంగతనం , మోసం, డాక్సింగ్ మరియు హానికరమైన అనధికార వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం వంటి కొత్త రకాల సైబర్ నేరాలను కొత్త క్రిమినల్ నేరాలుగా వర్గీకరించాలని ఎలక్ట్రానిక్స్ మరియు ఐటీ మంత్రిత్వ శాఖ యోచిస్తోంది . గతంలో, ఈ నేరాలకు జరిమానాలు విధించేవారు మరియు ఐటీ చట్టం ద్వారా నేరంగా పరిగణించబడలేదు. డిజిటల్ స్థలం (బిగ్ టెక్) యొక్క గుత్తాధిపత్యాన్ని తొలగించడంమరియు స్థానిక స్టార్టప్‌ల నుండి న్యాయమైన పోటీని మరియు వినియోగదారులకు మరిన్ని ఎంపికలను అనుమతించడం. పెద్ద యాడ్‌టెక్ కంపెనీలను నియంత్రించే ఇలాంటి సందర్భంలో, డిజిటల్ ఇండియాప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయం కోట్లాది మంది భారతీయ విద్యార్థులు, యువత భవిష్యత్తుపై ప్రభావం చూపనుంది. తల్లిదండ్రులు, విద్యావేత్తలు మాత్రం ఈ దిశగా ప్రభుత్వం అడుగులు వేయడాన్ని స్వాగతిస్తున్నారు.

# ఆత్మకూరు లో క్షయ వ్యాధి నివారణ అవగాహన కార్యక్రమం

**ఆత్మకూరు:**ప్రపంచ క్షయ వ్యాధి నివారణ వారోత్సవాలు నంద్యాల జిల్లా కలెక్టర్, నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మరియు నంద్యాల జిల్లా లెప్రసీ ఎయిడ్స్ మరియు టిబి కంట్రోల్ ఆఫీసర్ గారి ఆదేశాల మేరకు ఆత్మకూర్ టీ బి యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పవన్ కుమార్ సార్ తెలిపిన విధంగా ఆత్మకూరు నందు గల జిల్లా పరిషత్ హై స్కూల్ బాలికలు హెడ్మాస్టర్ జి ఉమారాణి మరియు సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ కల్లూరి పెద్ద మస్తానయ్య వారి ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి మైక్రో బ్యాక్టీరియంటుబర్క్లోసిస్ ద్వారా ఒకరి నుండి మరొకరికి ఎడతెరిపిలేని దగ్గు, దగ్గు తో పాటు గళ్ళ పడడం, దగ్గు తో పాటు రక్తం పడడం, సాయంత్రం జ్వరం రావడం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, లాంటి లక్షణాలు కలవారు దగ్గరలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు గళ్ళ పరీక్ష మరియు మెడికల్ ఆఫీసర్ గారితో పరీక్ష చేయించుకుని క్షయ అని నిర్ధారణ అయిన తర్వాత మెడికల్ ఆఫీసర్ గారు తెలిపిన విధంగా డాట్ సిస్టం ద్వారా నిర్ధారించిన మాత్ర లను సరైన సమయంలో సరైన మోతాదులో తీసుకోవడం వల్ల క్షయ పూర్తిగా నయం అవుతుంది. 56 రోజులకు ఒకసారి ఐపి గల్ల పరీక్ష తర్వాత 112లకు కంటిన్యూషన్ ఫేస్ గల్ల పరీక్ష చేయించుకుని పూర్తిగా నయమైనది తెలుసుకున్న తర్వాత రెండు సంవత్సరాల వరకు ఆరు నెలలకు ఒకసారి ఫాలోఅప్ చేయించుకోవడం వల్ల క్షయ వ్యాధి పూర్తిగా నయం అవడమే




కాకుండా మరలా రాదు అని నిర్ధారణ చేసుకోవచ్చు. ఈ విధంగా కాకుండా ఒక క్షయ వ్యాధిగ్రస్తుని కి మందులు వాడించకపోతే ఒక సంవత్సరంలో 15 మందికి అదేవిధంగా రెండో సంవత్సరంలో 225 మందికి మూడో సంవత్సరంలో 4000 పైగా క్షయ వ్యాధిగ్రస్తులు ఏర్పడవచ్చు అందువలన నివారించడం చాలా కష్టమవును అందువలన ప్రతి లక్షణాలను త్వరగా గుర్తించడం, క్షయ వ్యాధి లక్షణాలను గల వారిని త్వరగా గళ్ళ పరీక్ష, చేయించడం. గళ్ళ పరీక్షలో క్షయ నిర్ధారణ అయినవారికి త్వరగా డాట్ సిస్టం ద్వారా మందులు మింగించడం వలన క్షయ వ్యాధిని నివారించడంలో ప్రతి ఒక్కరం తోడ్పడుతామని సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ కల్లూరి పెద్ద వస్తానయ్య తెలియజేసినారు. స్కూల్ హెడ్మాస్టర్ జి ఉమా రాణి ప్రతి ఒక విద్యార్థిని విద్యార్థులు క్షయ వ్యాధి నివారణలో విద్యార్థి పాత్రను పోషించి చేయవాది నివారణలో తోడ్పడాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తిరుమల, సునీత, చంద్రకళ, శంషాద్ బేగం, జ్యోతి కర్ణమ్మ, విజయలక్ష్మి, స్వర్ణలత, విజయభారతి, లక్ష్మీదేవి, శశికళ, రజియా భాను, మంజుల, పద్మజ, లక్ష్మీ తులసి, లక్ష్మీదేవి వరలక్ష్మి, శంకరయ్య పాల్గొన్నారు మరియు స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు


# బీజేపీ-బీఆర్ఎస్ పొత్తుపై .. పెరుగుతున్న చర్చ

- మొదటి పేజీ తరువాయి

పోయిందని స్పష్టం చేశాయి. ఈ ఎన్నికల తర్వాత అత్యంత ఆసక్తికరమైన చర్చ బీజేపీ – బీఆర్ఎస్ పొత్తు గురించి మొదలైంది. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవాలంటే ఈ రెండు పార్టీలు కలవడం ద్వారా ఓటు బ్యాంక్ ఏకీకరణ జరుగుతుందని ఒక వర్గం అభిప్రాయపడుతోంది. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల ఓట్ షేర్ కలిపితే అది అధికార పార్టీ కంటే ఎక్కువగా ఉండటమే ఈ చర్చకు ప్రధాన కారణం. కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి ఈ రహస్య లేదా బహిరంగ పొత్తు మున్సిపల్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి వెళ్లే అవకాశం ఉందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. బీజేపీకి పట్టణ ప్రాంతాల్లో, బీఆర్ఎస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పట్టును కలిపితే బలమైన శక్తిగా ఎదగవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, ఉమ్మడి శత్రువును ఓడించడానికి రెండు పార్టీలు చేతులు కలపడం వ్యూహాత్మకంగా లాభిస్తుంది. అయితే, ఈ పొత్తు వల్ల ఇరు పార్టీల సిద్ధాంతాలకు తూట్లు పొడిచినట్లవుతుందనే భయం కూడా నాయకత్వాల్లో ఉంది. మైనారిటీ ఓట్లు కోల్పోతామనే భయం బీఆర్ఎస్‌కు ఉంటే, హిందుత్వ ఓటు బ్యాంకులో చీలిక వస్తుందేమోనన్న ఆందోళన బీజేపీలో ఉంది. రాబోయే రోజుల్లో ఈ రెండు పార్టీలు పొత్తుల గురించి ఆలోచన చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎందుకంటే, తెలంగాణలో కాంగ్రెస్‌ను ఒంటరిగా ఢీకొట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టతరమని ఈ మున్సిపల్ ఫలితాలు నిరూపించాయి. రాష్ట్ర స్థాయి రాజకీయం ఎప్పుడూ అధికారం చుట్టూనే తిరుగుతుంది కాబట్టి, భవిష్యత్తులో బీజేపీ-బీఆర్ఎస్ కలిసి పనిచేయడం అనేది అసాధ్యమేమీ కాదు. అయితే అది బహిరంగ పొత్తుగా ఉంటుందా లేదా లోపాయికారి ఒప్పందంగా ఉంటుందా అనేది కాలమే నిర్ణయించాలి.

# పార్టీ నుంచి దానం సస్పెన్షన్...

- మొదటి పేజీ తరువాయి


ఒక పార్టీకి చెందిన ఎమ్మెల్యే మరో పార్టీలోకి వెళ్తే ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడే అవకాశం ఉంటుంది. అయితే, ఒకవేళ పార్టీయే సదరు నేతను ముందే సస్పెండ్ చేసినట్లు కోర్టుకు తెలిపితే, అప్పుడు ఆ నేత స్వతంత్ర హోదాను పొందుతాడు లేదా సాంకేతికంగా అనర్హత నుంచి తప్పించుకునే వెసులుబాటు ఉంటుంది. బిఆర్ఎస్ పార్టీ దానం నాగేందర్‌ను సస్పెండ్ చేసినట్లు అఫిడవిట్ ఇచ్చి ఉంటే, అది ఆయనను అనర్హత నుంచి కాపాడుతుంది. ఒకవైపు తమ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ చేర్చుకుంటోందని బిఆర్ఎస్ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పోరాటం చేస్తోంది. మరోవైపు, అదే పార్టీకి చెందిన కీలక నేతపై అనర్హత వేటు పడకుండా సస్పెన్షన్ అనే అస్త్రాన్ని ప్రయోగిస్తే, అది ఆ పార్టీ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తుంది. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం.. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినా లేదా విప్ ధిక్కరించినా అనర్హత వేటు పడుతుంది. కానీ, పార్టీయే సదరు సభ్యుడిని



బహిష్కరిస్తే అతను సభలో స్వతంత్రుడిగా కొనసాగవచ్చు. ఒకవేళ బిఆర్ఎస్ అఫిడవిట్‌లో సస్పెన్షన్ ప్రస్తావన ఉంటే, పిటిషనర్ల వాదన కోర్టులో వీగిపోయే ప్రమాదం ఉంది. దీన్నే ఏలేటి మహేశ్వర్ రెడ్డి రాజకీయ కుట్రగా అభివర్ణిస్తున్నారు. ఒకవేళ బిఆర్ఎస్ కావాలనే దానంను కాపాడుతోందని ప్రజల్లోకి సంకేతాలు వెళ్తే, ఆ పార్టీ నైతిక విజయాన్ని కోల్పోతుంది. ముఖ్యంగా ఇతర ఎమ్మెల్యేల అనర్హత విషయంలో బిఆర్ఎస్ చేస్తున్న పోరాటానికి విలువ లేకుండా పోతుంది. తమ పార్టీ నేతలను కాంగ్రెస్‌కు అప్పగించి, బయటకు మాత్రం పోరాడుతున్నట్లు నటిస్తున్నారు అనే విమర్శలను కేడర్ నుంచి ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇది పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. ప్రస్తుతం నెలకొన్న గందరగోళంపై బిఆర్ఎస్ నాయకత్వం తక్షణమే స్పందించాల్సి ఉంది. సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఏముందో బహిరంగ పరచకపోతే, రాజకీయంగా బిఆర్ఎస్ ఆత్మరక్షణలో పడక తప్పదు. బిజెపి చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలంటే చట్టపరమైన ఆధారాలతో క్లారిటీ ఇవ్వడం ఆ పార్టీకి అత్యవసరం. దానం నాగేందర్ విషయంలో జరుగుతున్న ఈ పరిణామాలు కేవలం ఒక ఎమ్మెల్యే అనర్హతకు సంబంధించినవి మాత్రమే కాదు..కీలక రాజకీయ మార్పులకు కారణం అయ్యే అంశం అవుతుందని భావిస్తున్నారు.

# కాడిని వదిలేసిన రాకేష్ రెడ్డి

**నిజామాబాద్, ఫిబ్రవరి 19:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో.. బీజేపీకి పట్టుంది. కాషాయం కంచుకోటల్లో.. ఆర్మూర్ పట్టణం ఒకటని నమ్ముతారు ఆ పార్టీ పెద్దలు. అందుకు తగ్గట్టే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి 18వేల మెజార్టీతో గెలిచారు. అలాగే... లోక్‌సభ ఎన్నికల్లోనూ.. ఆర్మూర్ టౌన్‌లో ఆ పార్టీకి చెప్పుకోతగ్గ ఓట్లు పడ్డాయి. పటిష్టమైన క్యాడర్, బలమైన సంఘ్ పరివార్ నేతలు ఉండటం ఇక్కడ మనకు ప్లస్ అంటూ లెక్కలేసుకుంటూ ఉంటారు కమలం లీడర్స్. అందుకే మున్సిపల్ ఎన్నికల్లో.. ఆర్మూర్ పీఠం మనదేనని గట్టిగా నమ్మారు. బయట కూడా ఈ టౌన్ బీజేపీదే అనేలా.. టాక్ నడిచింది. కానీ... తీరా చూస్తే.... యాంటీ క్లైమాక్స్ కనిపించింది. ఫలితాలు తలకిందులై ఆ పార్టీకి ఊహించని షాక్ ఇచ్చాయి. స్థానికంగా బీజేపీ ఎమ్మెల్యే ప్రాతినిథ్యం వహిస్తున్నప్పటికీ.. కేవలం 8 వార్డులనే గెల్చుకోవడం ఏంటో అర్థంగాక పార్టీ నాయకులు తలలు పట్టుకుంటున్నారట. అసలు ఎక్కడ తేడా కొట్టిందంటూ ఎవరికి వారు ఆరా తీయడం మొదలుపెట్టారు. ఈ మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా.. 19 చోట్ల గెలిచి ఛైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కానీ... అంత హైప్ ఉన్న బీజేపీ మాత్రం సింగిల్ డిజిట్‌కే పరిమితమై కొత్త సందేహాలకు లేవనెత్తిందంటున్నారు పరిశీలకులు. ఇక్కడ బీఆర్ఎస్ ఐదు, స్వతంత్రులు ముగ్గురు గెలవగా.. ఎంఐఎం అభ్యర్థి ఒక చోట విజయం సాధించారు. గెలుపు మాదేనని ధీమాగా ఉన్న బీజేపీ కేడర్ ఫలితాల షాక్ నుచి ఇంకా కోలుకోలేకపోతోందట. దీంతో అట్టర్ ఫ్లాప్ షోకు.. కారణం



ఎవరన్న చర్చ పార్టీలో జోరుగా జరుగుతోంది. ఆర్మూర్ ఫలితాలపై విశ్లేషణ చేస్తామని పార్టీ ఎంపీ సైతం అనడం, లోకల్ కేడర్‌కు ఎంపీ అర్వింద్ క్షమాపణ చెప్పడం లాంటి పరిణామాల్ని చూస్తుంటే.... ఇదేం యాదృచ్ఛికంగా జరిగింది కాదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయంటున్నారు కొందరు. పట్టణంలో బలమైన క్యాడర్ ఉండటం, స్థానికంగా పార్టీ ఎమ్మెల్యే ఉండటం లాంటి బలమైన కారణాలు చాలానే కనిపిస్తున్నా... గెలుపునకు బదులు సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడం వెనకున్న కథల్ని వెలికితీసే పనిలో పార్టీ పెద్దలున్నట్టు సమాచారం. ఆల్రెడీ రంగంలోకి దిగి విశ్లేషణలు మొదలుపెట్టినట్టు సమాచారం. సీనియర్ లీడర్స్ మధ్య అంతర్గత విభేధాలు, పట్టణంలో ముఖ్య నేతలు పోటీకి దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది..? ఎలక్షన్ టైంలో సీనియర్స్ ఇళ్ళకే ఎందుకు పరిమితం కావాల్సి వచ్చింది లాంటి అనేక అంశాలపై చర్చ జరుగుతోందట. వాటన్నిటికీ మించి కాంగ్రెస్ మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న నాయకుడు పోటీ చేసిన వార్డులో బీజేపీ తన అభ్యర్థిని ఎందుకు నిలపలేదన్నది బిగ్ క్వశ్చన్. ఈ విషయంలో తెర వెనుక ఏం జరిగిందంటూ.... అన్ని అంశాలపై పార్టీ బాధ్యులు ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట తీరు, వాడే భాష సైతం ఫలితాలపై ప్రభావం చూపిందనే చర్చ ఉంది. ఆయన దూకుడు తత్వం అసెంబ్లీ ఎన్నికల్లో సక్సెస్‌కు కారణం కాగా.. మున్సిపల్ ఎన్నికలకు వచ్చేసరికి అదే మైనస్ అయిందన్న మాటలు సైతం వినిపిస్తున్నాయి ఆర్మూర్‌లో. ఎమ్మెల్యే వైఖరి పార్టీని కూడా బలహీనపరుస్తోందని అంటున్నారు. సాధారణంగా....ఎన్నిక ఏదైనా దగ్గరుండి పర్యవేక్షించే ఎంపీ అర్వింద్.. ఆర్మూర్ మున్సిపాలిటీని ఎమ్మెల్యేకే వదిలేశారట. ఆయన పర్యవేక్షణ లేకపోవడం కూడా మెరుగైన ఫలితాలు రాకపోవడానికి ఓ కారణంగా చర్చ జరుగుతోంది. అందుకే... రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పర్యవేక్షణ బాధ్యతను ఎంపీనే తీసుకోవాలన్న డిమాండ్ పెరుగుతోంది. ఆర్మూర్ ఫలితాల్లో లెక్క ఎక్కడ తప్పిందో....అది కాకతాళీయమా లేక కావాలనే జరిగిందా? తెర వెనక సంగతులేంటో... పార్టీ పెద్దలు తేల్చాలన్న డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది ఆర్మూర్ కాషాయ దళంలో

# రేవంత్ వన్ మ్యాన్ షో..

- మొదటి పేజీ తరువాయి

పూర్తి మద్దతు ఉండటంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో రేవంత్ ఇప్పుడు ఒక్కడే మొనగాడు గా కనిపిస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి వ్యతిరేక కామెంట్లు చేస్తున్నా ఆయనను ఎవరూ పట్టించుకోవడం లేదు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నెక్ట్స్ జనరేషన్ లీడర్‌గా గుర్తింపు పొందుతున్నారు. హిందీ, ఇంగ్లీష్ భాషల్లో అనర్గళంగా మాట్లాడుతూ జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించడమే కాకుండా, ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో పార్టీకి స్టార్ క్యాంపెయినర్‌గా మారుతున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల నమ్మకాన్ని చూరగొనడంలో ఆయన సఫలీకృతులయ్యారు. వరుసగా అసెంబ్లీ, పార్లమెంట్, పంచాయతీ ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలు సాధించడంతో తెలంగాణలో రేవంత్ రెడ్డికి ఎదురులేకుండా పోయింది. అటు విపక్ష బీఆర్ఎస్ బలహీనపడటం, ఇటు బీజేపీ పట్టణ ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో పుంజుకోకపోవడం రేవంత్‌కు కలిసొచ్చింది. తన సంక్షేమ పథకాలు, దూకుడుగా ఉండే రాజకీయ శైలితో రేవంత్ రెడ్డి తెలంగాణ రాజకీయ యవనికపై ఒక బలమైన ముద్ర వేశారు. ఇది రేవంత్ నాయకత్వ పరంగా పంజుకోవడానికి కలసి వచ్చింది.

# రెండు సీట్లు.. ఇరవై మంది ఆశావహులు...

- మొదటి పేజీ తరువాయి



ఎవరికీ మద్దతుగా ఓట్లేసే అవకాశం లేదు. మజ్లిస్ ఒక వేళ ఓటింగ్ లో పాల్గొంటే కాంగ్రెస్‌కు సహకరిస్తుంది. అందుకే రెండు సీట్లు కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్తాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అందుకే కాంగ్రెస్‌లో అభ్యర్తులు ఎక్కువగా పోటీ పడుతున్నారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీకి రెన్యువల్ దాదాపు ఖాయమని తెలుస్తోంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ గళాన్ని వినిపించడంలో, పార్టీకి సంబంధించిన న్యాయపరమైన అంశాలను డీల్ చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఉప ఎన్నిక ద్వారా ఆయన తెలంగాణ నుంచి ఎంపికయ్యారు, ఇప్పుడు పూర్తి కాలానికి గాను ఆయనను హైకమాండ్ మళ్ళీ బరిలోకి దింపే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం. ఇక రెండో స్థానం కోసం తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన వేం నరేందర్ రెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. అలాగే మాజీ మంత్రి, సీనియర్ నేత టి. జీవన్ రెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, మాజీ విసి సుదర్శన్ రెడ్డి, పార్టీలో సీనియర్ అయిన వి. హనుమంతరావు, ఇటీవల బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కె. కేశవరావు వంటి హేమాహేమీలు ఈ రేసులో ఉన్నారు. సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని అధిష్టానం ఎవరిని వరిస్తుందో చూడాలి. ఈ ఎన్నికల ప్రక్రియ ఫిబ్రవరి 26న నోటిఫికేషన్‌తో ప్రారంభమై మార్చి 16న పోలింగ్, అదే రోజు కౌంటింగ్‌తో ముగియనుంది. సింఘ్వీ అభ్యర్థిత్వం దాదాపు ఖరారు కావడంతో, మిగిలిన ఒక్క సీటు కోసం పైరవీలు ఢిల్లీ స్థాయికి చేరుకున్నాయి. పార్టీ విధేయులకే ప్రాధాన్యత ఉంటుందని అధిష్టానం సంకేతాలు ఇస్తున్న సమయంలో , ఈ రెండో బెర్త్ ఎవరికి దక్కుతుందనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

# మల్లికార్జున ఖర్గేతో తెలంగాణ కాంగ్రెస్ నేతల భేటీ..

- మొదటి పేజీ తరువాయి



కాంగ్రెస్ హై కమాండ్ అభినందించిందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. 80 శాతం ప్రజలు సంతృప్తితో ఉన్నారని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ విధివిధానాలను ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అడిగి తెలుసుకున్నారని వివరించారు. వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థాయిలో ఉందని.. మిగతా పంటలను ప్రోత్సహించాలని ఖర్గే చెప్పారని అన్నారు. ఈ సమావేశంలో భవిష్యత్తులో అనుసరించాల్సిన అంశాలపై ఖర్గే సూచనలు చేశారని తెలిపారు. ఆహ్లాదకర వాతావరణంలో ఈ భేటీ జరిగిందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర మంత్రుల అభిప్రాయాలను పెద్దలు విన్నారన్నారు. అన్ని అంశాలపై తమకు దిశానిర్దేశం చేశారని తెలిపారు. మార్చి మొదటి వారంలో నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.

**అన్ని హామీలను అమలు చేస్తాం..**

మార్చి 15వ తేదీ కల్లా పార్టీ పదవులను భర్తీ చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. అన్ని గ్యారెంటీలను అమలు చేసిన తర్వాతే ఎన్నికలకు వెళ్తామని తెలిపారు. రాజ్యసభ ఎన్నికలపై రెండు, మూడు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డిని, తనని పిలిచి మాట్లాడతామని ఖర్గే అన్నారని తెలిపారు. మంత్రివర్గ విస్తరణ అంశం చర్చకు రాలేదన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంశం చర్చకు వచ్చిందని, ఈ విషయంపై అధిష్టానం పెద్దలు త్వరలోనే ఆయన్ను పిలిచి మాట్లాడతామని అన్నారని చెప్పుకొచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రంలో 80శాతం మంది ప్రజలు కాంగ్రెస్‌ని ఆశీర్వదించారని అన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ విధివిధానాలను రాహుల్ గాంధీ అడిగి తెలుసుకున్నారని తెలిపారు. రాజకీయంగా, ప్రభుత్వ పరంగా అన్ని అంశాలనూ రాహుల్ గాంధీ అడిగి తెలుసుకున్నారని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# తగ్గనున్న ఏసీ బస్సు చార్జీలు...

- మొదటి పేజీ తరువాయి

మాత్రమే ఈ తగ్గింపు అమలు కానుంది. దీంతో నగరవాసులు ఎండ వేడి, ఉక్కబోత సమస్య నుంచి బయటపడనున్నారు. నగర పరిధిలో సేవలు అందించే సిటీ ఎలక్ట్రిక్ ఏసీ బస్సుల్లో అన్నింటిల్లోనూ 30 శాతం వరకు ఛార్జీలు తగ్గించనున్నారు. మార్చి 1వ తేదీ నుంచి మే నెలాఖరు వరకు ఈ తగ్గింపు అమల్లో ఉంటుంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ ఏసీ బస్సుల్లో ఛార్జీ ఎక్కువగా వసూలు చేస్తుండగా.. ఈ తగ్గింపుతో మెట్రో ఎక్స్‌ప్రెస్ ఛార్జీలతో సమానంగా ఏసీ బస్సుల ఛార్జీలు ఉండనున్నాయి. అయితే మహిళలకు ఎప్పటిలాగే మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం అమల్లో ఉంటుంది. టికెట్ తీసుకుని ప్రయాణించేవారికి ఈ తగ్గింపుతో ఛార్జీల భారం తగ్గడంతో పాటు ఎండాకాలంలో సౌకర్యవంతమైన ప్రయాణం ఏసీ బస్సుల్లో లభించనుందని చెప్పవచ్చు. ఇక శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు సర్వీసులు అందించే పుష్పక్ ఏసీ బస్సుల్లోనే 30 శాతం టికెట్ల ఛార్జీలను తగ్గించనున్నారు. దీంతో ఎయిర్ పోర్ట్‌కు వెళ్లే ప్రయాణికులకు కూడా ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం నగర పరిధిలో అన్ని ప్రాంతాలకు ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. వీటిల్లో ఏసీ సౌకర్యం అందుబాటులో ఉంటుంది. వీటిల్లో ప్రయాణికుల రద్దీ కూడా భారీగా ఉంటుంది. ఎండాకాలంలో ఏసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ మరింత పెరగనుంది. ఈ క్రమంలో ప్రయాణికులకు తక్కువ ఖర్చుతో సౌకర్యవంతమైన ప్రయాణం అందించేందుకు టీజీఎస్ఆర్టీసీ ఈ నిర్ణయం తీసుకుంది. కేవలం హైదరాబాద్‌లోని ఎలక్ట్రిక్ ఏసీ బస్సుల్లో మాత్రమే తగ్గింపు అమల్లో ఉంటుంది. మిగతా ప్రాంతాలకు తిరిగే ఏసీ బస్సులకు ఈ తగ్గింపు వర్తించదని ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ప్రయాణికులు ఈ సౌకర్యం ఉపయోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అటు హైదరాబాద్‌లో మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కేటాయించిన ఎలక్ట్రిక్ బస్సులను నగరంలో తిప్పనుంది.

## తెలంగాణ ఇంటర్
# హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్




- మొదటి పేజీ తరువాయి

ద్వారా కూడా హాల్ టికెట్లను పొందే సదుపాయాన్ని కల్పించారు. బోర్డు వద్ద విద్యార్థులు నమోదు చేసుకున్న రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు నేరుగా హాల్ టికెట్ డౌన్ లోడ్ లింక్ ను పంపిస్తున్నట్టు బోర్డు తెలిపింది. హాల్ టికెట్లలో ఏమైనా తప్పులు ఉన్నట్టు గుర్తిస్తే... వెంటనే ప్రిన్సిపాళ్ల ద్వారా బోర్డు దృష్టికి తీసుకొచ్చి, తప్పులను సరిదిద్దుకోవాలని చెప్పారు. మరోవైపు ఈసారి హాల్ టికెట్లపై ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ ను ముద్రించారు. దీన్ని స్కాన్ చేయడం ద్వారా ఎగ్జామ్ సెంటర్ ఎక్కడ ఉందో సులభంగా తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

## అసెంబ్లీలో
# చేనేత వస్త్ర ప్రదర్శన

**స్వయంగా వస్త్రాలు కొనుగోలు చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శన, విక్రయ కేంద్రాన్ని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం ప్రారంభించారు. ఆప్కో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ స్టాళ్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి, చేనేత కార్మికులతో ముచ్చటించారు. వారి నైపుణ్యాన్ని అభినందిస్తూ, స్వయంగా పట్టుచీరలు, పట్టు పంచె మరియు షర్ట్‌ను కొనుగోలు చేసి కార్మికుల్లో ఉత్సాహాన్ని నింపారు. దేశవ్యాప్తంగా ఉన్న చేనేత సంఘాలలో మన రాష్ట్రం నుంచే అత్యధికంగా 32 నుండి 33 సంఘాలు ఉండటం గర్వకారణమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల వస్త్రాలన్నీ ఒకే వేదికపై అందుబాటులో ఉన్నాయని, ప్రజలందరికీ మన చేనేత వైభవం తెలియజేసేందుకే ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు స్పీకర్ తెలిపారు. నేతన్నలను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని, మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీలు అందరూ ఈ స్టాళ్లను సందర్శించి వస్త్రాలను కొనుగోలు చేయాలని ఆయన కోరారు. బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు అందుబాటులో ఉండే ఈ స్టాళ్లలో నాణ్యమైన వస్త్రాలపై 40 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి, కార్మికులను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, కామినేని శ్రీనివాస్, బుచ్చయ్య చౌదరి మరియు ఇతర మంత్రులు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ బోర్డు భేటిని బహిష్కరించిన ఎమ్మెల్యే శ్రీగణేష్



**సికింద్రాబాద్:**సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కంటోన్మెంట్ బ్రిగేడియర్ రాజీవ్ , మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్,సి ఈ వో అరవింద్ కుమార్ ద్వివేది హాజరయ్యారు. ఈ సమావేశంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలుగా రెండవసారి భానుక నర్మద ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల నామినేటెడ్ సభ్యురాలు పదవీకాలం ముగిసిన నేపథ్యంలో తిరిగి రెండోసారి గెజిట్ విడుదల కావడంతో మరోసారి నామినేటెడ్ సభ్యురాలుగా ప్రమాణస్వీకారం చేశారు. కంటోన్మెంట్లో ప్రజాస్వామ్యం ఖూనీ చేస్తూ ఎన్నికల నిర్వహించకుండా నామినేటెడ్ పద్ధతిని కొనసాగిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ కంటోన్మెంట్ బోర్డ్ సమావేశాన్ని బహిష్కరించారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జిహెచ్ఎంసి లో విలీనం చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని ఇచ్చి సమావేశం బహిష్కరించినట్లు శ్రీ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ మాట్లాడుతూ కంటోన్మెంటు బోర్డుకు ఎన్నికలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. బోర్డుకు ఎన్నికలు జరిగితే ప్రజలకు పరిపాలన సౌలభ్యంగా మారుతుందని అన్నారు. దేశంలోనే ఉన్న వివిధ కంటోన్మెంట్లలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని ఎన్నికలు తాత్సారం కావడానికి పలు కారణాలు ఉన్నాయని అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు దేశంలోనే అత్యధికంగా పౌరులు ఉన్న ప్రాంతంగా ఉన్నప్పటికీ ఇప్పటికీ మౌలిక వసతుల కల్పనలో వెనుకబడిందన్నారు. అత్యధిక జనాభా ఉన్న కంటోన్మెంట్ ను మిలిటరీ ప్రాంతంగా పరిగణించకుండా అధికారులు ప్రజల అవసరాలను తీర్చాలని అన్నారు. ప్రజా ప్రతినిధుల ప్రాతినిధ్యం లేకుండా తమ అధికారాలను వినియోగించుకొని అధికారులే అంతిమ నిర్ణయం తీసుకోవడం సబబు కాదని అన్నారు.

## పత్తి రైతులు ఆందోళన చెందవద్దు

**- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



**పెద్దపల్లి:** పత్తి రైతులు ఆందోళన చెంద వద్దని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. గత కొన్ని రోజులుగా పత్తి కొనుగోలు విషయంలో రైతులు చాలా టెన్షన్‌తో ఉన్నారని, వారు ఆందోళనలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల సీసీఐ పత్తి కొనుగోలు నిలిపి వేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో తమకు మరికొంత సమయం కేటాయించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ సీసీఐ అధికారులతో మాట్లాడి రైతు ల ఇబ్బందులు దృష్టిలో పెట్టు కొని వచ్చే నెల 15 వరకు అవకాశం కల్పించాలని కోరినట్లు ఆయన మీడియాకు ఇచ్చిన సమాచారంలో పేర్కొన్నారు. ముఖ్యంగా చెన్నూరు నియోజకవర్గంలోని కోటపల్లి ప్రాంతంలో ఫ్యాక్స్ ఫిగర్లు ఆలస్యంగా నమోదు అవుతున్న విషయం సీసీఐ సీఎండీ దృష్టికి తీసుకెళ్లానని, ఈ మేరకు ఆయన సానుకూ లంగా స్పందించినట్లు ఎంపీ పేర్కొన్నారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవద్ద ని పత్తి రైతులకు భరోసా కల్పించారు.


## మా స్థలాలు ఇవ్వం..

**మూసి బాధితులు**



**హైదరాబాద్:**రూ.5000 కోట్లతో మూసీ నది ఒడ్డున భారీ గాంధీ విగ్రహం ఏర్పాటు కోసం ఈసి, మూసీ నదుల సంగమం వద్ద ఉన్న పది ఎకరాల భూసేకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు ఇచ్చింది.మూసీ నది ఒడ్డున గాంధీ విగ్రహ ప్రతిపాదన పై అక్కడి స్థానికులు మండిపడుతున్నారు. వివిధ మాధ్మమాలలో తమ గొంతు వినిపిస్తున్నారు.బాధితులు మాట్లాడుతూ గాంధీ విగ్రహం కావాలంటే రేవంత్ రెడ్డి ఇంటి దగ్గర పెట్టుకోమని చెప్పండి. కష్టపడి పైసా పైసా కూడాబెట్టి మేము ఇల్లు కట్టుకుంటే మీ ఇష్టప్రకారం ఖాళీ చేయండి అంటే ఎలా ప్రశ్నించారు.మీరు మూసీని సుందరీకరణ చేసుకోడానికి 450 కుటుంబాలను రోడ్డు మీద పడేస్తాను అంటే మేము ఎక్కడికి వెళ్ళాలి. ప్రభుత్వమే ఇలా చేస్తే మేము ఇంక ఎవరికి చెప్పుకోవాలని అన్నారు.గాంధీ గారు ఏమైనా నాకు విగ్రహం కావాలని అడిగారా.. మీ గొప్పల కోసం మీరు చేసి మమ్మల్ని రోడ్డు మీద పడేస్తాను అంటే అది ఎక్కడి న్యాయం. మేము 14 సంవత్సరాల నుండి ఇక్కడ ఉన్నాము.. మీరు ఏమైనా చేసుకోండి ఇక్కడ నుండి వెళ్ళము. ఇన్ని సంవత్సరాల నుండి కూడా ఈఎంఐ కడుతున్నాము, ఇప్పుడు ఇంకో దగ్గరికి పోయినా మళ్లీ ఈ ఈఎంఐ కట్టి, ఆ ఈఎంఐ మేము కట్టలేమని అన్నారు.గాంధీ విగ్రహం కోసమని మొత్తం తీసేస్తామంటే మేము ఒప్పుకోమని అన్నారు. లోన్ క్లియర్ అయి ఇల్లు మాకు వచ్చిందని సంతోషించేలోపే.. పేపర్లో గాంధీ విగ్రహం కోసం మా ఇల్లు ఖాళీ చేపిస్తున్నామని వచ్చింది. మాకు కనీసం నోటీసులు ఇవ్వలేదు, మేము పేపర్లో చూసి విషయాన్ని తెలుసుకున్నాం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 400లకు పైగా కుటుంబాలను రోడ్డునపడేయాలని చూస్తుంది. ఇక్కడ అందరూ ప్రభుత్వ ఉద్యోగులే ఉన్నారు.. మేమైతే భయపడి ఫైట్ చేయమనుకొని మమ్మల్ని బ్లాక్మెయిల్ చేసి ఖాళీ చేయిస్తున్నారు. ఇది ప్రభుత్వ భూమి కూడా కాదు.. పక్కా పట్టా ఉన్న ప్రైవేట్ స్థలం ఇది. గాంధీ విగ్రహం కావాలంటే కట్టుకోండి అంతే కానీ దానికోసం మా ఇల్లు ఇవ్వండి అంటే ఇవ్వమని అన్నారు.

## సమస్క - సారలమ్మల వీరగాథను ఆసక్తిగా విన్న రాహుల్, ఖర్గే..



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19:** దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ మంత్రులతో కాంగ్రెస్ అగ్రనేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మేడారం జాతరను ఘనంగా నిర్వహించినందుకు మంత్రి సీతక్కను కాంగ్రెస్ అగ్రనేతలు అభినందించారు. ఆదివాసీల అతిపెద్ద జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతరపై సుమారు పది నిమిషాల పాటు చర్చ జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ.. మేడారం జాతర చరిత్ర, ప్రాశస్త్యం గురించి మంత్రి సీతక్కను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమ్మక్క--సారలమ్మల పోరాట గాథను ఖర్గే, రాహుల్ ఆసక్తిగా విన్నారు. సమ్మక్క -- సారలమ్మల చరిత్రను దేశవ్యాప్తంగా చాటేందుకు సినిమా తీయాలని రాహుల్ గాంధీ సూచించారు.

**సరదా సంభాషణ..**

పార్టీ సమావేశంలో మంత్రి సీతక్క, రాహుల్ గాంధీ మధ్య సరదా సంభాషణ జరిగింది. మేడారం జాతరకు ఆహ్వానిస్తే తాము తప్పకుండా హాజరయ్యేవారమని రాహుల్ గాంధీ అన్నారు. 'ఆహ్వానిస్తే తాను కూడా తల్లుల దర్శనానికి వచ్చే వాడిని' అని మల్లికార్జున్ ఖర్గే తెలిపారు. అయితే సమయాభావం వల్ల వ్యక్తిగతంగా ఆహ్వానించలేకపోయినట్లు మంత్రి సీతక్క వివరించారు. వచ్చే జాతరకు తప్పకుండా అధికారిక ఆహ్వానం అందిస్తామని సీతక్క అన్నారు. 'ఆహ్వానం అందితే తప్పకుండా వస్తాము' అని రాహుల్ గాంధీ, ఖర్గే హామీ ఇచ్చారు.

# జీవన్ రెడ్డి ఔట్...

**కరీంనగర్, ఫిబ్రవరి 19:**తానిపత్తి జీవన్‌రెడ్డి.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి. మాజీ ఎమ్మెల్సీ. మూడేళ్ల క్రితం వరకు జీవన్‌రెడ్డికి పార్టీలో ప్రముఖ స్థానం ఉండేది. 2018 సమయంలో ఏకంగా పీసీసీ పదవికి పోటీ పడ్డారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్‌కు ఛాలెంజ్ చేసి మంత్రి పదవి వదులుకుని ఎంపీగా పోటీ చేశారు. ఇలా అధిష్టానం ఏం చెబితే అది చేస్తూ విధేయుడిగా కొనసాగారు. కానీ, మూడేళ్లుగా పరిస్థితులు మారిపోయాయి. 2023 ఎన్నికల్లో ఓడిపోయాక పార్టీ ఆయనను క్రమంగా దూరం పెడుతోంది. ఎమ్మెల్సీ పదీకాలం ముగుస్తున్న సమయంలో మరోసారి అవకాశం ఇస్తుందని భావించారు. కానీ ఆ ఛాన్స్ కూడా ఇవ్వలేదు.ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జీవన్‌రెడ్డి గెలిచి ఉంటే మంత్రి అయ్యేవారు. కానీ, ఆయన బీఆర్ఎస్ తరఫున పోటీచేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ చేతిలో ఓడిపోయారు. దీంతో జీవన్‌రెడ్డి ప్రాధాన్యం పార్టీలోనూ తగ్గిపోయింది. ఒకవైపు ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లింది. ఇక ఇదే సమయంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన సంజయ్‌కుమార్ ఏడాది తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ కూడా అన్ని విషయాల్లో సంజయ్‌కుమార్‌కు ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో జీవన్‌రెడ్డిలో అసంతృప్తి పెరిగింది. ఒకే ఒరలో రెండు కత్తులు ఇమడలేవని, ఒకే పార్టీలో ఇద్దరు ఇన్‌చార్జీలు ఉండలేరని



జీవన్‌రెడ్డి అధిష్టానానికి సంకేతం ఇస్తూ వస్తున్నారు. గతంలో కూడా పార్టీ నిర్ణయాలపై ఆయన బహిరంగంగా విమర్శలు గుప్పించారు.ఏడాదికాలంగా జీవన్‌రెడ్డికి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వర్గానికి మధ్య అంతర్గత కుమ్ములాట జరుగుతోంది. పంచాయతీ ఎన్నికల సమయంలో పార్టీ గుర్తు ఎన్నికలు కాకపోవడంతోపెద్దగా ప్రభావం చూపలేదు. కానీ, మున్సిపల్ ఎన్నికల వచ్చే సరికి ఇరు వర్గాల మధ్య కౌన్సిలర్ అభ్యర్థుల ఎంపిక విషయంలో సమస్యలు తలెత్తాయి. సంజయ్‌వర్గం అభ్యర్థులకు పార్టీ బీఫాంలు అదించింది. దీంతో జీవన్‌రెడ్డి కతల చెందారు. దీంతో తన వర్గం అభ్యర్థులను స్వతంత్రులుగా బరిలో దించారు. ఫలితాల్లో జీవన్‌రెడ్డి వర్గం 14 మంది గెలవగా, సంజయ్ వర్గం నుంచి 20 మంది గెలిచారు. దీంతో రెండు వర్గాలు కలిస్తే కానీ, పీఠం దక్కే అవకాశం లేకుండా పోయింది. దీంతో జీవన్‌రెడ్డి పీఠం తమ వర్గానికే ఇవ్వలని పట్టుబట్టారు. అధిష్టానంతో మాట్లాడారు. కానీ, సంజయ్ వర్గానికే పార్టీ పీఠం కట్టబెట్టింది. దీంతో జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపం చెందారు. పార్టీలో కొనసాగాలనిపించడంలేదని వ్యాఖ్యానించారు.తాజా వ్యాఖ్యల నేపథ్యం.. మంగళవారం ఢిల్లీకి వెళతానని ప్రకటించడంతో టీపీసీసీ రంగంలోకి దిగింది. జిల్లా పరిషత్ ఎన్నికల్లో ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చింది. అయినా జీవన్‌రెడ్డి మెత్తబడలేదు. మంగళవారం ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. మొదటి దశలో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించే అవకాశం ఉంది. జీవన్ రెడ్డికి జిల్లా స్థాయి బాధ్యతలు లేదా ప్రభుత్వంలో పదవి ఇచ్చి మెత్తగా చేయవచ్చు. అయితే, అధిష్ఠానం కఠినత చూపితే, ఆయన తీవ్ర నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ ఇంకా బలపడకముందే ఇలాంటి కలహాలు పార్టీకి నష్టం కలిగిస్తాయి.ఈ డ్రామా పాజిటివ్‌గా ముగిస్తే, కాంగ్రెస్ తన నాయకులను ఏకం చేసుకునే అవకాశం. నెగటివ్‌గా మారితే, పార్టీ ఓటు బ్యాంక్ బలహీనపడుతుంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పరిణామం కీలకం. జీవన్ రెడ్డి వంటి స్థానిక నాయకులు పార్టీకి అవసరమని అధిష్ఠానం గుర్తుంచుకోవాలి.

# రాజేందర్, రఘునందనరావులు ఎందుకలా...

**హైదరాబాద్, ఫిబ్రవరి 19:**తెలంగాణ బీజేపీ ఎంపీలు ఇద్దరు కాస్త తేడాగా వ్యవహరించారా? వాళ్ళ నిర్ణయంతో పార్టీ కేడర్ కూడా షాక్ అయిందా? ఆ మార్పు పార్టీకి తెలిసే జరిగిందా? లేక వ్యక్తిగతమా? ఎవరా ఇద్దరు లోక్‌సభ సభ్యులు? తేడా అనిపించేలా ఏం చేశారు? తెలంగాణలో మున్సిపల్ ఛైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. అందులో చిత్ర విచిత్ర పరిణామాలు చోటు చేసుకున్నాయి. హంగ్ వచ్చిన మున్సిపాలిటీల్లో ఎవరు ఎవరితో కలిశారు, ఏం పంచుకున్నారన్నది చివరి వరకు ఉత్కంఠగా మారి..... సస్పెన్స్ థ్రిల్లర్‌ని మరిపించింది. ఈ విషయంలో కమలం పార్టీ వైఖరి గురించి ప్రత్యేక చర్చలు జరుగుతున్నాయి. కాషాయ దళం ఒక్కో మున్సిపాలిటీలో ఒక్కోలా వ్యవహరించి అసలు వీళ్ళు ఎటున్నారన్న సంగతి అర్థంకాకుండా చేసింది. అనైతిక పొత్తులు పెట్టుకోబోం, ఎవరితో కలవబోమంటూ.... సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఉన్న కొన్ని చోట్ల ఉన్న అవకాశాన్ని వదిలేసుకుంది బీజేపీ. సరే... అది మంచి సంప్రదాయం, ఆదర్శవంతమైన రాజకీయం అనుకుంటుండగానే...మరికొన్ని చోట్ల అన్నిటినీ పక్కన పెట్టేసి అధికారం కోసం ప్రత్యర్థులతో జతకట్టి ముక్కున వేలేసుకునేలా చేసింది. ఒకచోట కాంగ్రెస్‌తో, మరొక చోట బీఆర్ఎస్‌తో చేతులు కలిపిన తీరును చూసి వీళ్ళేంటో... వీళ్ళ విధానాలేంటో... అసలేం అర్థంకావడం లేదన్న రాపు రమేష్ సినిమా డైలాగ్‌ని గుర్తు చేసుకుంటున్నారు పొలిటికల్ పండిట్స్. అందరిలాగే... బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే మున్సిపాలిటీల్లో ఎక్స్ అఫిషియో సభ్యులుగా నమోదు చేసుకున్నారు. ముందే అంచనాలు వేసుకుని పార్టీకి అవసరం అనుకున్న చోట నమోదు చేసుకున్నారు. అయితే... ఇద్దరు ఎంపీలు అండ్ సీనియర్ లీడర్స్ రఘునందన్ రావు, ఈటల రాజేందర్ అందుకు భిన్నంగా వ్యవహరించారు. అస్సలు ఎవరూ



ఊహించని చోట వాళ్ళు ఎక్స్‌అఫిషియో ఓటర్స్‌గా నమోదు చేసుకున్నారు.ఈ విషయం బయటికి తెలిశాక ఆశ్చర్యపోతున్న చాలామంది వాళ్లు అక్కడే ఎందుకు నమోదు చేసుకోవాల్సి వచ్చింది? బ్యాక్‌గ్రౌండ్ స్టోరీ ఏంటి అంటూ చర్చించుకుంటున్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ఎక్స్ అఫిషియోగా నమోదయ్యారు. ఇక ఈటల రాజేందర్ ఎల్లంపేట మున్సిపాలిటీలో చేసుకున్నారు. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే... ఇస్నాపూర్‌లో బీజేపీ ఒక్క వార్డ్ కూడా గెలుచుకోలేదు. అయినా సరే... ఎంపీ అక్కడెందుకు ఓటు నమోదు చేసుకున్నారన్నది మిలియన్ డాలర్ క్వశ్చన్. పైగా.... లోకల్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, రఘునందన్‌రావు కలిసి ఒకే కారులో రావడం చూసి అక్కడున్నవారంతా షాకయ్యారట. దీని గురించే పార్టీలో హాట్ హాట్ డిస్కషన్ నడుస్తోంది. మహిపాల్‌రెడ్డి బీఆర్ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకుని మళ్ళీ పాత గూటికి చేరుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఆ ఎన్నికల్లో మహిపాల్‌రెడ్డి వర్గం మొత్తం బీఆర్ఎస్‌కే సపోర్ట్ చేసిందన్నది లోకల్‌గా చెబుతున్న మాట. పైగా... ఇస్నాపూర్‌లో ఛైర్మన్ సీటును బీఆర్ఎస్ గెల్చుకుంది. బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేయాలన్నది ఎంపీ సొంత నిర్ణయమా లేక ఇంకేదన్నా స్టోరీ ఉందా అన్న కన్ఫ్యూజన్‌లో ఉన్నారట బీజేపీ నాయకులు. స్థానిక రాజకీయాలను దృష్టిలో పెట్టుకొని రఘునందన్‌రావు ఆ నిర్ణయం తీసుకున్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నా.... ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలిసి ఒకే కారులో రావడం చూస్తుంటే... అనైతిక పొత్తులు పెట్టుబోకోబోమన్న మాటలకు అర్థం ఏంటో తెలియడం లేదని మాట్లాడుకుంటున్నారు పార్టీ నాయకులు. ఇదే సమయంలో ఇస్నాపూర్‌లో బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేసి మరోచోట ఆ పార్టీ మద్దతు తీసుకున్నారా అన్న చర్చలు సైతం నడుస్తున్నాయి.పార్టీకి తెలిసే ఎంపీ ఆపని చేశారని అంటున్నా... ఎమ్మెల్యేతో కలిసి రావడాన్ని మాత్రం జీర్ణించుకోలేకపోతున్నాయట స్థానిక కాషాయ శ్రేణులు. ఇక ఈటల రాజేందర్ విషయానికి వస్తే.... ఆయన ఎల్లంపేటలో ఎందుకు ఎక్స్‌అఫిషియోగా నమోదు చేసుకోవాల్సి వచ్చింది.... తెరవెనుక జరిగిన పరిణామాలు ఏంటన్న చర్చలు జోరుగా నడుస్తున్నాయి. మంచో చెడో చేసుకున్నారు సరే.... మరి ఛైర్మన్ ఎన్నికను ఎందుకు స్కిప్ చేశారన్నది ఇంకో పెద్ద ప్రశ్న. మేడ్చల్ మల్కాజ్ గిరి పరిధిలో ఆ పార్టీ ఒక చోట బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వగా మరో చోట కాంగ్రెస్‌కు ఇచ్చింది. రెండు చోట్ల బీజేపీకి వైస్ చైర్మన్ పదవి దక్కింది. అటు ఎల్లంపేటలో ఎమ్మెల్యే మల్లారెడ్డికి, ఈటలకు మధ్య చర్చలు జరిగాయని, కానీ... అవి సక్సెస్ కాలేదన్న ప్రచారం ఉంది. తాను అనుకున్న విధంగా పరిణామాలు జరక్కపోవడం వల్లనే ఈటల ఓటింగ్‌కు దూరంగా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. రేపు గ్రేటర్ పరిధిలో జరిగే మూడు మున్సిపల్ కార్పొరేషన్స్‌లో ఎక్స్ అఫిషియో సభ్యులుగా నమోదు చేసుకునే అవకాశం ఇద్దరు ఎంపీలకు ఉన్నా... దాన్ని వదిలేసి ఇలా చిన్న పురపాలక సంస్థల్లో ఎందుకు నమోదు చేసుకున్నారన్నది చర్చనీయాంశమైంది.

# హైదరాబాద్ లో ఎంఎస్ఎంఈ సదస్సు

**హైదరాబాద్, ఫిబ్రవరి 19:**ఇటీవల బడ్జెట్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ఈక్విడిటీ, లిక్విడిటీ, వృత్తిపరమైన మద్దతు ఇచ్చేందుకు కేంద్రం మూడు కోణాల విధానాన్ని ప్రతిపాదించింది. ప్రపంచ స్థాయిలో చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి కేంద్రం కొరియర్ ఎగుమతులపై ప్రస్తుత నిల్వపరిమితిని (10 లక్షల ను) పూర్తిగా తొలగించింది. మన దేశ తయారీ రంగంలో ఎగుమతులలో 48.58%, జిడిపిలో 31.1 శాతం, తయారీ రంగంలో 35.4 శాతం వాటా కలిగి ఉంది.సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దేశవ్యాప్తంగా 32.82 కోట్ల మంది వ్యక్తులకు ఉపాధి కల్పిస్తున్నాయి. ఈ రంగంలో 7.47 కోట్లకు పైగా సంస్థలు ఉన్నాయి.సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దేశ ఆర్థిక రంగ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో వీటిని మరింత బలోపేతం చేయడానికి కేంద్రం కంకణం కట్టుకుంది.మొదటి విధానంలో ఈక్విటీ మద్దతు అందించనుంది. ద్రవ్యలభ్యతను పెంచుతుంది. వృత్తిపరమైన, నిర్వాహక నైపుణ్యాన్ని అందిస్తుంది. తద్వారా ఈ పరిశ్రమల అభివృద్ధికి కేంద్రం సహకారం అందిస్తుంది.రెండవ విధానంలో భాగంగా వ్యవస్థాపకతను ప్రోత్సహిస్తుంది. ఉపాధి, జీవనోపాధి అవకాశాలను సృష్టిస్తుంది. పోటీ తత్వాన్ని పెంచుతుంది. అనేక రాష్ట్రాలకు మద్దతు ఇస్తుంది. ఇది మాత్రమే కాదు బడ్జెట్ కేటాయింపులు కూడా పెంచింది. తద్వారా ఈ పరిశ్రమల పనితీరు దీర్ఘకాలికంగా ఉండేలా కేంద్రం చర్యలు తీసుకుంది.మూడో విధానంలో భాగంగా.. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నుంచి సీపీఎస్ ఈ లు కొనుగోలు చేసే అన్నింటికీ సెటిల్మెంట్ ప్లాట్ ఫామ్ గా ట్రెడ్స్ ను తప్పనిసరి చేసింది. కార్పొరేట్ కంపెనీల కూడా విధివిధానాలు రూపొందించింది. ౧=వణూ ప్లాట్ ఫామ్ లో ఇన్ వాయిస్ డిస్కౌంట్ కోసం సీజీటీ మద్దతు ఉండే క్రెడిట్ గ్యారంటీ ని కేంద్రం ఇస్తుంది.ట్రెడ్స్ అనేది బహుళ వ్యాపారుల ద్వారా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వాణిజ్య రాబడులకు ఫైనాన్స్ డిస్కౌంట్ సులభతరం చేస్తుంది. ఇది పూర్తిగా ఎలక్ట్రానిక్ ప్లాట్ఫారం.సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల



అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ ఆధ్వర్యంలో డిజిటల్ మార్కెటింగ్, ఏఐ ఆటోమేషన్, ఈ కామర్స్ అనే అంశాలపై జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. మార్చి 12, 13 తేదీలలో హైదరాబాదులో ని యూసఫ్ గూడ లో క్యాంపస్ లో నిర్వహిస్తారు.రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో సోషల్ మీడియా ట్రెండ్స్, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా నిర్వహించే కంటెంట్ క్రియేషన్, ఆటోమేషన్ వర్క్ ఫ్లో, కస్టమర్ సైకాలజీ, బ్రాండింగ్ ప్యాకేజింగ్, ఈ కామర్స్ కంప్లయిన్స్, +వవీ, ాచీణజ, ౧=వణూ వంటి ప్రభుత్వ డిజిటల్ ప్లాట్ ఫామ్ ల వినియోగంపై నిపుణులు తమ అనుభవంతో పాటు.. లోతైన వివరాలను అందిస్తారు.ఈ కార్యక్రమంలో స్టార్టప్ లాంచ్, గో టు మార్కెట్ వ్యూహాలు, సమాచారం ఆధారిత నిర్ణయాలు వంటి అంశాలపై ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో మీవీజుం, స్టార్టప్స్, డిజిటల్ మార్కెటింగ్ నిపుణులు, ప్రభుత్వ సంస్థలు, టెక్నాలజీ సొల్యూషన్ ప్రొవైడర్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని ప్రసంగిస్తారు.ఈ సదస్సుకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి చివరి తేదీగా మార్చి 9 ని నిర్ణయించారు. ఫిబ్రవరి 28 లోపు నమోదు చేసుకునే వారికి 1200.. అనంతరం 2000 ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. పరిమిత స్థాయిలో సీట్లు ఉన్న నేపథ్యంలో.. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి మాత్రమే అవకాశం ఉంటుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.

## బీఆర్ఎస్ ను ఓడించాడానికే కాంగ్రెస్ తో దోస్తీ...

**కాగజ్ నగర్:**బీఆర్ఎస్ పార్టీకి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ దక్కకుండా చేయడమే మా లక్ష్యం ఉండేనని కాగజ్ నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. బీఆర్ఎస్ అవకాశం ఇవ్వకూడదని కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చామని అయన అన్నారు.కాంగ్రెస్ పార్టీతో పొత్తు తప్పదని మా అధిష్టానంకి కూడా చెప్పి ఒప్పించాం. బీఆర్ఎస్ పార్టీకి మున్సిపల్ చైర్మన్ రాకుండా చేయడంలో మేము సక్సెస్ అయ్యామని అన్నారు.ముస్లిం మహిళను మున్సిపల్ చైర్మన్ చేస్తే తప్పేంటి. హిందూ మహిళ ను చైర్మన్ చేస్తామని ఎన్నికలకు వెళ్తే ప్రజలు 30 వార్డు లకు గాను మాకు 5 వార్డులే గెలిపించారు. అందుకే కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకొని ప్రజల అభీష్టం మేరకే ముస్లిం మహిళకు చైర్మన్ చేశామని అన్నారు.

## ఇంటర్ విద్యార్థుల పరీక్ష ఫీజులకు అవకాశం ఇవ్వాలి

**హైదరాబాద్:**ఇంటర్ బోర్డ్ విద్యార్థుల పరీక్ష ఫీజులకు అవకాశం కల్పించాలి. విద్యార్థులకు న్యాయం చేయకుండా బోర్డ్ కార్యదర్శి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి సమస్యను పరిష్కరించాలని కళాశాలల యాజమాన్యాల మెరుపు నిరసనకు దిగారు. ఇంటర్ బోర్డ్ విద్యార్థుల పరీక్ష ఫీజులకు అవకాశం కల్పించాలని, విద్యార్థులకు న్యాయం చేయాలని, ఇంటర్ బోర్డ్ కార్యదర్శి పనితీరు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నదని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి మరియు ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాల సంఘం సంయుక్తంగా నాంపల్లి లోని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కార్యదర్శి కార్యాలయంలో బైఠాయించి నిరసన ధర్నా నిర్వహించారు.

వార్తాతరంగాలు
శుక్రవారం 20 ఫిబ్రవరి 2026

# శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ 396 వ జయంతి వేడుకలు

**చిన్న చింతకుంట ఫిబ్రవరి 19 (స్కై న్యూస్);** శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి సందర్భంగా చిన్నచింతకుంట మండల పరిధిలోనీ గూడూరు గ్రామంలో గురువారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకి అరటి పండ్లు, స్వీట్స్ ను శ్రీ కురుమూర్తి స్వామి టెంపుల్ వర్కర్ డి శ్రీకాంత్, గోపికృష్ణ, శివప్రసాద్, వంశీ, సింహాద్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గూడూరు బస్టాండ్ కూడలిలో చత్రపతి శివాజీ చిత్రపటాలను పెట్టి జ్యోతిని వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మొఘల్ సామ్రాజ్య పతనాన్ని శాసించిన మహా వీరుడు, హిందూ స్వరాజ్యాన్ని స్థాపించిన ధర్మయోధుడు, భరతమాత గర్వించదగిన వీరపుత్రుడు చత్రపతి శివాజీ మహారాజ్ అని కొనియాడారు.



# యంగ్ ఇండియన్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవం

**కేక్ కట్ చేసిన మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య**



**కొత్తగూడెం ఫిబ్రవరి 19 (స్కై న్యూస్ ):**యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఫౌండేషన్ స్థాపించి 10 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఫౌండేషన్ ముఖ్య సలహాదారులు, భద్రాచలం మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గెజిటెడ్ ఆఫీసర్ అసోసియన్ జిల్లా అధ్యక్షుడు వెంకట పుల్లయ్య కేక్ కట్ చేసి సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016 లో స్థాపించిన ఈ ఫౌండేషన్ అన్ని రాష్ట్రాల్లో సేవలు అందించడం గొప్ప విషయమని, ఇలాగే యువత సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జెబి. బాలు మాట్లాడుతూ ఈ జర్నీ లో సహకరించిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానని, ఈ క్రెడిట్ అంతా రక్తదాతలకు చెందుతుందని తెలిపారు. అలాగే, ఈ ఫౌండేషన్ ద్వారా మాతో పాటు సేవ చేయదలచిన వారు కూడా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు దస్తగిరి, ప్రధాన కార్యదర్శి సతీష్, సభ్యులు కమలాకర్, రాజేష్, జుబ్బు, రమేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధి కమిటీతో కళాశాల అధ్యాపక బృందం సమావేశం



**చిన్న చింతకుంట ఫిబ్రవరి 18 (స్కై న్యూస్);** మన ప్రభుత్వ జూనియర్ కళాశాల చిన్న చింతకుంట లో విద్యాభివృద్ధి కమిటీతో కళాశాల అధ్యాపక బృందం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి సమావేశానికి విద్యాభివృద్ధి కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, విద్యా కమిటీ సభ్యుల, కళాశాల సహకారం అందిస్తున్న శ్రీనివాస్ గౌడ్, కళాశాల ఇన్చార్జి ఎస్, రాకేష్, బురాన్,కరమ్ వీర్ సింగ్ అధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం శివ, మండల విద్యాధికారి మురళీకృష్ణ,

**చర్చించిన అంశాలు**

1. వచ్చే విద్యా సంవత్సరానికి అన్ని సబ్జెక్టుల అధ్యాపక బృందం సమకూరే విధంగా చేయడం.
2. వచ్చే విద్య సంవత్సరానికి విద్యార్థుల నమోదు పెంచడం.
3. కళాశాల భవనం గురించి.
4. పాఠశాల విద్యార్థులతో పాటు ఇంటర్మీడియట్ విద్యార్థులకు బీసీ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్లో వసతి కల్పించడం గురించి.
5. రవాణా సౌకర్యం లేని అప్పంపల్లి , ఉంద్యాల మొదలగు గ్రామాల నుండి విద్యార్థులు రావడానికి రవాణా సౌకర్యం కల్పించే విధంగా చేయడం.
6. కళాశాలకు లాబ్స్ మెటీరియల్ వచ్చింది కావున ప్రయోగశాలలను నిర్వహించడానికి తగిన విధంగా గదులను సిద్ధపరచడం.
7. చిన్న చింతకుంట లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది అనే విధంగా మండల పరిధిలోని గ్రామాలలో ప్రచారం చేయడం మొదలైన విషయాలను స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చేస్తామని విద్యాభివృద్ధి కమిటీ వారు హామీ ఇవ్వడం జరిగింది.

# ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన భూమి పూజ కార్యక్రమం

**హాజరైన మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి**




**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 19 :-** రంగారెడ్డి జిల్లా కేశంపేట్ మండలంలోని పాపి రెడ్డి గూడ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేశంపేట మండలం మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ దార్శనిక నాయకుడు అసాధారణ నిర్వాహకుడు వ్యూహాత్మక ఆలోచనాపరుడని అన్నారు స్వరాజ్య విజేతకు మనం గౌరవంగా నమస్కరిస్తాము ఆయన ధైర్యం మనకు స్ఫూర్తినిస్తుంది, ఆయన పాలన మనల్ని నడిపిస్తుంది ఆయన న్యాయం ఆత్మగౌరవ స్ఫూర్తి మన సమాజాన్ని బలోపేతం చేస్తుంది అని కొనియాడారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శశిరేఖ యాదయ్య, ఉపసర్పంచ్ తాండ్ర జ్యోతి నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, తాండ్ర రమేష్ రెడ్డి, పర్వతాలు, నర్సింలు, యాదయ్య, కే నర్సింలు, వార్డ్ మెంబర్స్, సురేష్, నందు, రవి, శ్రీను, నరేందర్, ప్రవీణ్, చిన్న, ఛత్రపతి శివాజీ యూత్ కమిటీ మెంబర్స్, గ్రామ యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నిలిచారు గెలిచారు ఇక అభివృద్ధి చేయండి

**సదర్ ఖాజీ సయ్యద్ ముక్తదీర్ అలీ ఖాద్రి**




**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 19 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేసి విజేతాలుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను సదర్ ఖాజీ సయ్యద్ ముక్తదర్ అలీ ఖాద్రి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఖాజీ సయ్యద్ ముక్తదర్ అలీ ఖాద్రి మాట్లాడుతూ పోటీలో నిలిచారు విజేతగా నిలిచారు ఇక చేపట్టాల్సింది అభివృద్ధి కార్యక్రమాలు మంచి కార్యక్రమాలతో ప్రజల మనసులు దోచుకుని వారు వేసిన ఓటుకు న్యాయం చేయాల్సిన బాధ్యత స్థానిక పాలకులపై ఉందని ఖాజీ సయ్యద్ ముస్తదిర్ అలీ ఖాద్రి నూతన పాలకవర్గానికి పిలుపునిచ్చారు 14వ వార్డులో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, గెలిచిన కౌన్సిలర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందేమోహన్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్ అదేవిధంగా ముస్లిం మైనార్టీ కౌన్సిలర్లకు సంబంధించిన ముఖ్యమైన నాయకులు జమృత్ ఖాన్, సర్వర్ పాషా, ముబారక్ అలీ ఖాన్ మహమ్మద్ సాదిక్ కౌన్సిలర్ గౌస్ జానీ తదితరులను మైనార్టీ నేతలు హాజీ సయ్యద్ ముక్తదీర్ అలీ ఖాద్రి సయ్యద్ ఇఫ్తార్ అలీ ఖాద్రి సయ్యద్ అలీ సయ్యద్ మసూద్ అలీ సయ్యద్ మోషన్ అలీ, సయ్యద్ ఇంతియాజ్ అలీ సయ్యద్ బాసిత్ అలీ సయ్యద్ ఫుర్ఖాన్ అలీ, సయ్యద్ తౌసీఫ్ అలీ, సయ్యద్ పాషా, అఫ్జల్ తదితరుల సమక్షంలో సన్మానం చేశారు ఈ సందర్భంగా ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన కౌన్సిలర్లు ఇప్పుడు పార్టీలకు అతీతంగా ఇలాంటి రాజకీయాలు లేకుండా ప్రజల ప్రయోజనాల కోసం పనిచేయాల్సిన అవసరం ఉందని సూచించారు స్థానిక ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసా వహించి వారు కోరుకున్న విధంగా గెలిచిన కౌన్సిలర్లు పార్టీలకు అతీతంగా పనిచేస్తారని తాను కూడా పార్టీలకు రాజకీయాలకతీతంగా ప్రాంత అభివృద్ధికి పాటుపడతానని ఎమ్మెల్యే శంకర్ హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# శక్తి స్వరూపుడు శివాజీ మహారాజ్

**శివాజీస్ఫూర్తితో యువత ముందుకు సాగాలి**

**బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా స్కై న్యూస్ ఫిబ్రవరి 19 :-** రంగారెడ్డి జిల్లా జయంతి సందర్బంగా షాద్ నగర్ పట్టణంలోని ఈశ్వర్ కాలనీ లో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమం బిజెపి నాయకులు చెవుల బాస్కర్, కౌన్సిలర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఎలికట్ట గ్రామంలో వెంకనోళ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందే బాబయ్య హాజరు కావడం జరిగింది శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి శివాజీ మహారాజ్ ను స్మరించుకొని పాలాభిషేకం చేయడం జరిగింది అదేవిధంగా ఛత్రపతి శివాజీ జయంతి సందర్బంగా బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో స్థానిక బుగ్గారెడ్డి గార్డెన్ లో రక్త దానం శిబిరం నిర్వహించడం జరిగింది రక్తదానం చేసినవారికి విష్ణువర్ధన్ రెడ్డి మెమెంటోలు అందించి అభినందించడం జరిగింది పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ ఒక వ్యక్తి కాదు శక్తి స్వరూపుడు అని అన్నారు అయన ఆశయాలను ప్రతి గ్రామ గ్రామాన తీసుకెళ్లాలని కోరారు ప్రతి ఒక్కరిలో హైందవ చైతన్యం రావాలని అన్నారు హైందవ సామ్రాజ్య స్థాపన కోసం కత్తి పత్తి యుద్ధం చేసిన ఛత్రపతి శివాజీలా మనం యుద్ధం చేయాల్సిన అవసరం లేదు ఆయన ఆశయాలను మనం కొనసాగిస్తూ ముందుకు సాగుదామని అన్నారు ఈ కార్యక్రమంలో యువ నాయకులు వంశీకృష్ణ,మెడిగ పెంటయ్య, రంగన్న గౌడ్, వెంకట రమణ, శ్రీనివాస చారి, కుడుముల బాల్ రాజ్,లంకల శ్రీనివాస్ రెడ్డి, నర్సిములు సార్, కె. నర్సింహా, పడకంటి శ్రీశైలం,ఉదయ్ గౌడ్, పల్లె అశోక్, రవి నాయక్ కాలనీ పెద్దలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సొంత ఇంటి కళ సకారమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**




**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 19( స్కైన్యూస్)** గ్రామాల అభివృద్ధికి మౌలిక సదుపాయాలను కల్పించేందుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సిరుధులను మంజూరు చేయడం జరిగిందని పేదల సొంతింటి కల సకారమే లక్ష్యంగా ముందుకు సాగుతూ గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి వివరించారు గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను గ్రామ సర్పంచ్ గీతా నరసింహారెడ్డి తో కలిసి ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి సాధిస్తేనే గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని ఆ దిశలోనే గత రెండు సంవత్సరాలుగా గ్రామాలకు నిధులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా పేదలైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వం గ్రామాలను నిర్లక్ష్యం చేస్తే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలలో రహదారుల నిర్మాణాలు త్రాగునీరు విద్యుత్ సమస్య పరిష్కారంతోపాటు విద్యా వైద్యం అందించేందుకు దశలవారీగా కృషి చేస్తున్నామని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులతో పాటు పార్టీ సీనియర్ నాయకులు ప్రజలు పాల్గొన్నారు

# గ్రామ మహిళ భవనానికి 10 లక్షలు మంజూరి భూమి పూజ

**గ్రామ సర్పంచ్ సుకన్య యాదయ్య**




**చిన్న చింతకుంట ఫిబ్రవరి 19 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండల పరిధిలోని నెల్లికొండి గ్రామానికి స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి ఆశీస్సులతో గ్రామ మహిళ సమాఖ్య భవన నిర్మాణానికి ఎన్ ఆర్ ఐ జి ఎస్ నిధుల నుంచి 10 లక్షలు మంజూరు అయ్యాయి. గురువారం సర్పంచ్ సుకన్య ,ఏ పి ఎం నాగమణి, పి ఆర్ ఏ ఈ ఈ, ఏపీవో నవీన్ కుమార్ తో కలిసి గ్రామ మహిళ సంఘ సభ్యులు గ్రామ పెద్దలు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ మహిళ సమైక్య భవనం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ప్రజా ప్రభుత్వం లో స్థానిక ఎమ్మెల్యే జి, మధుసూదన్ రెడ్డి దృష్టికి తీసుకుపోగా భవన నిర్మాణం కొరకు ఎన్.ఆర్.ఐ.జి.ఎస్ నిధులనుంచి పది లక్షల మంజూరు చేశారని అన్నారు. సమైక్య భవనాన్ని నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళా సంఘాల మహిళలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్ లకు సన్మానం



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 19 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి ఆవరణలో ఉన్న ప్రభుత్వ జీవన్ ధార జనరిక్ ఔషదాల నిర్వాహకులు జక్కు జ్ఞాన ప్రసూన, పొగాకు శైలజ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ లను మర్యాదపూర్వకంగా సన్మానించారు ఇటీవల మున్సిపల్ ఎన్నికలలో విజయం సాధించి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన శుభ సందర్భంగా మర్యాదపూర్వకంగా వారు జనరిక్ ఔషధాల షాపులో సన్మానం చేశారు ఈ సందర్భంగా పూల మొక్కను జ్ఞాపకంగా అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ కు పెద్దల ఆశీస్సులు

**మాజీ దివంగత ఎమ్మెల్సీ రాందేవ్ రెడ్డి కుమారుడు రవీందర్ రెడ్డి లక్ష్మారెడ్డిల శుభాకాంక్షలు**



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 19 :-** ప్రజల ఆశీర్వాదంతో చిన్న వయసులో పెద్ద బాధ్యతలు స్వీకరించి పట్టణ ప్రజలకు సేవ చేసుకునే అర్థమైన అవకాశంలో లభించిందని దీనిని బాధ్యతాయుతంగా మలుచుకోవాలని మాజీ దివంగత ఎమ్మెల్సీ రాందేవారెడ్డి కుమారులు రవీందర్ రెడ్డి లక్ష్మారెడ్డిలు సూచించారు ఎమ్మెల్యే స్వగృహంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అందేమోహన్ ను కలుసుకొని ఆశీర్వదించారు కండువాతో సన్మానించారు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచన సలహాలతో రాజకీయంగా ఇంకా ఎంతో ఎత్తుకు ఎదగాలని మంచి పేరు తెచ్చుకోవాలని వారు ఆశించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తో పాటు పలువురు మోహన్ ను ప్రత్యేకంగా అభినందించారు.

# మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లను సన్మానించిన గంజ్ వ్యాపార వేత్తలు



**రంగారెడ్డి జిల్లా కైన్ న్యూస్ ఫిబ్రవరి 19 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికలలో చైర్మన్ గా ఎన్నికైన అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ గా ఎన్నికైన అందే మోహన్ ముదిరాజ్, కౌన్సిలర్ గోపాల్ లను సన్మానించిన షాద్ నగర్ గంజి వ్యాపార వేత్తలు వర్తక వాణిజ్య వ్యాపారస్తుల సంఘం ఆధ్వర్యంలో ఈ సన్మానం జరిగింది స్థానిక వ్యాపారాలకు తోడ్పడాల్సిందిగా ఈ సందర్భంగా పాలకవర్గాన్ని కోరారు.

వార్తాతరంగాలు శుక్రవారం 20 ఫిబ్రవరి 2026

## చత్రపతి శివాజీ మహారాజ్ హిందూ సామ్రాజ్య స్థాపకుdu గొప్ప పరిపాలన దార్శనికుడు

**బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి**





**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 19 :-** రంగారెడ్డి జిల్లాషాద్ నగర్ పట్టణంలో అరెకటిక సంఘం ఆధ్వర్యములో ఛత్రపతి శివాజీ మహారాజు జయంతి కార్యక్రమని ఘనముగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసన సభ్యుడు వీర్ల పల్లి శంకర్, బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, అందే బాబయ్య పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అల్లునూర్ బస్వాం మున్సిపల్ ఛైర్మన్, అందె మోహన్ వైస్ చైర్మన్, కౌన్సిలర్ దిలీప్ గోపాల్ చందు హాజరయ్యారు ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ శివాజీ మహా రాజ్ గొప్ప దేశ భక్తుడు జాతీయ వాద నాయకుడు, హిందు సామ్రాజ్య స్థాపకుడు గొప్ప పరిపాలన దక్షకుడు అని అన్నారు జిజియా భాయి తన తల్లీ ఉగ్గుపాలతో నురుపోసిన రామాయణం మహా భారతం చదువు కొని ధర్మరక్షుడుగా చిన్న వయసులో మొఘల్స్ ను ఎదిరించి హిందూ సమాజాన్ని స్థాపించారు మంచి పరిపాలన కోన సాగించారు అన్నారు యువత ఛత్రపతి శివాజీ మహారాజ్ ను ఆదర్శంగా తీసుకుని దేశ ధర్మ రక్షణ కోసం కృషి చేయాలని అన్నారు ఈ కార్యక్రమము అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమములో వంశీ కృష్ణ, శ్రీనివాస్ చారి, ఆరెకటిక సంఘం అధ్యక్షులు నర్సింగ్, నవీన్, ప్రసాద్, అరుణ్, దుర్గేశ్, ప్రకాష్ తదితరులు హాజరయ్యారు.

## రెడ్ క్రాస్ సొసైటీ సేవలకు సహాయ సహకారం అందిస్తాం

**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**





**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 19( స్కైన్యూస్)** జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ ఆకుతోట సాయిబాబా వివరించారు గురువారం నూతన కార్యవర్గం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ను కలిసి సన్మానించారు ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఎన్నికకు సహకరించిన ఆయనను అభినందించారు. నూతన కార్యవర్గం రక్తదాన శిబిరాల నిర్వహణ పట్ల ప్రజలను చైతన్యం చేయడంతో పాటు ఆపదలో ఉన్నవారికి పూర్తిస్థాయిలో రక్త నిల్వలు ఉండేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. రాబోయే రోజులలో రెడ్ క్రాస్ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు అనంతరం ఇటీవల మున్సిపల్ వైస్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన బాదం రమేష్ ను వారి స్వగృహంలో సన్మానం చేశారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ లయన్స్ సూరంపల్లి రాధాకృష్ణ కోశాధికారి బోయినపల్లి కృష్ణారావు స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యులు చీమల రమేష్ రెడ్డి జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు పోల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డులు

**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 19(స్కై న్యూస్):**శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డ్-2026 కోసం చేనేత కళాకారుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత,జౌళి శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట నైపుణ్యం కలిగిన చేనేత కళాకారులకు పురస్కారాలను అందించడం జరుగుతుందని తెలిపారు. పోచంపల్లి ఇక్కత్,డర్రిస్,జనరల్ వెరైటీస్,నారాయణపేట,గద్వాల చీరల నేత పని రకాల్లో నైపుణ్యం కలిగిన కళాకారులు ఈ పురస్కారాలకు అర్హులని చెప్పారు. వీవింగ్ కేటగిరీలో 2025 డిసెంబర్ 31 నాటికి 30 సంవత్సరాల వయస్సు నిండి,వృత్తిలో పదేళ్ల అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.డిజైనింగ్ కేటగిరీలో 2025 డిసెంబర్ 31 నాటికి 25 సంవత్సరాల వయస్సు నిండి, వృత్తిలో ఐదేళ్ల కనీసం అనుభవం ఉండాలన్నారు. దరఖాస్తుతో పాటు,కళాకారులు తయారు చేసిన పూర్తి వస్త్రమును శాంపిల్ గా గద్వాలలోని ఐడి ఓసి లో ఉన్న చేనేత మరియు జౌళి శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.ఇందులో విజేతలైన చేనేత కళాకారులకు రూ. 25,000/- ల నగదు పురస్కారము మరియు ప్రశంశా పత్రము మరియు మెమెంటోతో పాటుగా శాలువాతో సత్కారం మొదలగునవి బహుకరించబడుతాయని తెలిపారు.ఎంపికకు దరఖాస్తు చేసుకున్న డిజైన్ ను గతములో ఎవరూ కూడా తయారు చేసి ఉండకూడదని స్పష్టం చేశారు.నమూనా కొరకు పంపించు వస్త్రము పూర్తిగా ఉండాలనన్నారు.నమూనాగా పంపే వస్త్రము అమ్మకం చేయరాదని,తయారు చేసిన వస్త్రము లేదా డిజైన్ తానే స్వయంగా రూపొందించినట్లుగా స్వీయ ధృవీకరణ పత్రము సమర్పించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు ఫారాలు తమ కార్యాలయంలో లభిస్తాయని, మార్చి 31 లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నియమించబడ్డ అవార్డు ఎంపిక కమిటీకి ప్రతిపాదనలుగా పంపించడం జరుగుతుందన్నారు. పురస్కారాలకు ఎంపికైన నమూనాలు అవార్డు ప్రధానం చేసిన తర్వాత సంబంధిత చేనేత కళాకారులకు పోస్టు ద్వారా తిరిగి పంపించనున్నట్లు వివరించారు.

## ఉత్తమ ప్రతిభ కనబరచాలి




**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 19 (స్కై న్యూస్):**రాష్ట్రస్థాయి సి.యం కప్ పోటీలలో క్రీడా స్ఫూర్తితో పాల్గొని,కష్టపడి ఉత్తమ ప్రతిభ కనబరచాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు ఆకాంక్షించారు. గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సి.యం. కప్ పోటీలకు హాజరయ్యే జిల్లా క్రీడాకారుల బృందాన్ని ఐడీఓసీ ఆవరణంలో గురువారం అదనపు కలెక్టర్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, మండల,జిల్లా స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులను అభినందిస్తూ, రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలనన్నారు. క్రీడల ద్వారా క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని,గెలుపు మాత్రమే లక్ష్యం కాకుండా పాల్గొనడం కూడా ముఖ్యమని తెలిపారు. ఓటమికి భయపడకుండా నిరంతరం ప్రయత్నం చేయాలని, ప్రయత్నమే విజయానికి మార్గమని అన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతి, భోజనం వంటి అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈరోజు సుమారు 400 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు బయలుదేరుతున్నట్లు తెలిపారు.వారు రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరచి విజయాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా అధికారి కృష్ణయ్య,క్రీడాకారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

**అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, బిజెపి అగ్ర నేతలు, కౌన్సిలర్లు**







**రంగారెడ్డి జిల్లా స్కై న్యూ ఫిబ్రవరి 19 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ మున్సిపాలిటీ లోని శివాజీ చౌక్ వద్ద ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శంకర్ తో పాటు మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, కౌన్సిలర్లు సంతోషి బాయ్ చందు, కలంకార్ దిలీప్, బచ్చలి నరేష్, గోపాల్, అదేవిధంగా బిజెపి నేతలు అందే బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, ఆరెకటిక సంఘం అధ్యక్షులు నర్సింగ్, నవీన్, ప్రసాద్, అరుణ్, దుర్గేశ్, ప్రకాష్ తదితరులు హాజరయ్యారు ఇందులో భాగంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు నివాళులర్పించారు అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాని అందరితో కలిసి షాద్ నగర్ ఎమ్మెల్యే వేర్లపల్లి శంకర్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ చత్రపతి శివాజీ మహారాజ్ తన మతాన్ని కాపాడుకుంటూ పరమత సహనంతో రాజ్యాన్ని పాలించిన లౌకిక పాలకుడు ధీశాలి రాజనీతిజ్ఞుడు పటిష్ట మరాఠా సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ అని మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన ధీరుడు ఛత్రపతి శివాజీ అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ అన్నారు అదేవిధంగా పలువురు నాయకులు హాజరై కార్యక్రమాన్నీ ఉదేశించి మాట్లాడుతూ భారత చరిత్రలో అత్యంత ప్రసిద్ధమైన యోధుడు రణనీతి నిపుణుడు న్యాయవంతమైన పరిపాలకుడు ఆయన జీవితం ధైర్యం త్యాగం స్వాతంత్ర్య ఆకాంక్షలకు ప్రతీక అని పలువురు కొనియాడారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వశీ, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, బీజేపీ నేతలు శ్రీవర్ధన్ రెడ్డి, అంధే బాబయ్య, విష్ణు వర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు సంతోషి బాయి చందులాల్, గోపాల్, కలంకార్ దిలీప్, బచ్చలి నరేష్, స్వరర్ పాషా, శంకర్, మనీష్, సుదర్శన్ గౌడ్, శ్రీశైలం గౌడ్, ఆరె కటిక సంఘం అధ్యక్షులు నర్సింగ్, నవీన్, ప్రసాద్, సభ్యులు చందులాల్, ప్రకాష్ అరుణ్ కుమార్ దుర్గేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిత్య పూజలతోనే గ్రామాలు సుభిక్షం







**కుమ్మెర ఆలయ అభివృద్ధికి సహకరిస్తా.**

**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి.**

**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 19( స్కైన్యూస్)** గ్రామాలలోని ఆలయాలను నిర్వహిస్తున్న నిత్య పూజ కార్యక్రమాలతోనే గ్రామాలు సుభిక్షంగా ఉన్నాయని ఆలయాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తారని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు గురువారం మండల పరిధిలోని కుమ్మెర గ్రామంలో వెలసిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించిన శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ కమిటీ నిర్వాహకులు వేదమంత్రాలతో ఆశీర్వాదం అందించారు ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలు శుభపార్వతుల కళ్యాణం అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి గతంలో నిధులను మంజూరు చేయడం జరిగిందని వివరించారు. రాబోయే రోజులలో కూడా ఆలయాన్ని తీర్చిదిద్దేందుకు గ్రామంలో నెలకొని ఉన్న మౌలిక వసతుల కల్పనకు నిధులను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు గ్రామ సర్పంచ్ తుకారాం రెడ్డి తో పాటు నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ప్రజల భద్రతే మా ప్రాధాన్యత

**కందుర్గు గ్రామస్తులతో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి.ఐ.సీతారాం వెల్లడి**





**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 19 :-** రంగారెడ్డి జిల్లా కొందుర్గు పోలీస్ స్టేషన్ పరిధిలోని గూడూరు గ్రామంలో విజిబుల్ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో కందుకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సి.ఐ.) సీతారాం పాల్గొని గ్రామస్తులతో నేరుగా ముచ్చటించి భద్రతపై కీలక సూచనలు చేశారు ఈ సందర్భంగా సి.ఐ. సీతారాం మాట్లాడుతూ నేర రహిత సమాజం కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు అత్యవసర సహాయం కొరకు ఏదైనా ప్రమాదం లేదా అత్యవసర పరిస్థితి జరిగితే వెంటనే 112 నంబర్‌కు కాల్ చేయాలని, పోలీసు సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయని తెలిపారు గుర్తుతెలియని వ్యక్తులకు మీ ఓటీపీ నంబర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదు ఫోన్‌కు వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేసి మోసపోవద్దని హెచ్చరించారు కుటుంబ సమేతంగా ఊరికి వెళ్లేటప్పుడు లేదా ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి మీ పరిసరాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి ఒంటరిగా వెళ్లే మహిళలు తమ బంగారు ఆభరణాల పట్ల అప్రమత్తంగా ఉండాలి రద్దీ ప్రాంతాల్లో నిర్మానుష్య ప్రాంతాల్లో వెళ్లేటప్పుడు జాగ్రత్త వహించాలని సూచించారు నేరాల నియంత్రణలో నిందితులను పట్టుకోవడంలో సీసీ కెమెరాలు మూడో కన్నులా పనిచేస్తాయి కావున, ప్రతి వీధిలో మరియు వ్యాపార సముదాయాల వద్ద ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ మీకు తోడుగా ఉంటుందని ఈ సందర్భంగా సి.ఐ. భరోసా ఇచ్చారు.

## మీ అభిమానంతో గెలిచా.. సమస్యలు పరిష్కరిస్తా

**కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ భీమయ్య**



**నారాయణపేట ఫిబ్రవరి 19:( స్కై న్యూస్):**వార్డు ప్రజల అభిమానంతో గెలిచానని మీ సమస్యలు మీ వెంట ఉండి పరిష్కరిస్తానని నారాయణపేట మున్సిపాలి టీ 3వ వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ భీమయ్య అన్నారు.గురువారం వార్డు మహిళలు నారాయణమ్మను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ మీ అభిమానం ఇలాగే ఉంటే ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించి మీ ఆధార అభిమానాన్ని సంపాదించు కుంటానని అన్నారు. వార్డు ప్రజలు నాపై నమ్మకం ఉంచి నన్ను గెలిపించినందుకు వార్డులోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేకం గా కృషి చేస్తానని ఆమె అన్నారు గతంలో కౌన్సిలర్ గా గెలుపొందిన తర్వాత రెండవ వార్డును అన్ని విధా లుగా అభివృద్ధి చేశానని అన్నారు అదే రెండవ వార్డ్ ప్రజలు మూడో వార్డు ప్రజలకు కాకర్ల నారాయణ మ్మ మీ వార్డులో కౌన్సిలర్ గా గెలుపొందితే మా రెండోవాడు అభివృద్ధి ఎంత చెందిందో అదేవిధంగా మూడవ వాటిని కూడా అంతకంటే అభివృద్ధి చేసి చూపిస్తానని ఆమె వార్డు ప్రజలకు హామీ ఇచ్చారు. వాటిలో నిరుపేదలకు కూడా సురేష్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వ ర్యంలో ఆర్థిక సాయం లేక వారికి సహాయ సహకారాలు నా తరఫున ఎప్పుడూ ఉంటా యని తెలిపారు. ఈ కార్య క్రమంలో మూడవ వార్డు ప్రజ లు మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ రాఘవేంద్ర స్వామి 405వ పట్టాభిషేక మహోత్సవం...

**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 19(స్కై న్యూస్):**జిల్లా కేంద్రంలోని షిరెల్లి వీధి నందు శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం లో గురువారం శ్రీ గురుసార్వ భౌమ శ్రీ రాఘవేంద్ర స్వామి 405వ పట్టాభిషేక మహోత్సవం ఘనంగా జరిగింది. శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం విచారణ కర్త ప్రభాకర్,అర్చకులు సుజాయింద్ర,మేనేజర్ తెలిపారు.శ్రీ శ్రీ శ్రీ 1008 శ్రీ సుబుదేంద్ర శ్రీపాదుల వారి అజ్ఞాను సారంగా ఉదయం పట్టాభిషేకం, రథోత్సవం జరిగాయి. భక్తులు ఇట్టి కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.

# చత్రపతి శివాజీ మహారాజ్ ను నవతరం స్ఫూర్తిగా తీసుకోవాలి

**ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు**



**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 19( స్కై న్యూస్)** హిందుత్వానికి దేశభక్తికి దైవభక్తికి మారుపేరుగా నిలిచిన చత్రపతి శివాజీ మహారాజును నవతరం స్ఫూర్తిగా తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగన మోని బంగారు బాబు అన్నారు గురువారం ఆయన 396 వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ మదన్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమానికి హాజరైన బంగారు బాబు మాట్లాడుతూ చత్రపతి శివాజీ మహారాజ్ భారత దేశ చరిత్రలో అపారమైన గౌరవం పొందిన మహనీయుడు అని మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించి తల్లి జిజియాబాయి ధార్మికత దేశభక్తి తో స్వరాజ్య స్థాపన అనే సంకల్పంతో ముందుకు సాగినారని వివరించారు. ధైర్య సాహసాలతో సుల్తానుల కోటలను స్వాధీనం చేసుకుని వివరించారు రాజగోడు సింహగడు వంటి కోటలను ఆధీనంలోకి తీసుకొని గేరిల్ల యుద్ధ విధానం ద్వారా సాధించారని వాటిని వివరించారు ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్ సంయుక్త కార్యదర్శి శివ మల్లేష్ నాయకులు శివ రమేష్ జీవన్ భారత్ దేవికా కీర్తన తదితరులు పాల్గొన్నారు

## భక్తుల కోరికలు నెరవేర్చే

# యాదగిరి లక్ష్మీనరసింహుడు

తెలంగాణలోని ప్రముఖ ఆలయాలలో ఒకటైన, ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల కేంద్రము సమీపములో ఎత్తయిన గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయములో ఫిబ్రవరి 18నుండి 28 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. ఋష్యశృంగ మహర్షి, శాంతల పుత్రుడు యాదమహర్షి చిన్నతనం నుంచే హరిభక్తుడు. ఆంజనేయస్వామి సలహాపై ప్రస్తుతం యాదగిరిగా పిలవబడుతున్న ప్రదేశంలో చాలా కాలం తపస్సు చేశారు. అప్పుడు ఒక రాక్షసుడు ఆహార అన్వేషణలో అటుగావచ్చి నిశ్చల తపస్సులో వున్న ఈ ఋషిని చూసి తినబోయాడు. ఆ విషయం తపస్సులోవున్న ఋషికి తెలియలేదుగానీ, ఆయన ఎవరి గురించైతే తపస్సు చేస్తున్నాడో ఆ శ్రీహరి ఆయుధం అయిన సుదర్శన చక్రం వచ్చి ఆ రాక్షసుని సంహరించింది. అది చూసిన ఋషి ఆ సుదర్శన చక్రాన్ని పలు విధాల ప్రార్ధించి, భక్తులకు ఏవిధమైన బాధలూ కలుగకుండా దుష్ట సంహారం చేస్తూ అక్కడే వుండిపొమ్మని కోరగా ఆ సుదర్శనము అనతికాలము లోనే అక్కడ వెలయ బోవుచున్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ శిఖరాన షట్కోణాకారాన వెలసి స్వామి దర్శనానికి వచ్చు భక్తులను సదా కాపాడుతూ వుంటానని వరమిచ్చి అంతర్ధానం అయినట్లు కథనం. యాద మహర్షి తన తపస్సుని కొనసాగించగా, ఆయన తపస్సుకి మెచ్చి నరసింహస్వామి ప్రత్యక్షమై, యాద మహర్షి కోరిక మీద అక్కడ లక్ష్మీ నరసింహస్వామి గా వెలిశాడు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది. ఆ ఋషి తపస్సు చేసింది, స్వామి ప్రత్యక్షమైంది కొండక్రిందవున్న పాత లక్ష్మీ నరసింహస్వామి గుడి దగ్గర అని అంటారు. యాద మహర్షి కోరిక మీదే ఆంజనేయస్వామి యాదగిరిలో క్షేత్రపాలకుడుగా వున్నాడు. ప్రహ్లాదుని రక్షించటానికి, అహోబిలంలో నరసింహస్వామి స్తంభాన్ని చీల్చుకుని వచ్చి హిరణ్యకశిపుని సంహరించిన తర్వాత ఆ భీకర రూపాన్ని శాంత పరచటం ఎవరికీ సాధ్యం కాలేదట. అప్పుడు దేవతలంతా లక్ష్మీదేవిని ప్రార్ధిస్తే ఆమె ప్రత్యక్షమై స్వామిని శాంతింప చేసిందటప్పుడు ప్రహ్లాదుడు స్వామిని అక్కడే ప్రసన్న రూపంలో కొలువై వుండమని కోరాడట. అయితే స్వామి అతి భీకర రూపంలో దర్శనమిచ్చిన ఆ ప్రదేశంలో శాంత రూపంతో కొలువై వుండటం లోక విరుద్ధమని అక్కడికి సమీపంలో వున్న యాదగిరిలో లక్ష్మీ నరసింహస్వామిగా లోక కళ్యాణార్ధం కొలువు తీరుతానని బయల్దేరారు, లక్ష్మీ సమేతుడై కొండపై గల గుహలో వెలిశారు. ఆయనవెంట ప్రహ్లాదుడూ, సకల దేవతలూ వచ్చి ఆయనతోపాటు ఇక్కడ కొలువుతీరి స్వామిని సేవిస్తూ వచ్చారట. రాక్షస సంహారంచేసి లోక కళ్యాణం చేశారని సంతోషంతో స్వామివారి కాళ్ళని బ్రహ్మదేవుడు ఆకాశ గంగతో



కడిగాడట. ఆ ఆకాశ గంగ లోయలలోంచి పారి విష్ణు పుష్కరిణిలోకి చేరింది. ఈ పుష్కరిణికి కూడా చాలా ప్రాముఖ్యం వుంది. ఇందులో స్నానంచేసి స్వామిని సేవించినవారికి సకల కోరికలూ తీరుతాయి. ఇక్కడ పితృకార్యాలు చేస్తే పితృదేవతలు తరిస్తారు. చాలామంది భక్తులు ఆరోగ్యం, గ్రహపీడా నివారణ, వగైరా కోరికలతో కొన్నాళ్ళపాటు ఇక్కడ వుండి విష్ణు పుష్కరిణిలో స్నానం చేసి స్వామిని సేవిస్తారు. అంతేగాక ఇప్పటికీ రోజూ రాత్రుళ్ళు ఆ చుట్టుప్రక్కల కొండలమీద తపస్సు చేసుకుంటున్న ఋషులు విష్ణు పుష్కరిణిలో స్నానంచేసి స్వామిని అర్చిస్తారట. దానికి నిదర్శనంగా వారు వచ్చేటప్పుడు మృదంగ ధ్వనులు వస్తాయట. పాదాల గుర్తులు కొందరు చూశారుట. వారు స్వామిని అర్చించిన గంధ పుష్పాదులు కూడా నిదర్శనమంటారు. మెట్ల మార్గాన వెళ్తే దోవలో శివాలయం కనబడుతుంది. ఇక్కడ శివుడు లక్ష్మీ నరసింహస్వామి కన్నా ముందు స్వయంభూగా వెలిశాడు. ఇంకో విశేషం.. ఈ మెట్లు ఎక్కి స్వామిని సేవించినవారి కీళ్ళ నొప్పులు తగ్గుతాయని భక్తుల విశ్వాసం యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ ముఖద్వారం యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం నల్గొండ జిల్లాలో ప్రముఖ మైన దివ్య క్షేత్రం: యాదగిరి గుట్టకు సంబందించిన కథకు మూలం వాల్మీకి రామాయణంలో వున్నది. విభాండక ఋషి కుమారుడు రుష్యశృంగుడు. అతని కుమారుడు హాద ఋషి, అతనినే హాదర్షి అని కూడ అంటారు. అతను నరసింహ స్వామి భక్తుడు. అతనికి స్వామివారిని ప్రత్యక్షంగా చూడాలని కోరిక పుట్టింది. ఆంజనేయస్వామి సలహా మేరకు తపస్సు చేయగా స్వామి ప్రత్యక్షమవుతాడు. ఆ ఉగ్ర నరసింహ మూర్తిని చూడలేక శాంత స్వరూపంతో కనిపించమని యాదర్షి కోరగా స్వామి వారు కరుణించి లక్ష్మి సమేతుడై దర్శన మిచ్చి "ఏంకావాలో కోరుకో" మంటే యాదర్షి స్వామి వారికి "శాంత మూర్తి రూపంలోనె కొలువై కొండపై ఉండి పొమ్మని కోరాడు. ఆవిధంగా లక్ష్మి నరసింహ స్వామి కొండపై అలా కొలువై ఉండిపోయాడు. కొన్నాళ్ళకు స్వామివారిని వేర్వేరు రూపాల్లో చూడాలనిపించి యాదర్షి మరలా తపస్సు చేశాడు. అతని కోరిక మేరకు స్వామి వారు జ్వాలా, యోగా, నంద, గండబేరుండ, నారసింహ రూపాల్లో దర్శనమిచ్చాడు. అందుకే ఈ క్షేత్రాన్ని పంచ నారసింహ క్షేత్రం అంటారు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది. బ్రహ్మోత్సవాలు తొలిరోజు విశ్వక్సేన ఆరాధనతో ఆరంభమై అలంకార అవతార సేవలతో కొనసాగి 28న చక్రస్నానం, మహాపూర్ణాహుతితో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా 18న ఉదయం 10 గంటలకు విశ్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, రక్షాబంధనం, సాయంత్రం మృత్సాంగ్రహణం, అంకురారోహణ పర్వాలు నిర్వహిస్తారు. 19 ఉదయం 8 గంటలకు అగ్ని ప్రతిష్ట, 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 6:30 గంటలకు భేరీ పూజ, హవనం, దేవతాహ్వానం నిర్వహిస్తారు. 20న ఉదయం తొమ్మిది గంటలకు మత్స అవతార అలంకార సేవ, వేద పారాయణం, రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ, 21న ఉదయం 9 గంటలకు వటపత్ర శాయి అలంకార సేవ , రాత్రి 7 గంటలకు హంస వాహన సేవ, 22న ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణలంకార సేవ, రాత్రి 7 గంటలకు పొన్నవాహన సేవ, 23న ఉదయం 9 గంటలకు గోవర్ధన గిరి దారి అలంకార సేవ, రాత్రి 7 గంటలకు సింహ వాహన సేవ, 24న ఉదయం 9 గంటలకు జగన్మోహిని అలంకార సేవ, రాత్రి 7 గంటలకు అశ్వవాహన సేవ, తదుపరి శ్రీ స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. 25న ఉదయం 9 గంటలకు శ్రీరామ అలంకార హనుమంత వాహనం సేవ , రాత్రి 8 గంటలకు గజవాహన సేవ, శ్రీ స్వామి అమ్మవార్ల తిరు కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. 26వ తేదీన ఉదయం 9 గంటలకు మహా విష్ణు అలంకారం, గరుడోత్సవము, రాత్రి 8 గంటలకు దివ్యవిమాన రథోత్సవం, 27వ తేదీన ఉదయం 10.30 గంటలకు మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, సాయంత్రం 7 గంటలకు శ్రీ పుష్పయాగం, దేవతో ద్వాసన, 28వ తేదీన ఉదయం 10 గంటలకు శ్రీ స్వామివారికి అష్టోత్తర శతకటాభిషేకం, రాత్రి 9 గంటలకు శ్రీ స్వామివారి శృంగార డోలోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. దేవస్థానం ఈఓ భవానీ శంకర్ ఐఎఎస్ నేతృత్వంలో అధికారులు, అర్చకులు, సిబ్బంది వివిధ శాఖల అధికారుల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు.

## జడ్చర్ల పట్టణ ప్రజలకు..

# అందుబాటులోకి వైకుంఠ రథం



**జడ్చర్ల, ఫిబ్రవరి 19(స్పైన్యూస్):** మున్సిపల్ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత నర్సింలు జడ్చర్ల శాసనసభ్యులు అనిరుద్ రెడ్డి ఆదేశానుసారం పట్టణంలో ఎవరైనా మరణిస్తే స్మశాన వాటికకు తీసుకువెళ్లడానికి ఇబ్బందులు పడుతున్న సంగతిని దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ చైర్ పర్సన్ మున్సిపల్ కమిషనర్ పాలకవర్గం సభ్యులు ఒక వైకుంఠ రథం తీసుకోవాలని ఆలోచించి అందుబాటులోకి తీసుకురావడం జరిగింది ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ తన పదవి చేపట్టిన 15 నెలల్లో పారిశుద్యానికి కావలసిన ఒక డోజర్ ఒక జెసిబి ఒక వైకుంఠ రథం ప్రజలకు అందుబాటులోకి తేవడం జరిగింది అని ఈరోజు నుండి వైకుంఠ రథాన్ని అందుబాటులోకి తేనున్నట్టు తెలియజేయడం జరిగింది

# ఛత్రపతి శివాజీ జయంతి



**మహబూబ్ నగర్ ఫిబ్రవరి 19(స్పైన్యూస్)** :గురువారం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్ కార్యాలయంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పుష్పమాలలు సమర్పించి నమస్కారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ గారి ధర్మరక్షణ, దేశభక్తి సుశాసన స్ఫూర్తిని స్మరించుకుని, ఆయన ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# "ప్రజా భద్రత పోలీసు బాధ్యత"

**మహబూబ్నగర్:** శనివారం నాడు జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో సురక్ష పోలీసు కళాబృందం, షానుఖ టీం, శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థుల భద్రతపై సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చదువుపై పూర్తి దృష్టి పెట్టి క్రమశిక్షణతో జీవిస్తే మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని తెలిపారు. టీనేజ్ వయసులో అనవసరపు ఆకర్షణలకు, మోహా వ్యామోహాలకు లోనై విలువైన జీవితాన్ని, బంగారు భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. చదువుకోవాల్సిన వయసులో చదువుపైనే దృష్టి పెట్టాలని, బాల్య వివాహాల వల్ల బాలికల జీవితం దుర్భరంగా మారుతుందని, అలాంటి ఘటనలు ఎక్కడైనా గమనిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్లైన్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్, పోక్సో చట్టం -- 2012, సైబర్ భద్రత గురించి వివరించి, సోషల్ మీడియా ద్వారా అపరిచితుల ఫ్రెండ్ రిక్వెస్టులు, వీడియో కాల్స్, ఫోటోలు షేర్ చేయడంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఆన్లైన్ వేధింపులు, బెదిరింపులు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు లేదా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో మాట్లాడడం, అవసరమైతే "నో" అని స్పష్టంగా చెప్పడం, ఒంటరిగా ఉన్నప్పుడు అనుమానాస్పద పరిస్థితుల్లో సహాయం కోరడం చాలా ముఖ్యమని తెలిపారు.

# స్వరాజ్య సంస్థాపకుడు శివాజీ



ధర్మప్రతిష్టాపనే లక్ష్యంగా, కర్తవ్య పరాయణత్వమే ధ్యేయంగా జీవించి ధన్యుడైన వారిలో నిత్యస్మరణీయుడు ఛత్రపతి శివాజీ. అందుకే శివాజీ 'స్వరూపాన్నే ధ్యానించండి, ఆయన ప్రతాపాన్నే అనుష్ఠించండి' అని సమర్ధ రామదాసు వంటి మహనీ యులు మన జాతికి ప్రబోధించారు. హిందూ ధ్వజాన్ని మళ్ళీ ఉత్తుంగ శిఖరాలపై ఎగురవేసి, హిందూత్వంలో అమృతాన్ని నింపి ప్రాణప్రతిష్ఠ చేసిన మహనీయుడు శివాజీ. స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి, మధ్య యుగంలో హిందూ మతధర్మాన్ని పరిరక్షించిన మహోన్నత వీరుడు శివాజీ. మహారాష్ట్ర ప్రాంతంలో యాదవులు స్థాపించిన హిందూ సామ్రాజ్యం 1307 మార్చి 24తో ఢిల్లీ సుల్తాను ఖిల్జీ ద్వారా నాశనం కాగా, ఆ తర్వాత 350 ఏళ్ల వరకూ మరో హిందూ సామ్రాజ్యమే లేకుండా పోయింది. 1630, ఫిబ్రవరి 19వ తేదీన భావి హైందవ సామ్రాజ్య నిర్మాతయైన శివాజీ జన్మించాడు. దేశభక్తిని ఉగ్గుపాలతోనే రంగరించుకున్న శివాజీ తన తల్లి జిజియాబాయి పెంపకంలో అనేక విషయాలు నేర్చుకున్నాడు. 'రామ రామరాజ్యం వంటి హైందవ సామ్రాజ్యం నిర్మాణం చేయాలనే కోరిక' శివాజీలో బాల్యంలోనే స్థిర పడింది. తల్లి సంరక్షణ, దాదాజీ ఖాండ్‌దేవ్ శిక్షణతో శివాజీ వీరుడిగా అవతరించారు. భారత రామాయణాల విశిష్టత, హిందూ మతం గొప్పదనం తల్లిద్వారా నేర్చుకున్నాడు. పరమత సహనం, స్త్రీల పట్ల గౌరవం కూడా ఆమె ద్వారా పెంపొందించుకున్నాడు. తండ్రి పరాజయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనతి కాలంలో యుద్ధ తంత్రంలో నిష్ణాతుడయ్యాడు. సకల విద్యా పారంగతుడైన శివాజీ, మరాఠా సామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా వ్యూహారచన చేశాడు. శివాజీ జాగీరులో రాంఝా గ్రామ పటేలు ఒక స్త్రీని బలత్కారం చేయగా, శివాజీ 1645 జనవరి 28న పటేలును బంధించి, కాళ్ళు చేతులు నరికించి శిక్షించాడు. అలా క్రమంగా ప్రజల అభిమాన పాత్రుడైనాడు. అప్పట్లో కాశ్మీరం నుండి కావేరీ వరకు మధ్యనున్న చాందా, గోండువనం వదిలి మిగిలిన దేశమంతా తురుష్కుల అధీనంలో ఉండేది. దేవగిరి, విజయనగరం రాజ్యాలు అస్తమించాక, శివాజీ తన మిత్రులందరితో భవిష్యత్ సామ్రాజ్య నిర్మాణం కోసం దేవాలయం, కొండగుహ, కీకారణ్యం ఇసుకతిన్నెలు వంటి అనేక ప్రాంతాల్లో చర్చోపచర్చలు జరిపేవాడు. మొదట బీజాపూర్ సుల్తాన్ చే నిర్లక్ష్యం కాబడిన 'కాన' లోయలోని 'తోరణ' దుర్గాన్ని జయించి, హిందూ సామ్రాజ్య నిర్మాణానికి తోరణం కట్టాడు. తోరణ దుర్గానికి ఎదురుగా ఉన్న 'మురుంబదేవ' గిరిపై కొత్త కోటను నిర్మించి, "రాజ్ గఢ్" అని పేరు పెట్టాడు. తర్వాత 'కువారి' కోటను వశం చేసుకున్నాడు. ఇవన్నీ పదహారేళ్ళ ముక్కుపచ్చలారని ప్రాయంలో శివాజీ చేసిన గొప్ప పనులు. తర్వాత కొండణా కోటను తన స్వరాజ్యంలో కలుపు కున్నాడు. శివరళ, సుభాను మంగళి దుర్గాలను వశపరు కున్నాడు. 1648 జూలై 25న వజీరు ముస్తాపా, బాజీ ఘోర్పడేలు సైన్యంతో శివాజీ తండ్రి అయిన శహాజీని బంధించారు. శత్రువును శరణు వేడడమా? తండ్రి ప్రాణమా? స్వరాజ్యమా? అనే శివాజీ ప్రశ్నలకు... తల్లి జిజియా బాయి- తన మాంగల్యం కన్నా దేశభక్తి గొప్పదని చెప్పింది. పురంధర కోటలో ఉన్న శివాజీ సైన్యానికి, ఫతేఖాన్ సైన్యానికి భీకర యుద్ధం జరగగా శివాజీకే విజయం దక్కింది. 1648 ఆగస్టు 8న ఫతేఖాన్ ఓటమి పాలయ్యాడు. పురంధర దుర్గంలో ఫతేఖాన్, బెంగుళూరులో ఫరాదఖాన్ ఓటముల పాలు కాగా, బీజాపూర్ లో శివాజీ తండ్రి శహాజీ 1649 మే 16న బంధ విముక్తు డైనాడు. 1654 మే 23న బీజాపూర్ సుల్తాన్ మహారాజ్ పంత్ మరణించగా, ఆయన నలుగురు కుమారుల తగవుల కారణంగా శివాజీ వారిని బంధించి, ఉచిత పదవులు కట్టబెట్టి నేతాజీ పాల్కర్ అనే సర్దార్ ను అధికారిగా నియమించాడు. కృష్ణానదీ సమీపంలో టావళి అధిపతి దౌలత్ రావు మృతి చెందగా, ఆయనకు సంతానం లేకపోగా దత్తపుత్రుడైన యశ్వంతరావుకు పదవినిచ్చాడు. తన అధికారానికి ఇష్టపడని కారణాన 1656లో యుద్ధంలో యశ్వంతరావును ఓడించి శివాజీ స్వరాజ్యంలో కలుపుకున్నాడు. దీనిలో అంతర్భాగ కొండ ప్రాంతమైన 'రాయరి' కోటనే కొన్నే ళ్ళకు శివాజీ రాజధానిగా రాయగఢ్ దుర్గం ఏర్పడింది. 1956 నవంబర్ 2న బీజాపూర్ సుల్తాన్ ఆదిల్షా చనిపోగా, మొగలు సామ్రాజ్య దక్షిణ సుబేదారైన ఔరంగజేబు అనుమతిని పొంది, 1957 ఏప్రిల్ 23న స్వరాజ్యంలో కలుపుకున్నాడు. శివాజీ బీజాపూర్ ప్రాంతం నుండి కోండ్వానా కొంకణ, దండరాజపురి, భీవండి కళ్యాణి, మాహు తదితర కోటలను పోర్చుగీసు వారి నుండి చోళ ప్రాంతాన్ని జయించాడు. కటావ్, మయణి, అష్టి, ఖరాహడ్, సుపే, కొల్హాపూర్, పనాళీ గడ్, యెగావ్ తదితర కోటలను జయించాడు. ఔరంగజేబు సలహాదారులైన కారతలబ్ ఖాన్, నామదర్ ఖాన్, ఇనాయత్ ఖాన్, షహిస్త ఖాన్, భావసింహ, జస్వంత సింహ తదితరులను ఓడించాడు. అహ్మద్ నగర్ , సూరత్, జున్నర్ నగ రాలను లూటీ చేశాడు. అలా సాగిన శివాజీ తన జైత్రయాత్ర ఫలితంగా 1674 జూన్ 6న సింహాసనాన్ని అధిష్టించాడు. ఆంగ్లేయుల రాయబారి హెన్రీ ఆక్సెం డర్ శివాజీ మహారాజుకు ప్రణమిల్లి భారీగా కానుకలు సమర్పించాడు. తన రాజ్యానికి అష్టప్రధానుల పారశీక నామాలను మార్చి సంస్కృత పేర్లను శివాజీ పెట్టాడు. ప్రభుత్వ పాలన సంస్కృతంలోనే సాగాలని రాజ్య వ్యవహార కోశం తయారు చేయించాడు. యుద్ధ తంత్రాలలో మాత్రమే కాకుండా పరిపాలనా విధానంలో కూడా శివాజీ భారతదేశ రాజులలో అగ్రగణ్యుడు. మంత్రిమండలి, విదేశాంగ విధానం, పటిష్ఠమైన గూఢచారి వ్యవస్థ ఏర్పాటు చేశాడు. ప్రజలకోసమే ప్రభువు అన్న సూత్రం పాటించి, వ్యక్తిగత విలాసాలకు కాకుండా ప్రజాక్షేమం కోసమే పాటుపడ్డాడు. సుదీర్ఘంగా యుద్ధాలు చేసినా ఎన్నడూ పవిత్ర స్థలాలను ధ్వంసం చేయలేదు. ఓడిపోయిన శత్రురాజ్యంలో నిస్సహాయులు, మహిళలు, పసివారికి సహాయం చేశాడు. తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా గౌరవించాడు. కేవలం ఆలయాలే కాదు, మసీదులను సైతం కట్టించాడు. శివాజీ సైన్యంలో మూడు వంతులు ముస్లిములే. వారిని కూడా ఉన్నత పదవుల్లో నియమించాడు. ముప్పై సంవత్సరాలు శివాజీ, ఆయన అనుచరులు చూపిన పరాక్రమాలు, కర్తృత్వ శక్తి, త్యాగశీలత, ధ్యేయ నిష్ఠ హిందువులలో నూతనోత్తేజం నింపాయి. యాభై ఏళ్ళ సామ్రాజ్య నిర్మాణ కృషి ఫలితంగా దేహం పూర్తిగా అలసిపోగా ఆరోగ్యం క్షీణించడంతో, 1680 ఏప్రిల్ 3న శివాజీ తుది శ్వాస విడిచాడు. భారతీయుల ఆదర్శ పురుషునిగా నిలిచాడు.

## మీరు చెల్లిస్తున్న సుంకాల మీదనే

# రాజ్య భవిష్యం ఆధారపడింది

సామాన్య జనులారా మీరు చెల్లిస్తున్న సుంకాలు లేదా పన్నుల మీదనే రాజ్య భవిత్యం ఆధారపడింది ఉంది. ఏదైనా రాజ్యాంగాన్ని ప్రభుత్వం నడవాలంటే కచ్చితంగా పన్నుల మీదనే రాజ్యం నడుస్తుంది.. పరిపాలన నిర్వహించాలంటే పన్ను విధించాల్సిందే .మీరు చెల్లిస్తున్న పన్నులు ద్వారానే రాజ్యానికి ఆదాయం చేకూరుతుంది. వివిధ వస్తు వినియోగం ద్వారా మీరు పన్నులు చెల్లిస్తున్నారు .ఆదాయం సంపాదిస్తే "ఆదాయ పన్ను" సేవ చేస్తే సేవ పన్ను "వ్యాపారం చేస్తే వ్యాపారం పన్ను .. అమ్మితే అమ్మక పన్నులు కొనుగోలు పన్నులు రవాణా చేసే రవాణా పన్ను ఎగుమతి దిగుమతి చేసే ఎగుమతి దిగుమతి పన్నులు వసూలు చేస్తున్నారు .ప్రతి సంవత్సరం ఇంత ఆదాయం వస్తుందని బడ్జెట్ ప్రసంగాల్లో మంత్రులు చెప్తారు. ఆదాయం రాజ్యానికి ఇంత వస్తుందని వచ్చిన ఆదాయాన్ని వివిధ రూపాల్లో ఇంత ఖర్చు చేస్తున్నారు పేర్కొంటారు .సంక్షేమ రాజ్యాల్లో ప్రజాస్వామ్య రాజ్యాల్లో సామాన్య ప్రజలు చెల్లిస్తున్న పన్నుల మీదనే రాజ్యం నడుస్తుంది ఈ విషయం గమనించిన సామాన్య ప్రజలు మోసపోతున్నట్టే ..సామాన్యులు చెల్లిస్తున్న పన్ను రాజకీయ పాలకులు లూటీ చేస్తున్నారు. నీ మీద అధిక పన్నులు మోపడానికి పాలకులే కారణం.. ప్రతిసారి పన్ను రేటు పెరిగిపోవడానికి కారణం పాలకులే రాజ్యాదాయాన్ని అక్రమ మార్గంలో తరలించడం. రాజ్యానికి వస్తున్నటువంటి ఆదాయం ప్రజలందరి ఉమ్మడి ఆస్తి ..భారత రాజ్యాంగంలో 39 వ ఆర్టికల్ రాజ్యా ఆదాయాన్ని ప్రజలందరికీ సమానంగా పంపిణీ చేయాలని ఆదేశిస్తుంది .కానీ రాజకీయ పాలకులు అధికారం అధిష్టించిన తర్వాత అధికారం అందించిన ప్రజలని పక్కనపెట్టి తమ "కుటుంబం "బంధువులు ప్రయోజనాలే ముఖ్యంగా ఆధునిక పాలకులు వ్యవహరిస్తున్నారు . దేశ ఆదాయాన్ని ప్రజాసంక్షేమం కోసం వినియోగించాలని రాజ్యాంగమే నిర్దేశించింది .అధికారం అధిష్టించిన తర్వాత రాజకీయ పాలకులు వివిధ పథకాల పేరుతోటి ఆదాయాన్ని కొల్లగొడుతున్నారు .వంద శాతం అనుకుంటే అందులో 15% కూడా సామాన్యులకు అందుతలేదు .ప్రజా ఉపయోగ పథకాలు ప్రవేశపెడుతుర్రు. కమిషన్లతో మాత్రం వాళ్లు రాజ్యాన్ని దోపిడీ చేస్తుండ్రు. పథకాలేమో ప్రజల కోసం పథకాల కేటాయించిన నిధులు మాత్రం రాజకీయ పాలకుల సొంత జేబులోకి వెళ్తున్నాయి.. మీరు చెల్లిస్తున్నపన్నుల తోటే దోపిడీ రాజకీయాలు చేసి మీ మీద అధిపత్యం వహిస్తున్నారు. దేశాలను ఉదాహరణకు తీసుకుంటే .ఇంగ్లాండ్ లాంటి పెట్టుబడిదారు దేశాల్లో పెట్టుబడిదారులే పన్ను చెల్లిస్తారు. ఆ పన్నులు ఆదాయాన్ని సామాన్యులకు ఉపయోగిస్తారు .అక్కడున్న ప్రభుత్వం వారు .భారతదేశాన్ని తీసుకుంటే సామాన్యులు చెల్లిస్తున్న పన్నులని రాజకీయ నాయకులు ఉపయోగించుకుంటున్నారు .వారి విలాసాలకు వారు ఏ విధంగా అనుకుంటే ఆ విధంగా జీవితాన్ని సులువుగా ఉండేందుకు దోపిడి ఒక సాధనంగా మారింది . సామాన్య ప్రజలు మీరు చెల్లిస్తున్న పన్ను ద్వారా వారు విలాసవంతమైన జీవితాలు కడుపుతున్నారు .ఓటర్ జీవితం అక్కడే ఉంటుంది. ఓటర్ మహాశయులారా ఆలోచించండి. భారత సార్వభౌమత్వానికి మీరే మూలవారసులు .మీరు చెల్లిస్తున్న సుంకాలు తోటే రాజకీయ పాలకులు అన్ని రకాలైన పాలన కార్యక్రమాలు చేస్తున్నారు. సంక్షేమ విధానాల అమలు పరచాల్సిన పాలకులు పాలకుల సంక్షేమమే ముఖ్యంగా భావిస్తారు. ఆధునిక సంక్షేమ ప్రజాస్వామ్య రాజ్యాలన్నీ కూడా ప్రజాస్వామ్య విధానం కొనసాగి పాలకులే ధనవంతులుగా మారిపోతున్నారు .సామాన్య ప్రజలు ఏడ వేసిన గొంగడి అక్కడే ఉంటుంది. రాజ్యం యొక్క జీవితం మీ చేతిలోనే ఉంది. మీరు ఎట్లా అంటే అటే వంగుతాది .సంక్షేమ విధానాలు అమలు పరచని నాయకులని గ్రహించి ప్రతి ఐదు సంవత్సరాలు వారిని పాలన నుంచి తొలగించాలి పంపియ్యాలి. అప్పుడే మీకు చెందాల్సిన రాజ్య ఆదాయ పంపిణీ చెందుతుంది. అప్పుడే మీ భవిష్యత్ తరాలు బాగుపడతాయి. మీరు చెల్లిస్తున్న పన్నులు రాజ్యానికి జీవితం .ప్రజాస్వామ్య విధానంలో పన్నులు చెల్లిస్తున్న సామాన్య ప్రజలే అనేక రకాలైన ఇబ్బందులు పాలవుతున్నారు.



కొండ కృష్ణ
9676273325

వార్తాతరంగాలు

శుక్రవారం 20 ఫిబ్రవరి 2026

# నిద్రలేమికి ఈ తప్పులే కారణం!

ఉదయం నుంచి రాత్రి వరకు కష్టపడి సంపాదించేది తినడానికే.. తిన్నది డైజెస్ట్ కావాలన్నా.. ఆరోగ్యంగా ఉండాలన్నా శరీరానికి తగినంత విశ్రాంతి అవసరం. ఉరుకుల పరుగుల జీవితంలో పడుకోవడానికి సమయం కేటాయించడం కూడా చాలా మందికి కష్టమైపోతోంది. నిద్ర కరువైతే అనారోగ్య సమస్యలు ఒకదాని వెంట ఒకటి శరీరంపై దాడి చేస్తాయి. రోజంతా కష్టపడి పని చేసి రాత్రి ఇంటికి రాగానే హాయిగా నిద్రపోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ చాలామందికి బెడ్ ద పడుకోగానే నిద్ర రాదు. స్మార్ట్‌ఫోన్ తీసి రీల్స్ చూడటం లేదా పాత విషయాలను తలుచుకుంటూ గంటల కొద్దీ మేల్కొనే ఉంటారు. దీనివల్ల మరుసటి రోజు పనిలో ఏకాగ్రత దెబ్బతినడమే కాకుండా, చిరాకు, నీరసం ఆవహిస్తాయి. నిద్ర అనేది మన శరీరానికి ఒక రీఛార్జ్ లాంటిది. అది సరిగ్గా లేకపోతే ఆరోగ్యం దెబ్బతింటుంది. అయితే లైఫ్ స్టైల్ లో కొన్ని చిన్న మార్పులు చేసుకోవడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చని నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలో ఒక అంతర్గత గడియారం ఉంటుంది, దానినే 'సిర్కాడియన్ రిథమ్' అంటారు. ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవడం, ఉదయాన్నే ఒకే మ్కి నిద్రలేవడం అలవాటు చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల శరీరానికి ఎప్పుడు నిద్రపోవాలో ఒక పద్ధతి అలవాటు అవుతుంది. సెలవు రోజుల్లో కూడా ఈ సమయాన్ని మార్చకుండా ఉండటం వల్ల గాఢ నిద్ర పట్టే అవకాశం ఉంటుంది. చాలామంది రాత్రి పూట కూడా కాఫీ లేదా టీ తాగుతుంటారు. వీటిలో ఉండే కెఫిన్ మన మెదడును అలెర్ట్ గా ఉంచుతుంది, దీంతో నిద్ర రాదు. నిద్రపోయే ఆరు గంటల ముందే కెఫిన్ ఉన్న పానీయాలను ఆపేయాలి. అలాగే ఆల్కహాల్ తాగితే నిద్ర వస్తుందని కొందరు భావిస్తారు కానీ, అది నిద్ర నాణ్యతను దెబ్బతీస్తుంది. గాఢ నిద్రకు ఆటంకం కలిగించి అర్ధరాత్రి మెలకువ వచ్చేలా చేస్తుంది. మనం నిద్రపోయే గది ఎలా ఉందనేది మన నిద్రను ప్రభావితం చేస్తుంది. బెడ్ రూమ్ ఎప్పుడూ శుభ్రంగా, ప్రశాంతంగా ఉండాలి. గది ఉష్ణోగ్రత కు అనుకూలంగా ఉండేలా చూసుకోండి. లైట్లు డిమ్ గా ఉంటే శరీరంలో నిద్రను ప్రేరేపించే హార్మోన్లు విడుదలవుతాయి. ముఖ్యంగా పడక గదిని కేవలం నిద్రకు, విశ్రాంతికి మాత్రమే పరిమితం చేయాలి. మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల నుంచి వచ్చే 'బ్లూ లైట్' మెలటోనిన్ అనే హార్మోన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. దీనివల్ల మన మెదడు అది పగలు అని పొరబడి నిద్రను దూరం చేస్తుంది. నిద్రపోయే ఒక గంట ముందు నుంచే గాడ్జెట్లను దూరంగా పెట్టడం అలవాటు చేసుకోండి. రీల్స్ చూడటం ఒక వ్యసనంలా మారి విలువైన నిద్ర సమయాన్ని హరించేస్తుందని గుర్తించాలి. పడుకునే ముందు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడానికి కొన్ని పద్ధతులు పాటించాలి. ఒక మంచి పుస్తకం చదవడం, మెలోడీ సంగీతం వినడం లేదా గోరువెచ్చని నీటితో స్నానం చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. అలాగే డీప్ బ్రీతింగ్ (లోతైన శ్వాస) లేదా ధ్యానం చేయడం వల్ల మనస్సులోని ఆందోళనలు తొలగిపోయి శరీరం నిద్రకు సిద్ధమవుతుంది.



# కళ్ల కింద డార్క్ సర్కిల్స్, వెనుక అసలు రహస్యం ఇదే!



చాలామంది కళ్ల కింద నల్లటి వలయాలు రాగానే ఖరీదైన క్రీములు వాడుతూ ఉంటారు. కనురెప్పలు అదురుతూ ఉంటే ఏదో కీడు జరుగుతుందని భయపడతారు. కానీ ఇవన్నీ శరీరంలో ఒక ముఖ్యమైన పోషకాహారం తగ్గిందని చెప్పే హెచ్చరికలు కావొచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ముఖం పాలిపోవడం, దవడ కండరాలు బిగుసుకుపోవడం వంటి చిన్న చిన్న మార్పుల వెనుక పెద్ద ఆరోగ్య సమస్యే ఉండవచ్చు. సాధారణంగా అలసట, ఒత్తిడి లేదా ఎక్కువ కాఫీ తాగడం వల్ల కళ్లు అదురుతుంటాయి. కానీ ఇది తరచుగా జరుగుతుంటే మెగ్నీషియం లోపం కారణం కావచ్చు. మెగ్నీషియం నరాలు మరియు కండరాల మధ్య సంబంధాన్ని స్థిరంగా ఉంచుతుంది. ఇది తగ్గినప్పుడు కళ్ల చుట్టూ ఉండే చిన్న చిన్న కండరాలు స్పేమ్స్ కు గురవుతాయి.ఎంత నిద్రపోయినా కళ్ల కింద నలుపు తగ్గడం లేదంటే అది కేవలం కాస్మెటిక్ సమస్య కాదు. మెగ్నీషియం లోపం వల్ల నిద్ర సరిగ్గా పట్టదు, దీనివల్ల కళ్ల కింద చర్మం పల్చబడి రక్తనాళాలు బయటకు కనిపిస్తాయి. ఫలితంగా డార్క్ సర్కిల్స్ ఏర్పడతాయి. కేవలం క్రీములు రాస్తే ఇది తగ్గదు, ఆహారంలో మార్పులు చేసుకోవాల్సిందే. ఉదయాన్నే నిద్రలేవగానే ముఖం, కళ్లు ఉబ్బినట్లు అనిపిస్తున్నాయా? అయితే శరీరంలో ఫ్లూయిడ్ బ్యాలెన్స్ తప్పిందని అర్థం. మెగ్నీషియం వాపును తగ్గిస్తుంది. ఇది లోపించినప్పుడు ముఖం ఉబ్బుగా, చర్మం పొడిగా మరియు నిర్జీవంగా కనిపిస్తుంది. అలాగే దవడ కండరాలు బిగుసుకుపోవడం, పెదవుల దగ్గర అదురు రావడం వంటివి కూడా దీని లక్షణాలే.డెర్మటాలజీ నిపుణులు చెబుతున్న ప్రకారం.. మెగ్నీషియం, నిద్ర, జీర్ణక్రియ కలిస్తేనే అందమైన చర్మం సాధ్యం. మెగ్నీషియం వల్ల గాఢ నిద్ర పడుతుంది, ఆ సమయంలోనే చర్మం తనను తాను బాగు చేసుకుని కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది లోపిస్తే చర్మం త్వరగా ముడతలు పడటం, మొటిమలు రావడం వంటి సమస్యలు తలెత్తుతాయి. మెగ్నీషియం లోపాన్ని అధిగమించడానికి మన భారతీయ ఆహారంలో లభించే పాలకూర, గుమ్మడి గింజలు, బాదం, అరటిపండ్లు, తృణధాన్యాలు మరియు పప్పు దినుసులను డైట్‌లో చేర్చుకోవాలి. సమస్య తీవ్రంగా ఉంటే డాక్టర్ సలహాతో మెగ్నీషియం గ్లైసినేట్ వంటి సప్లిమెంట్లు వాడవచ్చు. మెగ్నీషియం లోపం అనేది నిశ్శబ్దంగా వచ్చే సమస్య. ముఖం ఇచ్చే ఈ చిన్న చిన్న సంకేతాలను గమనించడం ద్వారా పెద్ద ఆరోగ్య సమస్యలను ముందే నివారించవచ్చు.

# నల్ల మిరియాలు.. ఔషధ గుణాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు!



నల్లగా ఉన్నాయి కదా అని తీసిపారేకయండి. వీటి ప్రయోజనాలు తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఇందులో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయంటున్నారు వైద్య నిపుణులు. వీటిని ప్రతి రోజు తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఈ రోజుల్లో బరువు తగ్గడం అనేది ప్రతి ఒక్కరికీ ఒక ప్రధాన కోరికగా మారింది. చాలా మంది గంటల తరబడి వ్యాయామం చేస్తారు. కఠినమైన ఆహారాలను పాటిస్తారు. కానీ ఇప్పటికీ ఆశించిన ఫలితాలు పొందలేకపోతున్నారు. అటువంటి పరిస్థితిలో వంటగదిలో ఉండే నల్ల మిరియాలు వంటి చిన్న మసాలా దినుసును సరిగ్గా ఉపయోగించడం వల్ల బరువు తగ్గడానికి సహాయపడుతుందని కు తెలిస్తే ఆశ్చర్యపోతారు. నల్ల మిరియాలు ఆహారాన్ని కారంగా మార్చడమే కాకుండా, శరీర కొవ్వును కాల్చే సామర్థ్యాన్ని కూడా పెంచుతాయి. ఇందులో ఉండే పైపెరిన్ అనే సమ్మేళనం జీవక్రియను వేగవంతం చేస్తుంది. శరీరంలో నిల్వ ఉన్న కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఉబ్బరాన్ని నివారిస్తుంది. శరీరం థర్మోజెనిక్ కార్యకలాపాలను పెంచుతుంది. నిర్విషీకరణలో సహాయపడుతుంది. అందువల్ల ప్రతిరోజూ సరైన మొత్తంలో నల్ల మిరియాలను తీసుకోవడం వల్ల బరువు తగ్గించే ప్రయాణం సులభం, వేగంగా ఉంటుంది. ఇది థర్మోజెనిక్ కార్యకలాపాలను పెంచుతుంది. ఇది కేలరీలను వేగంగా బర్న్ చేయడానికి సహాయపడుతుంది. ఇది యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది శరీరాన్ని నిర్విషీకరణ చేస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఇది ఆహారం బాగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. ఉబ్బరం నివారిస్తుంది.

# మానసిక ఒత్తిడితో మలబద్ధకం సమస్య వస్తుందా?

నేటి కాలంలో తెలియకుండానే మన ఆరోగ్యాన్ని నాశనం చేస్తోంది. ముఖ్యంగా ఒత్తిడి జీర్ణ సమస్యలకు హాని కలిగిస్తుందని కు తెలుసా? అవును.. గట్ ఆరోగ్యానికి, మెదడుకు ఒకదానితో ఒకటి అనుసంధానం ఉంటుందట. అందుకే వాటిని 'గట్-బ్రెయిన్ యాక్సిస్' అని పిలుస్తారు. రెండో మార్గం కమ్యూనికేషన్ వ్యవస్థ. ఇటీవలి కాలంలో ప్రతి ఒక్కరూ తీవ్ర ఒత్తిడితో చిత్తవుతున్నారు. ఇది తెలియకుండానే మన ఆరోగ్యాన్ని నాశనం చేస్తోంది. ముఖ్యంగా ఒత్తిడి జీర్ణ సమస్యలకు హాని కలిగిస్తుందని కు తెలుసా? అవును.. గట్ ఆరోగ్యానికి, మెదడుకు ఒకదానితో ఒకటి అనుసంధానం ఉంటుందట. అందుకే వాటిని 'గట్-బ్రెయిన్ యాక్సిస్' అని పిలుస్తారు. రెండో మార్గం కమ్యూనికేషన్ వ్యవస్థ. నరాలు, హార్మోన్లు, పేగు మైక్రోబయోటా ఈ సంబంధాన్ని నిర్వహిస్తాయి. ఈ గట్-బ్రెయిన్ యాక్సిస్ వ్యవస్థ కారణంగా ఒత్తిడి జీర్ణవ్యవస్థను ప్రత్యక్షంగా, తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఇది మలబద్ధకం, విరేచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలకు దారితీస్తుంది. ఐఓఅ హాస్పిటల్‌లోని మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ అనురాగ్ శెట్టి దీని గురించి మరింత సమాచారాన్ని అందించారు. ఒత్తిడి సమయంలో నాడీ వ్యవస్థ అధిక చురుకుదనం వల్ల ప్రేగు కదలికలు మందగిస్తుంది. దీని వల్ల మలబద్ధకం వస్తుంది. దీనితో పాటు ఒత్తిడి హార్మోన్ల ఉత్పత్తి పెరగడం, పేగు పారగమ్యత పెరగడం, గట్ మైక్రోబయోటాలో మార్పులు సంభవిస్తాయి. ఇవన్నీ మలబద్ధకానికి దోహదం చేస్తాయి. ఒత్తిడి సమయంలో తినే విధానాలు కూడా మారుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఎక్కువ స్వీట్లు తినడం, ఎక్కువ కెఫిన్ తీసుకోవడం, ఎక్కువ ప్రాసెస్ చేసిన ఆహారాలు తీసుకోవడం, ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు తినకపోవడం ఇవన్నీ జీర్ణక్రియను ప్రభావితం చేస్తాయి. ఇది ఒక విష చక్రం మాదిరి పని చేస్తుంది. ఇక్కడ ఒత్తిడి మలబద్ధకానికి కారణమవుతుంది. మలబద్ధకం ఒత్తిడిని పెంచుతుంది. ఒత్తిడిని తగ్గించడం చాలా ముఖ్యం. ఇది మానసిక, శరీరక ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుంది. అలాగే ఫైబర్ అధికంగా ఉండే పండ్లు, కూరగాయలను తినాలి. మొలకలు తినడం, తగినంత నీళ్లు తాగడం చేయాలి. రోజువారీ వ్యాయామం, తగినంత శారీరక శ్రమ అవసరం. మలవిసర్జన సంకేతాలను విస్మరించవద్దు. శరీరాన్ని శుభ్రంగా ఉంచడానికి ఇది అవసరమని గుర్తుంచుకోండి. మలబద్ధకం సమస్య సాధారణ పద్ధతుల ద్వారా పరిష్కరించబడకపోతే, సమస్య చాలా కాలం పాటు కొనసాగితే బరువు తగ్గడం, హిమోగ్లోబిన్ స్థాయిలు తగ్గితే, మలంలో రక్తం కనిపిస్తే, కుటుంబంలో ఎవరికైనా పెద్దప్రేగు క్యాన్సర్ చరిత్ర ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మర్చిపోకూడదు.



# బిజినెస్

## భారత్‌లో కొత్త కార్యాలయం ప్రారంభించిన ఆంథ్రోపిక్




భారత్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో ప్రపంచ స్థాయిలో ప్రభావం చూపుతూ దేశంలోనే తొలిసారి అంతర్జాతీయ ఏఐ సదస్సు 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గ్లోబల్ ఏఐ కంపెనీ ఆంథ్రోపిక్ బెంగళూరులో తన కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. అత్యాధునిక టెక్నాలజీ కోసం డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించే క్రమంలో ఆంథ్రోపిక్ ఈ నిర్ణయం తీసుకుంది. బెంగళూరులోని కార్యాలయం టోక్యో తర్వాత ఆసియా-పసిఫిక్‌లో రెండో కార్యాలయమని చెబుతోంది. భారత మార్కెట్ ఆంథ్రోపిక్‌కు రెండో అత్యధిక యాక్టివ్ యూజర్లు ఉన్న ప్రాంతం. కొత్త కార్యాలయం ద్వారా కంపెనీ దేశీయంగా విద్య, వ్యవసాయం, డిజిటల్ సేవలతో పాటు వివిధ రంగాల్లో కార్యకలాపాలను పెంచాలని భావిస్తోంది. భారత మార్కెట్లో సురక్షితమైన, విశ్వాసంతో కూడిన ఏఐ సొల్యూషన్స్ అందించేందుకు పనిచేస్తాం. ముఖ్యంగా బాధ్యతాయుత ఏఐ అభివృద్ధి, వినియోగంపైనే తమ దృష్టి ఉంటుందని, ఏఐ ఉత్పాదకతను పెంచే సాధనంగా మాత్రమే కాకుండా సమాజానికి మేలు చేసేలా ఉపయోగించాలని ఆంథ్రోపిక్ పేర్కొంది.

## 2035కు రూ.215 లక్షల కోట్ల రిటెయిల్ విపణి



మన దేశ భారత రిటెయిల్ రంగ విపణి పరిమాణం 2035 నాటికి రూ.210-215 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని ఓ నివేదిక తెలిపింది. 2025లోని రూ.90- 95 లక్షల కోట్ల స్థాయితో పోలిస్తే, ఈ విలువ రెట్టింపు కంటే ఎక్కువ. దిగ్గజ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలకు మించి భారత్ రాణిస్తుండటం, మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశలో సాగుతుండటం ఇందుకు కారణమవుతుందని ఆ నివేదిక వివరించింది. 'రిటెయిల్ లీడర్‌షిప్ సదస్సు- 2026'లో బోస్టన్ కన్సల్టింగ్ గ్రూపు (బీసీజీ), రిటెయిలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (రాయ్) సంయుక్తంగా ఈ నివేదికను విడుదల చేశాయి. మలివిడత వృద్ధి పథంలో భారత రిటెయిల్ రంగం సాగుతోందని నివేదిక తెలిపింది. క్రమశిక్షణతో వ్యూహాల అమలుపై దృష్టి సారించే కంపెనీలు విజయం సాధిస్తాయని, కృత్రిమ మేధ సాంకేతికతను అందిపుచ్చుకోవడమూ ముఖ్యమేనని పేర్కొంది. వినియోగదారులతో సత్సంబంధాలు, కార్యకలాపాల విధానాలు, నైపుణ్యం లాంటి విభాగాల్లో వ్యవస్థాగత మార్పులకు ప్రాధాన్యమిచ్చే రిటెయిల్ సంస్థలు.. అత్యధిక మార్కెట్ వాటా సొంతం చేసుకోగలిగే స్థితిలో ఉంటాయని వివరించింది.

# ఎప్‌స్టీన్ ఫైల్స్ ఎఫెక్ట్.. హయత్ హోటల్స్ చైర్మన్ థామస్ ప్రిట్జ్కర్ రాజీనామా




ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పటికే చాలామంది ప్రముఖుల పేర్లు ఇందులో బహిర్గతమయ్యాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హయత్ హోటల్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, బిలియనీర్ థామస్ ప్రిట్జ్కర్ పేరుకు కూడా బయటకు వచ్చింది. దీంతో ఆయన తన పదవికి, బోర్డు సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించారు. లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో తనకు ఉన్న సంబంధాలపై వస్తున్న వరుస కథనాల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా జెఫ్రీ ఎప్‌స్టీన్ అతడి గర్ల్‌ఫ్రెండ్ గిస్లైన్ మాక్స్‌వెల్‌తో పరిచయాలు పెంచుకుని తాను తప్పు చేశానని థామస్ ప్రిట్జ్కర్ అంగీకరించారు. 2008లో జెఫ్రీ ఎప్‌స్టీన్ లైంగిక నేరస్థుడిగా నిర్ధారణ అయిన తర్వాత కూడా అతడితో ప్రిట్జ్కర్ ఈ-మెయిల్ ద్వారా సంభాషణలు జరిపినట్లుగా ఇటీవల బయటపడిన 'ఎప్‌స్టీన్ ఫైల్స్'లో వెల్లడైంది. కాగా, జెఫ్రీ ఎప్‌స్టీన్ బాధితురాలైన వర్జీనియా గిఫ్రే 2016లో ఇచ్చిన ఒక డిపాజిషన్‌లో ప్రిట్జ్కర్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఎప్‌స్టీన్ తనను ప్రిట్జ్కర్ వద్దకు పంపించాడని ఆమె పేర్కొన్నారు. అయితే, ఈ లైంగిక వేధింపుల ఆరోపణలను ప్రిట్జ్కర్ మొదటి నుంచీ తీవ్రంగా ఖండిస్తూనే ఉన్నారు. రాజీనామా సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెఫ్రీ ఎప్‌స్టీన్, మాక్స్‌వెల్ వల్ల బాధితులకు జరిగిన అన్యాయానికి తాను ఎంతగానో విచారిస్తున్నానని అన్నారు. వారితో సంబంధాలు కొనసాగించినందుకు ఎటువంటి సాకులు చెప్పనని పేర్కొన్నారు. హయత్ హోటల్స్ ప్రయోజనాల దృష్ట్యా తాను అన్ని బాధ్యతల నుంచి తప్పుకుంటున్నానని థామస్ ప్రిట్జ్కర్ స్పష్టం చేశారు.

## మూడో నెలలోనూ పెరిగిన టోకు ధరలు



దేశంలో టోకు ధరల ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) వరుసగా మూడో నెలలోనూ పెరిగింది. కేంద్ర పరిశ్రమల శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది జనవరి నెలలో టోకు ద్రవ్యోల్బణం 1.81 శాతానికి చేరింది. ప్రధానంగా ఆహార పదార్థాలు, ఆహారేతర వస్తువులు, తయారీ రంగ ఉత్పత్తుల ధరలు పెరగడమే ఇందుకు కారణమని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇంతక్రితం డిసెంబర్‌లో డబ్ల్యూపీఐ 0.83 శాతంగా ఉంది. డిసెంబర్‌లో మైనస్ 0.43 శాతంగా ఉన్న ఆహార ద్రవ్యోల్బణం.. జనవరిలో ఒక్కసారిగా 1.55 శాతానికి ఎగబాకింది. ముఖ్యంగా కూరగాయల ధరలు ఎగిసిపడ్డాయి. డిసెంబర్‌లో మైనస్ 3.50 శాతంగా ఉన్న కూరగాయల ధరలు అమాంతం జనవరిలో 6.78 శాతం ప్రియమయ్యాయి. ప్రాథమిక లోహాలు, వస్త్రాలు, ఇతర తయారీ ఉత్పత్తుల ధరలు పెరగడంతో ఈ విభాగంలో ద్రవ్యోల్బణం 1.82 శాతం నుంచి 2.86 శాతానికి పెరిగింది. అహారేతర వస్తువుల ద్రవ్యోల్బణం జనవరిలో అత్యధికంగా 7.58 శాతానికి ఎగిసింది. ఇంతక్రితం నెలలో ఇది కేవలం 2.95 శాతంగా ఉండటం విశేషం. కాగా.. ఇంధనం, విద్యుత్ రంగం సూచీ మాత్రం డిసెంబర్‌లో మైనస్ 2.31 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం జనవరిలో మరింత తగ్గి మైనస్ 4.01 శాతానికి చేరాయి. గత వారం విడుదలైన గణాంకాల ప్రకారం రిటైల్ ద్రవ్యోల్బణం కూడా జనవరిలో స్వల్పంగా పెరిగి 2.75 శాతానికి చేరింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధానంగా రిటైల్ ద్రవ్యోల్బణం ఆధారంగానే వడ్డీ రేట్లను నిర్ణయిస్తుంది. ప్రస్తుతం ధరలు నెమ్మదిగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ నెల ప్రారంభంలో జరిగిన సమీక్షలో ఆర్బీఐ కీలక వడ్డీ రేట్లను 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగించింది. ముందుముందు ఆహార పదార్థాల ధరలు మరింత పెరిగితే.. ఆర్బీఐ తన పరపతి విధానంలో కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

## 'ఎక్స్' సేవల్లో భారీ అంతరాయం..




ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజ ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ట్విట్టర్) సేవలు సాయంత్రం ప్రపంచవ్యాప్తంగా స్తంభించింది. భారత్‌తో పాటు అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో వేలాది మంది వినియోగదారులు తీవ్ర సాంకేతిక సమస్యలను ఎదుర్కొన్నారు. యాప్, వెబ్‌సైట్.. రెండింటిలోనూ ఈ అంతరాయం కలగడంతో యూజర్లు గందరగోళానికి గురయ్యారు. ప్రముఖ వెబ్‌సైట్ 'డౌన్‌డెటెక్టర్' గణాంకాల ప్రకారం.. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 6:40 గంటల సమయంలో ఈ సమస్య మొదలైంది. కేవలం కొద్ది నిమిషాల్లోనే 25,000కు పైగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్లాట్‌ఫామ్‌ను యాక్సెస్ చేయడంలోనూ, కొత్త పోస్టులను లోడ్ చేయడంలోనూ సమస్యలు తలెత్తుతున్నట్లు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. మరికొందరు లాగిన్ క్రెడెన్షియల్స్ పనిచేయడం లేదని పేర్కొన్నారు. అంతరాయానికి గల ఖచ్చితమైన కారణాలు ఇప్పటి వరకు తెలియరాలేదు. సాంకేతిక సమస్యపై 'ఎక్స్' సంస్థ ప్రతినిధుల నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఒకేసారి ఈ సమస్య తలెత్తడం చూస్తుంటే, ఇది కేంద్రీకృత సర్వర్ సమస్య అయి ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నట్లు జాతీయ మీడియా చెబుతోంది. 'ఎక్స్' ప్లాట్‌ఫామ్‌కు అంతరాయం కలగడం ఇదే మొదటిసారి కాదు. గత మార్చి 2025 లో కూడా ఇలాగే భారీ స్థాయిలో సేవలు నిలిచిపోయాయి. గతేడాది 2024 నవంబర్‌లో క్లౌడ్‌ఫ్లేర్ సర్వీసుల్లో తలెత్తిన సమస్య వల్ల 'ఎక్స్' సహా పలు వెబ్‌సైట్లు మొరాయించాయి. ప్రస్తుతం సేవలు నెమ్మదిగా పునరుద్ధరించబడినట్లు జాతీయ మీడియా సమాచారం అందుతోంది.

# అతడిపై వేటు!.. భారత తుదిజట్టు ఇదే!




టీ20 ప్రపంచకప్-2026 టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ టీమిండియా హ్యాట్రిక్ విజయాలతో జోరు మీద ఉంది. గ్రూప్-ఎ నుంచి అమెరికా, నమీబియా వంటి పసికూనలపై గెలుపొందిన భారత్.. చివరగా దాయాది పాకిస్తాన్‌ను మట్టికరిపించిది. 'చిరకాల ప్రత్యర్థి'ని 61 పరుగుల తేడాతో చిత్తు చేసి.. లీగ్ దశలో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సూపర్-8కు అర్హత సాధించింది. ఇక గ్రూప్-ఎలో భాగంగా నామమాత్రపు మ్యాచ్‌లో టీమిండియా బుధవారం రాత్రి (ఫిబ్రవరి 18) మరో పసికూన నెదర్లాండ్స్‌తో తలపడనుంది. ఇందుకు అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదిక.

**అభిషేక్ శర్మ డకౌట్ అయినా..**

కాగా ఇప్పటికే సూపర్-8కు చేరిన తరుణంలో నెదర్లాండ్స్‌తో ఆడే తుదిజట్టులో భారత్ మార్పులు చేసే అవకాశం ఉంది. ఓపెనర్‌గా అభిషేక్ శర్మ (0,0) రెండు మ్యాచ్‌లు ఆడి డకౌట్ అయినా.. అతడిని కొనసాగించడం ఖాయమే. దీంతో మరోసారి సంజూ శాంసన్‌కు మొండిచేయి తప్పదు. ఇక ఇప్పటికే ఓపెనర్‌గా ఇరగదీస్తూ.. పాక్‌పై భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఇషాన్ కిషన్ స్థానానికి ఢోకా లేదు. సూర్యకుమార్ కెప్టెన్సీలోని ఈ జట్టులో తిలక్ వర్మ, శివం దూబే, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి కొనసాగటం లాంఛనమే.

**బుమ్రాకు రెస్ట్.. అతడిపై వేటు**

అయితే, పాక్‌తో మ్యాచ్ ఆడిన ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు నెదర్లాండ్స్ మ్యాచ్ నుంచి విశ్రాంతినిచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే అతడి స్థానంలో అర్ష్‌దీప్ సింగ్ రావడం పక్కా. అదే విధంగా.. కుల్దీప్ యాదవ్‌ను తప్పించి.. అతడి స్థానంలో వాషింగ్టన్ సుందర్‌ను తుదిజట్టులో ఆడించే యోచనలో మేనేజ్‌మెంట్ ఉన్నట్లు సమాచారం. కాగా టీ20 వరల్డ్‌కప్ టోర్నీకి ముందు గాయపడిన వాషీ.. నమీబియాతో మ్యాచ్ నుంచి అందుబాటులోకి వచ్చాడు. పూర్తి ఫిట్‌నెస్ సాధించినప్పటికీ అతడి విషయంలో మేనేజ్‌మెంట్ రిస్క్ తీసుకోలేదు. అయితే, నెదర్లాండ్స్‌తో నామమాత్రపు మ్యాచ్‌లో ఆడించి తదుపరి మ్యాచ్‌లకు అతడిని సన్నద్ధం చేయనున్నట్లు సమాచారం.

**నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌కు భారత తుదిజట్టు (అంచనా)**

ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, శివం దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్.

## సెమీస్‌లో భారత్, పాక్



బ్యాంకాక్ వేదికగా జరుగుతున్న ఏసీసీ మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నీలో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ సెమీఫైనల్‌కు చేరాయి. ఇవాళ (ఫిబ్రవరి 17) జరిగిన మ్యాచ్‌ల్లో భారత-ఏ జట్టు నేపాల్‌పై.. పాకిస్తాన్-ఏ జట్టు యూఏఈపై ఘన విజయాలు సాధించి, ఫైనల్ ఫోర్‌లోకి ప్రవేశించాయి. సెమీస్‌లో భారత్, పాక్ ఎదుర్కోబోయే ప్రత్యర్థులు ఎవరో రేపు జరుగబోయే బంగ్లాదేశ్-ఏ, మలేషియా.. శ్రీలంక-ఏ, థాయ్‌లాండ్ మ్యాచ్‌లతో తెలుస్తుంది. ఈ టోర్నీలో భారత్, పాక్ ఒకే గ్రూప్‌లో (ఏ) ఉన్నాయి. ఈ గ్రూప్ నుంచి భారత్, పాక్ మొదటి రెండు స్థానాల్లో నిలిచి సెమీస్‌కు అర్హత సాధించాయి. ఈ గ్రూప్‌లో యూఏఈ.. భారత్, పాక్‌కు గట్టి పోటీనిచ్చింది. ఆ జట్టు కూడా భారత్, పాక్‌తో సమానంగా మూడింట రెండు మ్యాచ్‌లు గెలిచింది. ఇవాల్టి మ్యాచ్‌లో పాక్ చేతిలో ఓటమితో యూఏఈ టోర్నీ నుంచి నిష్క్రమించింది. గ్రూప్-ఏలో మరో జట్టు నేపాల్, ఆడిన 3 మ్యాచ్‌ల్లో పరాజయాలు ఎదుర్కొని ఖాతా తెరవకుండానే టోర్నీ నుంచి వైదొలిగింది. గ్రూప్-బిలో బంగ్లాదేశ్-ఏ సెమీస్ బెర్త్ ఇదివరకే ఖరారైనప్పటికీ.. సెమీస్‌లో వారు ఎదుర్కోబోయే ప్రత్యర్థి ఎవరో మలేషియా మ్యాచ్ ఫలితంతో తెలుస్తుంది. ఎందుకంటే గ్రూప్-బిలో ఆ జట్టు స్థానాన్ని (1,2) మలేషియా మ్యాచ్ ఫలితం డిసైడ్ చేస్తుంది. గ్రూప్-బిలో మరో సెమీస్ బెర్త్ కోసం శ్రీలంక-ఏ, థాయ్‌లాండ్ పోటీపడుతున్నాయి. ఇరు జట్ల మధ్య రేపటి మ్యాచ్‌లో ఏ జట్టు గెలిస్తే, ఆ జట్టుకే సెమీస్ బెర్త్ దక్కుతుంది. ప్రస్తుతం శ్రీలంక-ఏ, థాయ్‌లాండ్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో చెరో మ్యాచ్ గెలిచి బంగ్లాదేశ్-ఏ తర్వాత రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఈ గ్రూప్‌లో మలేషియా ఆడిన 2 మ్యాచ్‌ల్లో ఓడి నాలుగో స్థానంలో ఉంది. ఫిబ్రవరి 20న జరిగే వేర్వేరు సెమీఫైనల్స్‌లో భారత్, పాక్ పోటీపడతాయి. సెమీస్‌లో ఈ రెండు జట్లు గెలిస్తే.. ఫైనల్లో ఎదురెదురుపడతాయి. ఈ మ్యాచ్ ఫిబ్రవరి 22న జరుగనుంది. నేపాల్ మ్యాచ్‌లో భారత బౌలర్లు చెలరేగిపోయారు. తనూజా కన్వర్ 4, మిన్ను మణి 3, కెప్టెన్ రాధా యాదవ్ 2 వికెట్లతో సత్తా చాటడంతో నేపాల్ 18 ఓవర్లలో 78 పరుగులకే కుప్పకూలింది. నేపాల్ ఇన్నింగ్స్‌లో సమ్జానా ఖడ్కా (22) టాప్ స్కోరర్‌గా నిలిచింది. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని భారత్ 7.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. బ్రిందా దినేశ్ 39 పరుగులతో అజేయంగా నిలిచి భారత్‌ను విజయతీరాలకు చేర్చింది. మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈని పాక్ 17.2 ఓవర్లలో 79 పరుగులకే కుప్పకూల్చింది. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని పాక్ 11 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది

# స్పోర్ట్స్

## ఆస్ట్రేలియా కొంపముంచిన వాన.. సూపర్ 8లో జింబాబ్వే..!




ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో సూపర్ 8పై ఆశలు పెట్టుకున్న ఆస్ట్రేలియాకు వరుణుడు బిగ్ షాకిచ్చాడు. పల్లెకెలె స్టేడియంలో కుండపోత కారణంగా ఐర్లాండ్ -- జింబాబ్వే మ్యాచ్ రద్దయ్యింది. ఈ మ్యాచ్ వర్షార్పణం కావడంతో.. మాజీ ఛాంపియన్ ఆసీస్ అనూహ్యంగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. రెండు మ్యాచ్లులోనూ నెగ్గి.. మ్యాచ్ రద్దుతో ఒక పాయింట్.. మొత్తంగా ఐదు పాయింట్లతో గ్రూప్ బీ నుంచి జింబాబ్వే జట్టు సూపర్ 8కు దూసుకెళ్లింది. ఐసీసీ ఈవెంట్లలో చెలరేగిపోయే ఆస్ట్రేలియా ఈసారి నాకౌట్‌కు ముందే ఇంటిదారి పట్టింది. పేస్ దళంలో అనుభవజ్ఞులైన ప్యాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్ లేకపోవడం.. టాపార్డర్ వైఫల్యం, నిలకడలేమి.. ఆ జట్టు పాలిట శాపంగా మారాయి. జింబాబ్వే చేతిలో 23 పరుగుల తేడాతో.. శ్రీలంకపై 8 వికెట్ల తేడాతో ఓడడం మిచెల్ మార్ష్ నేతృత్వంలోని కంగారూ జట్టు నాకౌట్ అవకాశాల్ని సంక్లిష్టం మార్చాయి. మంగళవారం కొలంబోలోని పల్లెకెల్ స్టేడియంలో ఐర్లాండ్ చేతిలో జింబాబ్వే ఓడితే ఆసీస్‌కు అవకాశం ఉండేది. కానీ.. వర్షం కారణంగా ఐర్లాండ్ -- జింబాబ్వే మ్యాచ్ రద్దయ్యింది. వర్షం ఎంతకూ తగ్గకపోవడంతో టాస్ వేయకుండానే ఆటను రద్దు చేసి ఇరుజట్లకు చెరొక పాయింట్ కేటాయించారు. దాంతో.. 5 పాయింట్లతో ఆఫ్రికా జట్టు ముందంజ వేయగా.. మూడింటా ఒకేఒక మ్యాచ్ గెలిచిన ఆసీస్, ఐర్లాండ్ టోర్నీ నుంచి వైదొలిగాయి. చివరి మ్యాచ్‌లో ఒమన్‌పై ఆస్ట్రేలియా గెలుపొందినా 4 పాయింట్లతో మూడో స్థానంలో నిలుస్తుంది. కాబట్టి.. జింబాబ్వే నాకౌట్ దశకు అర్హత సాధించింది. గత సీజన్‌లో ఒమన్ చేతిలో ఓడి ప్రపంచకప్ ఆడే అవకాశం చేజార్చుకున్న ఆఫ్రికా టీమ్ ఈసారి సికిందర్ రజా నాయకత్వంలో సంచలన ప్రదర్శనతో సూపర్ 8లో అడుగుపెట్టడం విశేషం.



## నేను కేవలం కమర్షియల్ బొమ్మలా మిగిలిపోవాలని అనుకోలేదు..

టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకులకు సుపరిచితురాలైన నటి రెజీనా కసాండ్రా.. తన నటనతో, చురుకైన మాటలతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది. అయితే, కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా వైవిధ్యమైన పాత్రలు చేయాలనే ఉద్దేశంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఈ ముద్దుగుమ్మకు అక్కడ చేదు అనుభవాలు ఎదురయ్యాయి. 2019లో 'ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసాలగా' సినిమాతో హిందీ తెరకు పరిచయమైన రెజీనా, అక్కడి ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడానికి నిశ్శబ్ద పోరాటం చేస్తూనే ఉంది. తాజాగా.. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రెజీనా ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో తనకు ఎదురైన చేదు అనుభవాలను పంచుకుంది. "నేను సౌత్ ఇండియా నుంచి వచ్చాననే కారణంతో నన్ను ఒక మూసలో బంధించారు. నిజానికి చాలామంది ఉత్తరాది వారికంటే నా హిందీ చాలా స్పష్టంగా ఉంటుంది. నేను హిందీ రాయగలను, చదవగలను, అనర్గళంగా మాట్లాడగలను. నా ప్రతి సినిమాకు నేనే సొంతంగా డబ్బింగ్ చెప్పుకుంటాను. అయినప్పటికీ, నన్ను అక్కడ ఒక పరాయి వ్యక్తిలా చూశారు" అని రెజీనా తన ఆవేదన వ్యక్తం చేసింది. కేవలం మాటలతోనే కాకుండా, కొందరు తమ ప్రవర్తనతో కూడా తనను తక్కువ చేసి చూపిస్తూ కించపరిచేవారని, ఇది తన మనసును ఎంతో గాయపరిచిందని ఆమె వాపోయింది. ముఖ్యంగా ఉత్తరాది నటీమణులు దక్షిణాది సినిమాల్లో సులభంగా పాత్రలు దక్కించుకుంటుంటే, దక్షిణాది నటీమణులు మాత్రం హిందీలో పంజాబీ లేదా నార్త్ ఇండియన్ పాత్రలు చేయలేరనే ముద్ర వేయడం అన్యాయమని ఆమె ప్రశ్నించింది.

## నన్ను రాజకీయాల్లోకి లాగొద్దు..



యాక్టర్ త్రిష తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. నాగేంద్రన్ విజయ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ నటి త్రిష పేరును వివాదంలోకి లాగడం తీవ్ర దుమారం రేపింది. విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' పార్టీపై విమర్శలు చేసే క్రమంలో, "విజయ్ ముందుగా త్రిష ఇంటి నుంచి బయటకు వచ్చి రాజకీయాలు చేయాలి" అంటూ నాగేంద్రన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై నటి త్రిష సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. "గౌరవం లేని ప్రవర్తనను ఎప్పుడూ ప్రశ్నించాలి" అని పేర్కొంటూ ఆమె ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు. రాజకీయాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు ఇంత అసభ్యంగా, ఒక మహిళా నటి వ్యక్తిగత జీవితాన్ని కించపరిచేలా మాట్లాడటం అత్యంత హేయమైన చర్య అని ఆమె మండిపడ్డారు. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం తన పేరును వాడుకోవడం తనను తీవ్రంగా కలచివేసిందని త్రిష ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వివాదంపై రాజకీయ వర్గాల నుంచి కూడా పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. డీఎంకే ఎంపీ కనిమొళి, ఇతర మహిళా సంఘాల నేతలు నైనార్ నాగేంద్రన్ తీరును తప్పుబట్టారు. మహిళల పట్ల ఇలాంటి 'గుటర్ పాలిటిక్స్' (నీచ రాజకీయాలు) చేయడం బీజేపీ సంస్కృతికి నిదర్శనమని వారు విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కూడా త్రిషకు మద్దతుగా నిలుస్తూ, నాగేంద్రన్ వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, బీజేపీ శ్రేణులు మాత్రం ఈ వ్యాఖ్యలను ప్రత్యర్థి పార్టీలు కావాలనే వక్రీకరిస్తున్నాయని సమర్థించుకుంటున్నారు.



## హే బల్‌వంత్' లాంటి సినిమా కోసం ఎదురుచూశాను: హీరో సుహాస్

ఇటీవల 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి', 'ఈషా' వంటి వరుస విజయాలను అందుకున్న సక్సెస్‌ఫుల్ ద్వయం బన్నీ వాస్, వంశీ నందిపాటి తాజాగా నిర్మించిన చిత్రం 'హే బల్‌వంత్'. గతంలో 'హే భగవాన్'గా ప్రకటించిన ఈ చిత్ర టైటిల్‌ను తాజాగా మార్చారు. నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లపై గోపీ అచ్చర దర్శకత్వంలో రూపొందిన ఈ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ ఫిబ్రవరి 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో సుహాస్ మంగళవారం పాత్రికేయులతో ముచ్చటించి, సినిమా విశేషాలను పంచుకున్నారు.

### టైటిల్ మార్పు వెనుక కారణం

టైటిల్ మార్పు గురించి సుహాస్ స్పందిస్తూ.. 'భగవాన్' అంటే భగవంతుడు అనే అర్థం వస్తుంది. సెన్సార్ సభ్యుల సూచనల మేరకు సినిమా కాన్సెప్ట్‌ను, టైటిల్‌ను పరిగణనలోకి తీసుకుని 'హే బల్‌వంత్'గా మార్చాం. ఇందులో భాగంగా సీనియర్ నటుడు నరేష్ గారి క్యారెక్టర్ పేరును కూడా మార్చడం జరిగింది" అని తెలిపారు. సినిమాలో తన పాత్ర గురించి సుహాస్ వివరిస్తూ.. ఇందులో నేను చిన్నప్పటి నుంచి బిజినెస్ చేయాలని తపించే కుర్రాడిగా కనిపిస్తాను. తన తండ్రి చేసే బిజినెస్‌ను తను టేకాఫ్ చేయాలనుకున్నప్పుడు ఎదురైన పరిణామాలు ఏమిటి? ఆ బిజినెస్ నేపథ్యం ఏంటి? అనే అంశాలను దర్శకుడు చాలా వినోదాత్మకంగా మలిచారు. నా కెరీర్ మొదట్లో షార్ట్ ఫిలింస్‌లో చేసిన తరహా కామెడీ ఈ సినిమాలో మళ్ళీ కనిపిస్తుంది అని సుహాస్ చెప్పారు.

### వేగంగా పూర్తయిన షూటింగ్

నా కెరీర్‌లో ఓకే అయిన వెంటనే షూటింగ్ పూర్తి చేసుకుని, అతి త్వరితగతిన విడుదలకు సిద్ధమైన సినిమా ఇది. తక్కువ వర్కింగ్ డేస్‌లో పూర్తి చేసినప్పటికీ, క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడలేదు. మళ్ళీ నా కెరీర్‌లో ఇంత ఫాస్ట్‌గా ఒక సినిమా జరుగుతుందా? అనిపించేంత వేగంగా ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యింది అని పేర్కొన్నారు.

### సక్సెస్ పై నమ్మకం

గత సినిమాల ఫలితాలపై స్పందిస్తూ.. విజయం కోసం ఎదురుచూడటం కొంత బాధగా అనిపించినా, వెంటనే తదుపరి సినిమాకు సిద్ధమవుతాను. వరుస సినిమాల తర్వాత కొంచెం గ్యాప్ తీసుకుని, మంచి కథ కోసం వేచి చూసి ఈ సినిమా చేశాను. వంశీ నందిపాటి గారు మాకు ఎంతో ధైర్యాన్ని ఇస్తున్నారు. మా ఆవిడ కూడా సినిమా చూసి, 'నువ్వు చేయాల్సింది ఇలాంటి సినిమాలే' అని మెచ్చుకుంది. ఈ సినిమా నాకు తప్పకుండా విజయాన్ని అందిస్తుందనే నమ్మకం ఉంది అని ధీమా వ్యక్తం చేశారు. తమిళ చిత్రం 'మందాడి'లో తాను మెయిన్ విలన్‌గా నటిస్తున్నట్లు సుహాస్ వెల్లడించారు. 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' చూసి ఆ చిత్ర బృందం తనను సంప్రదించారని, ఆ సినిమాలో తన లుక్ చాలా డిఫరెంట్‌గా ఉంటుందని తెలిపారు.



## కొండగట్టు అంజన్నకు అర్జున్ సర్జా ప్రత్యేక పూజలు

తెలంగాణలోని ప్రముఖ హనుమాన్ ఆలయంలో హీరో అర్జున్ సర్జా ప్రత్యేక పూజలు చేశారు. కొండగట్టు అంజన్న ఆలయాన్ని తన కూతురు ఐశ్వర్య అర్జున్‌తో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. తాను మొదటిసారి ఈ క్షేత్రానికి వచ్చానని అర్జున్ తెలిపారు. సీతాపయనం మూవీ రిలీజ్ తర్వాత కొండగట్టుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అర్జున్ సర్జా మాట్లాడుతూ.. 'ఆంజనేయస్వామి ఆలయానికి రావడం అంటే నాకు చాలా ఇష్టం. కొండగట్టు చాలా సార్లు విన్నా. అందుకే మొదటిసారి ఇక్కడికి వచ్చా. ఈ ఆలయానికి రావాలని చాలా రోజులుగా అనుకుంటున్నా. సీతాపయనం మూవీ రిలీజ్ సందర్భంగా కొండగట్టుకు రావడం చాలా ఆనందంగా ఉంది. అందరికీ మంచి జరగాలి. సర్వేజనా సుఖినోభవంతు' అని అన్నారు. కాగా.. అర్జున్ సర్జా దర్శకత్వం వహించిన లేటెస్ట్ మూవీ సీతాపయనం. ఈ చిత్రంలో ఆయన కూతురు ఐశ్వర్య అర్జున్ హీరోయన్‌గా మెప్పించింది. ఈ మూవీ ఇటీవలే వాలెంటైన్స్ డే సందర్భంగా థియేటర్లలో రిలీజైంది. ఈ చిత్రంలో అర్జున్ సర్జా కీలక పాత్రలో మెప్పించారు.

## చెక్‌బౌన్స్ కేసులో అమీషా పటేల్.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా క్లారిటీ

ఇప్పటికే చెక్‌బౌన్స్ కేసులో నటుడు రాజ్‌పాల్ యాదవ్ తిహార్ జైలులో ఉన్నాడు. అతడు బెయిల్ మీద జైలు నుంచి విడుదలయ్యేలోపే ఇప్పుడు మరో బాలీవుడ్ నటి వివాదంలో చిక్కుకుంది. ఒకప్పటి స్టార్ హీరోయిన్ అమీషా పటేల్‌పై చెక్ బౌన్స్ కేసు నమోదైనట్లు తెలుస్తోంది. అయితే, ఈ అంశంపై ఇన్‌స్టాగ్రామ్ వేదికగా హీరోయిన్ క్లారిటీ ఇచ్చింది. 2017లో నవంబర్ 16న అమీషా పటేల్ మొరాదాబాద్‌లో ఒక పెళ్లి వేడుకలో డాన్స్ చేయాల్సింది. ఇందుకుగాను అడ్వాన్స్‌గా నిర్వాహకుడు పవన్ వర్మ ఆమెకు రూ.14.5 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించాడు. ఆమె కోసం హోటల్ రూం, ఫ్లైట్ టిక్కెట్స్ కూడా బుక్ చేశాడు. అయితే, ఆమె ఈవెంట్‌కు హాజరు కాలేదు. దీంతో నిర్వాహకుడు తనకు జరిగిన నష్టానికి తిరిగి డబ్బులు చెల్లించాల్సిందిగా అమీషాను కోరాడు. దీంతో మధ్యవర్తుల ద్వారా ఇరు పార్టీల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం ఆమె అతడికి ఆ డబ్బు చెల్లించేందుకు అంగీకరించింది. మొదట రూ.10 లక్షలు నగదు రూపంలో చెల్లించింది. మిగతా రూ.4.5 లక్షలకు చెక్ ఇచ్చింది. కానీ, ఆ చెక్ బౌన్స్ కావడంతో నిర్వాహకుడు వర్మ తిరిగి అమీషాపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ అంశంలో ఇప్పటివరకు ఆమె కోర్టుకు హాజరుకాకపోవడంతో అమీషా పటేల్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. దీనిపై అమీషా పటేల్.. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందించారు. తనపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని, ఇది చాలా కాలం నాటి కేసు అని ఆమె పేర్కొన్నారు. పవన్ తనపై చేస్తున్న తప్పుడు ఆరోపణల్ని ఎదుర్కొనేందుకు తన న్యాయవాదుల బృందం ప్రయత్నిస్తోందని క్లారిటీ ఇచ్చారు. తను ఈ అంశంలో నిర్వాహకుడికి పూర్తి డబ్బు చెల్లించినట్లు పేర్కొన్నారు. అయితే, ఎవరి వాదనలో నిజం ఉందో మరికొంతకాలం తర్వాత తేలుతుంది.



# భారత్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ భూటాన్ ప్రధానితో మోదీ చర్చలు



దిల్లీలో జరుగుతున్న ప్రతిష్టాత్మకమైన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' వేళ ప్రధాని నరేంద్ర మోదీ, భూటాన్ ప్రధాని షెరింగ్ తోబ్గేతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. కృత్రిమ మేధ శక్తిని ప్రపంచ క్షేమం కోసం ఎలా వినియోగించుకోవాలనే అంశం సహా పలు విషయాలపై ఇరువురు నేతల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయి. ఈ భేటీ అనంతరం ప్రధాని మోదీ స్పందించారు. తమ భేటీ అద్భుతంగా జరిగిందని మోదీ పేర్కొన్నారు. భారత్–భూటాన్ స్నేహబంధం కొత్త రంగాలకు విస్తరిస్తూనే ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు మోదీ ట్వీట్ చేశారు. భారత్– భూటాన్ మధ్య ఉన్న పరస్పర విశ్వాసం, సద్భావన మన భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు చేరుస్తాయని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

"ప్రధాని షెరింగ్ తోబ్గేతో జరిగిన సమావేశం బాగా జరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ప్రపంచ మలు కోసం, సుస్థిరత కోసం ఎలా ఉపయోగించుకోవచ్చనే అంశంపై చర్చించాం. పరస్పర విశ్వాసం, సద్భావన, ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలతో పాతుకుపోయిన భారత్–భూటాన్ స్నేహం, మన భాగస్వామ్యాన్ని కొత్త రంగాల వైపు నడిపిస్తూనే ఉంది" అని ప్రధాని మోదీ తెలిపారు.

ఇరువురు నేతల భేటీపై భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రధాని మోదీ, భూటాన్ ప్రధాని షెరింగ్ తోబ్గేలు ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం, సహకారంలో సాధించిన పురోగతిని సమీక్షించారని పేర్కొన్నారు. "భారత్–ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా ప్రధాని మోదీ, భూటాన్ ప్రధాని షెరింగ్ తోబ్గేతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇంధనం, కనెక్టివిటీ, అభివృద్ధి భాగస్వామ్యం, ప్రజల మధ్య సంబంధాల రంగాలలో ద్వైపాక్షిక సహకార పురోగతిని ఇద్దరు నాయకులు సమీక్షించారు. ఏఐ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి అంగీకరించారు. విశ్వాసం, సద్భావన, పరస్పర గౌరవంతో కూడిన భారత్–భూటాన్ భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తామని ఇద్దరు నాయకులు పునరుద్ఘాటించారు" అని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

అంతకుముందు భూటాన్ ప్రధాని తోబ్గే బుధవారం ఉదయం దిల్లీ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా స్పందించారు. దిల్లీలో జరుగుతున్న 'భారత్–ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' కోసం వచ్చిన భూటాన్ ప్రధాని షెరింగ్ తోబ్గేకు స్వాగతమని పేర్కొన్నారు.

**గ్లోబల్ సౌత్ దేశాల్లో మొదటిది**

'భారత్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' ఫిబ్రవరి 20 వరకు దిల్లీలోని భారత్ మండపంలో జరగనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)పై ప్రపంచవ్యాప్త చర్చలను ముందుకు తీసుకెళ్లడానికి ఈ సదస్సు దోహదపడనుంది. గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమి) నిర్వహించిన మొట్టమొదటి గ్లోబల్ ఏఐ సదస్సు ఇదే కావడం గమనార్హం. "సర్వజన హితాయ, సర్వజన సుఖాయ" అనే నినాదంతో ఈ సమ్మిట్ నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో 110 కంటే ఎక్కువ దేశాలు, 30 అంతర్జాతీయ సంస్థలు పాల్గొంటున్నాయి. ఇందులో దాదాపు 20 దేశాల అధినేతలు, 45 దేశాల నుంచి మంత్రులు హాజరయ్యారు. భూటాన్ ప్రధానితో పాటు ఫ్రెంచ్ అధ్యక్షుడు మాక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా ద సిల్వా, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, ఓపెన్ ఏఐ సామ్ ఆల్ట్‌మాన్ వంటి టెక్ దిగ్గజాలు ఈ సమ్మిట్‌కు హాజరయ్యారు.

**కజకిస్థాన్ ప్రధానితో మోదీ భేటీకి**

వాణిజ్యం, ఇంధనం, కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్స్, రక్షణ రంగాలలో కజకిస్థాన్‌తో ద్వైపాక్షిక సహకారానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' సందర్భంగా కజకిస్థాన్ ప్రధాని ఓల్జాస్ బెక్టెనోవ్‌తో సమావేశమైన అనంతరం, మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. "ప్రధానమంత్రి ఓల్జాస్ బెక్టెనోవ్, నేను ఈ రోజు సమావేశమయ్యాము. ఆయన పర్యటన భారత్–కజకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది" అని మోదీ అన్నారు.

# భారతీయ విద్యార్థులకు వీసా ప్రక్రియను సులభతరం చేస్తాం



భారతీయ విద్యార్థుల కోసం వీసా, అడ్మిషన్ ప్రక్రియను సరళీకరిస్తామని, అలాగే ఫ్రాన్స్‌లో ఇంగ్లీష్ మాధ్యమంలో బోధించే కోర్సులను పెంచుతామని ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ బుధవారం ప్రకటించారు. 2030 నాటికి భారతీయ విద్యార్థుల సంఖ్యను ఏడాదికి 30,000కు పెంచడమే లక్ష్యంగా ప్రధాని మోదీతో కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. భారతదేశ పర్యటనలో భాగంగా బుధవారం దిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి విద్య, శాస్త్రీయ సమావేశంలో మేక్రాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ క్యాంపస్‌లో ఆయన ప్రసంగిస్తూ, భారత్–ఫ్రాన్స్ విద్యా సంబంధాలను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

**వీసా ప్రక్రియను సులభతరం చేస్తాం!**

"రానున్న రోజుల్లో మా దేశానికి ఎక్కువ మంది భారతీయ విద్యార్థులను స్వాగతించాలనుకుంటున్నాం. అదేవిధంగా, అలాగే ఫ్రెంచ్ విద్యార్థులు కూడా భారత్‌కు రావాలని కోరుకుంటున్నాం. ప్రస్తుతానికి భారత్? నుంచి ఫ్రాన్స్ వచ్చే విద్యార్థుల సంఖ్య 10వేలుగా ఉంది. ఆ సంఖ్యను 2030 నాటికి 30,000లకు పెంచాలని ప్రధాని మోదీతో చర్చించా. ఫ్రాన్స్ వైపు నుంచి మేము అడ్మిషన్ల ప్రక్రియను, వీసా విధానాన్ని సరళీకరిస్తాం. విద్యార్థుల అంచనాలకు అనుగుణంగా ఈ ప్రక్రియలను మరింత ఆచరణాత్మకంగా మారుస్తాం"

**ఇండో–ఫ్రెంచ్ క్యాంపస్**

ఈ సందర్భంగా మేక్రాన్?, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి, 'ఇండో–ఫ్రెంచ్ క్యాంపస్ ఆన్ ఏఐ ఇన్ గ్లోబల్ హెల్త్'ను ప్రారంభించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలలో ఇరు దేశాల మధ్య సహకారాన్ని పెంచడానికి ఇది ఒక కీలక అడుగు అని అన్నారు. పరిశోధన, ఆవిష్కరణ, సామర్థ్య నిర్మాణం వంటి అంశాల్లో పరస్పర సహకారాన్ని మరింతగా పెంచడం దీని లక్ష్యమని పేర్కొన్నారు.

**ఆంగ్ల మాధ్యమంలో విభిన్న కోర్సులు**

మరోవైపు, ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే భారత విద్యార్థులకు ప్రపంచ స్థాయి బోధన, ప్రముఖ పరిశోధనా కేంద్రాల్లో పని చేసే అవకాశాలు లభిస్తాయని మెక్రాన్? చెప్పుకొచ్చారు. ఆంగ్ల మాధ్యమంలో విభిన్న కోర్సులు అందుబాటులో ఉంచడం ద్వారా భారత విద్యార్థులకు మరింత సౌలభ్యం కల్పిస్తామని వెల్లడించారు. 'మా వద్ద ఉత్తమ బోధన సదుపాయాలు ఉన్నాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పరిశోధనా కేంద్రాలు ఉన్నాయి. విద్యార్థులకు ఆంగ్లంలో కూడా విభిన్న కోర్సులు అందిస్తాం. ఉన్నత విద్యలో వారికి అవసరమైన అన్ని విధాల సహాయ, సహకారాలను అందిస్తాం' అని మెక్రాన్ హామీ ఇచ్చారు.

**భారత్‌తో రక్షణ సంబంధాలపై మెక్రాన్ వ్యాఖ్యులర**

అంతకుముందు, కూడా ముంబయిలో జరిగిన 'ఇండియా–ఫ్రాన్స్ ఇన్నోవేషన్ ఫోరమ్'లో మెక్రాన్? మాట్లాడారు. భారత్‌తో కుదిరిన రక్షణ సంబంధాలపై ఆయన ప్రస్తావించారు. 'నేల, నీరు ఆకాశం ఇలా అంతటా భారత్– ఫ్రాన్స్ ఒకరికొకరం సహాయ సహకారాలు అందించుకుంటున్నాం' అని మెక్రాన్? తెలిపారు. ఆవిష్కరణ అంటే కేవలం సాంకేతిక రంగంలో సాధించే విజయాలు మాత్రమే కాదని, అవి సామాన్య ప్రజల ప్రయోజనం కోసం, వారి జీవితాలను మెరుగుపరచడం కోసమని మెక్రాన్? పేర్కొన్నారు. ప్రజల జీవితాలను మరింత ఆరోగ్యకరంగా, సురక్షితంగా మార్చడం కోసం అనే ఉమ్మడి ఆకాంక్షతోనే ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. అదేవిధంగా, రక్షణ రంగంలో సాంకేతిక బదిలీపై కూడా ఫ్రాన్స్ అధ్యక్షుడు కీలక వ్యాఖ్యలు చేశారు. జలాంతర్గాములు, రాఫెల్ యుద్ధ విమానాలు, ఐదో తరం విమానాల ఇంజన్లు ఇలా అనేక రంగాలలో ఫ్రాన్స భారత్‌తో కలిసి పని చేస్తోందని మెక్రాన్? తెలిపారు. ఈ రంగంలో సాంకేతిక బదిలీని తాము కూడా విశ్వసిస్తామని చెప్పారు. అయితే, ఈ అంశాన్ని తాము కూడా ప్రతిపాదించినట్లు మెక్రాన్ చెప్పుకొచ్చారు. దీంతో పాటు అంతరిక్ష రంగం వంటి అనేక ఇతర విషయాల్లోనూ ఇరు దేశాల మధ్య సంబంధాలు కొన్నేళ్లుగా అద్భుతంగా కొనసాగుతున్నాయని మెక్రాన్? చెప్పుకొచ్చారు. అందుకే జులైలో తాము ఫ్రాన్స్‌లో నిర్వహించబోయే అంతరిక్ష రంగ సదస్సుకు భారత్‌ను ఆహ్వానించామని ఆయన స్పష్టం చేశారు.

# అమెరికా–భారత్ మధ్య 'సబ్‌సీ కేబుల్ రూట్'

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారత్ అసాధారణ రీతిలో ముందుకు సాగుతోందని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ చెప్పారు. భారత ఏఐ పరివర్తనలో భాగస్వామ్యం అయ్యేందుకు తమ సంస్థ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. దిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా విశాఖలో ఏర్పాటు చేస్తున్న ఏఐ హబ్‌ను గుర్తుచేసిన ఆయన, తాజాగా అమెరికా–భారత్ పేరిట కొత్త కార్యక్రమాన్ని ప్రకటించారు. అమెరికా, భారత్, దక్షిణ గోళార్ధంలోని పలు ప్రాంతాల మధ్య ఏఐ కనెక్టివిటీని మెరుగుపర్చడానికి కొత్త సబ్‌సీ కేబుల్ రూట్‌లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. మరోవైపు ఏఐ ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నట్లు వివరించిన సుందర్ పిచాయ్, ఆరోగ్య సంరక్షణ డయాగ్నస్టిక్స్‌ను మెరుగుపర్చడం నుంచి రైతులకు రియల్–టైమ్ అలర్ట్‌లు అందించడం వరకు అనేక సమస్యలను పరిష్కరించవచ్చని వివరించారు. భారతదేశ వైవిధ్యం, భాషా వ్యవస్థ, బలమైన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నూతన ఆవిష్కరణలకు శక్తిమంతమైన పునాది అని పేర్కొన్నారు. ఏఐ వినియోగంలో విశ్వాసం, భద్రత, సమగ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సుందర్ పిచాయ్ సూచించారు. సాంకేతికత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, ఫలితాల ఆధారంగా ఉన్నప్పుడు ప్రజలకు నమ్మకం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

**జెమినైకు భారత్ పెద్ద మార్కెట్**

"పర్సనల్ ఏఐ అసిస్టెంట్ జెమినై యాప్ ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇందులో భారత్ మా అతిపెద్ద మార్కెట్లలో ఒకటి. భారత్‌లో మాట్లాడే పది భాషల్లో ఇది అందుబాటులో ఉంది. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గత ఏడాది 15బిలియన్ డాలర్లతో విశాఖలో ఏఐ హబ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించాం. ఇది గిగావాట్ స్థాయిలో ఏర్పాటవుతుంది. సరికొత్త ప్రపంచస్థాయి సముద్ర కేబుల్ గేట్‌గా మారుతుంది. కటింగ్ ఎడ్జ్ ఏఐ ద్వారా ఉద్యోగాలు వస్తాయి. భారత్‌లోని అన్ని ప్రాంతాల ప్రజలు, వ్యాపారవేత్తలకు సేవలు అందుతాయి" అని తెలిపారు.

## 78 ఏళ్ల వయస్సులో పీజీ కంప్లీట్ గోల్డ్ మెడలిస్ట్ సుష్మ సక్సెస్ స్టోరీ ఇదే!



చదువుకు వయసుతో సంబంధం లేదని ఆమె నిరూపించారు. ఆసక్తి ఉండాలే కానీ ఏ వయసులోనైనా చదువును కొనసాగించొచ్చని సుష్మ మోఘే రుజువు చేశారు. ఆమె 78 ఏళ్ల వయసులో మరాఠీ సాహిత్యంలో పీజీ కోర్సును పూర్తి చేసి సరికొత్త రికార్డును నెలకొల్పారు. నామమాత్రంగా కోర్సును చేయడం కాదు, ఫైనల్ ఎగ్జామ్స్‌లో మొదటి ర్యాంకును సాధించి అందరితో సుష్మ శభాష్ అనిపించుకున్నారు. మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్ ఆమెకు గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. సుష్మ మోఘే మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ నగర వాస్తవ్యురాలు. ఆమె తొలుత మ్యూజిక్ కోర్సులో డిగ్రీ చేశారు. అనంతరం ఒక కేంద్ర ప్రభుత్వ స్కూలులో మ్యూజిక్ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. ఈ ఉద్యోగం చేస్తూనే, కెమిస్ట్రీలో పీజీ కోర్సును పూర్తి చేశారు. ఇక మ్యూజిక్ టీచర్‌గా దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సుష్మ సేవలు అందించారు. 2000 సంవత్సరంలో రిటైరయ్యాక, పుస్తకాలను హిందీ నుంచి మరాఠీ భాషలోకి అనువాదం చేసే పనులను చేశారు. సొంతంగా వివిధ టాపిక్స్‌పై పుస్తకాలను రాశారు. ఆమె రాసిన పుస్తకాల్లో దాదాపు డజను వరకు ఇప్పటికే పబ్లిష్ అయ్యాయి.

**76 ఏళ్ల వయసులో పీజీ అడ్మిషన్**

మరాఠీ సాహిత్యం, రచనలు అంటే సుష్మకు మహా ఇష్టం. అందుకే రెండేళ్ల క్రితం ఇండోర్‌లో ఉన్న దేవి అహల్య విశ్వవిద్యాలయంలో మరాఠీ సాహిత్యం పీజీ కోర్సులో జాయిన్ అయ్యారు. వాస్తవానికి పీజీ కోర్సుల్లో జాయిన్ కావడానికి గతంలో ఏజ్ లిమిట్ ఉండేది. కానీ కొన్నేళ్ల క్రితమే వయో పరిమితి నిబంధనను యూనివర్సిటీ తొలగించింది. దీంతో 76 ఏళ్ల సుష్మ పీజీ కోర్సులో జాయిన్ అయ్యేందుకు లైన్ క్లియర్ అయ్యింది. ఇంత పెద్ద ఏజ్‌లో దేవి అహల్య విశ్వవిద్యాలయంలో పీజీలో చేరిన తొలి వ్యక్తిగా ఆమె రికార్డును సొంతం చేసుకున్నారు.

**పీజీ ఫైనలియర్‌లో 1వ ర్యాంకు**

పీజీ చేయాలనే సుష్మ నిర్ణయానికి కుటుంబంలోని వాళ్లంతా మద్దతు పలికారు. తప్పకుండా జాయిన్ కండి అంటూ ప్రోత్సహించారు. పీజీలో చేరిన సుష్మ, ఇంట్లో తీరిక దొరికినప్పుడల్లా పుస్తకాలు చదవడానికే సమయాన్ని కేటాయించారు. కట్ చేస్తే, రెండేళ్ల పీజీ కోర్సు పూర్తయింది. మరాఠీ సాహిత్యం పీజీ కోర్సు ఫైనలియర్ పరీక్షల్లో అత్యధిక మార్కులతో 1వ ర్యాంకును ఆమె సాధించారు. యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్‌గా ఎంపికయ్యారు.

**కొడుకు, కోడలు, మనవడి సమక్షంలో గోల్డ్ మెడల్**

తాజాగా మంగళవారం రోజు (ఫిబ్రవరి 17న) దేవి అహల్యా విశ్వవిద్యాలయంలో ఘనంగా స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుష్మను యూనివర్సిటీ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ మంగూభాయ్ పటేల్ గోల్డ్ మెడల్‌తో సత్కరించారు. 78 ఏళ్ల సుష్మ గోల్డ్ మెడల్‌ను అందుకోవడాన్ని చూసి, సభికులు కరతాళ ధ్వనులను మోగించారు. విశేషం ఏమిటంటే, ఈ కార్యక్రమానికి సుష్మ కుమారుడు గౌరవ్, కోడలు పూజ, మనవడు రేయాంశ్ కూడా హాజరయ్యారు. ఏడు పదుల వయసులో సుష్మ సాధించిన ఘన విజయాన్ని చూసి వాళ్లు పొంగిపోయారు. "నాకు మొదటి నుంచే చదవడం, రాయడం అంటే ఆసక్తి. చదువుకు వయసుతో సంబంధమే లేదు. తొలుత నేను మ్యూజిక్‌లో డిగ్రీ చేశాను. అనంతరం టీచర్ జాబ్ చేస్తూ కెమిస్ట్రీలో పీజీ చేశాను. ఇప్పుడు మరాఠీ సాహిత్యంలో పీజీని పూర్తి చేశాను. నాకు గోల్డ్ మెడల్ వచ్చింది. చాలా కష్టపడి పీజీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యారు. ఈక్రమంలో నా ఫ్యామిలీ చాలా బాగా సహకరించింది" అని సుష్మ మోఘే తెలిపారు. "మా అత్తమ్మను చదువులో మేమంతా ప్రోత్సహించాం. ఆమె ఇటీవలే పీజీ కోర్సులో గోల్డ్ మెడలిస్ట్‌గా నిలిచారు. పీజీ పరీక్షలకు మా అత్తమ్మ సీరియస్‌గా ప్రిపేర్ అయ్యారు. చదువుకు వయసుతో సంబంధం లేదని ఆమె నిరూపించారు" అని సుష్మ కోడలు పూజా మోఘె తెలిపారు. "ఫిబ్రవరి 17న మా యూనివర్సిటీకి చెందిన 230 మంది విద్యార్థులకు డాక్టరేట్లను గవర్నర్ మంగూభాయ్ పటేల్ ప్రదానం చేశారు. వీరిలో 130 మంది విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ లభించాయి. ఈ విద్యార్థులకు పీజీ పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చాయి" అని ఇండోర్‌లోని దేవి అహల్యా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ రాకేశ్ సింఘాయ్ తెలిపారు. రిటైర్మెంట్ తర్వాత కూడా సీనియర్ సిటిజెన్లకు లైఫ్ ఉంటుందనే గొప్ప సందేశాన్ని సుష్మ ఈ సమాజానికి అందించారు. జీవితంలోని ఏ దశలోనైనా చదువును కొనసాగించొచ్చని ఆమె రుజువు చేశారు.

## రెండో వారంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు నోటిఫికేషన్

**న్యూఢిల్లీ :** ఈ ఏడాదిలో జరగబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ఈసీ కసరత్తు ప్రారంభించింది. బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరీల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రక్షాళన చేపట్టింది. ఈ ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. ఎస్ఐఆర్‌పై ఓ పక్క విపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. దీంతో ఎన్నికల తేదీలను మార్చి రెండో వారంలో ప్రకటించి, చివరి వారంలో నోటిఫికేషన్ విడుదల చేస్తుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈసీ అధికారులు.. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.పశ్చిమ బెంగాల్, తమిళనాడు సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. వచ్చే ఏప్రిల్‌లో బెంగాల్, తమిళనాడు శాసనసభకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ వర్గాలు తెలిపాయి. వీటితో పాటు కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీలకు పోలింగ్ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు మార్చి రెండో వారంలో షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలిపాయి. ఇక, ఈ రాష్ట్రాల్లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు ఇప్పటికే ఈసీ అధికారులు పర్యటనలు ప్రారంభించారు. ప్రస్తుతం ఈసీ బృందం అసోంలో పర్యటిస్తుంది.తమిళనాడు, కేరళ, పశ్చిమ్ బెంగాల్ అసెంబ్లీలకు మే నెలలోనూ.. పుదుచ్చేరి శాసనసభకు జూన్ 15తో గడువు ముగియనుంది. ఇక, ఎన్నికల జరగనున్న రాష్ట్రాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చివర దశకు చేరుకుంది. ఫిబ్రవరి 10 అసోం, ఫిబ్రవరి 14న పుదుచ్చేరిలో ఓటర్ల జాబితా ప్రచురించిన సంగతి తెలిసిందే. తమిళనాడులో మంగళవారం తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు. ఫిబ్రవరి 21న కేరళ, 28న పశ్చిమ బెంగాల్లో తుది జాబితాలు విడుదలవుతాయి. కానీ, ఎస్ఐఆర్‌పై తమిళనాడు, బెంగాల్‌లో రగడ కొనసాగుతోంది.తమిళనాడులో డిసెంబరు 19న విడుదల చేసిన ముసాయిదాలో 97 లక్షల మంది పేర్లను తొలగించారు. బెంగాల్‌లోనూ 58 లక్షల మంది పేర్లు డిలీట్ చేశారు. ఇప్పటికే దీనిపై తమిళనాడు, బెంగాల్ ముఖ్యమంత్రులు ఎంకే స్టాలిన్, మమతా బెనర్జీలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై దీదీ యుద్ధం ప్రకటించారు. సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలు చేసి, స్వయంగా మమతా బెనర్జీ వాదనలు వినిపించడం గమనార్హం.బెంగాల్‌లో వరుసగా మూడుసార్లు అధికారం చేపట్టిన మమతా బెనర్జీ.. నాలుగోసారి హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమయ్యారు. అటు, బీజేపీ సైతం అధికారం కోసం విశ్వప్రయత్నాలు చేస్తోంది. గత ఎన్నికల్లో తామే అధికారంలోకి వస్తామని భారీ అంచనాలు పెట్టుకుంది. ఎగ్జిట్ పోల్స్‌లో ఆ పార్టీకే అనుకూలమని వచ్చినా.. ఫలితాలు మాత్రం కమలానికి షాకిచ్చాయి. 2011, 2016కు మించి భారీ మెజార్టీతో మమతా బెనర్జీ గెలిచారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137